

'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 102

సోమవారం 3-7-2023

టెక్నో పెయింట్స్

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అవినాశ్ సబ్లేకు ఐదో స్థానం

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో భారత ఆటగాడు అవినాశ్ సబ్లే ఐదో స్థానంతో ముగించాడు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఈ ఈవెంట్ జరుగుతోంది. రేస్‌ను అవినాశ్ 8 నిమిషాల 21.88 సెకన్లలో ముగించాడు. మొరాకోకు చెందిన ఎల్ బకాలి సూఫియాన్ (8 నిమిషాల 9.84 సెకన్లు) మొదటి స్థానంలో నిలవగా...వేల్ గెట్‌నెట్ (ఇథియోపియా - 8 నిమిషాల 12.27 సెకన్లు) రెండు, సిమి అబ్రహామ్ (8 నిమిషాల 16.82 సెకన్లు) మూడు స్థానాల్లో నిలిచారు. వర్షం కారణంగా అథ్లెటిక్స్ ట్రాక్ చిత్తడిగా ఉండటంతో ఆటగాళ్లంతా తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోయారు.

‘పతనం ఎప్పుడో మొదలైంది’

వరల్డ్‌కప్‌కు వెస్టిండీస్ దూరం కావడం తననేమీ ఆశ్చర్యపర్చలేదని విండీస్ మాజీ పేసర్ ఇయాన్ బిషప్ వ్యాఖ్యానించాడు. గత కొన్నేళ్లుగా జట్టు మెలమెల్లగా పతనం అవుతూ వచ్చిందని, ప్రస్తుత బృందంకంటే కూడా ముందు ఆడిన జట్లలోనే ఇది కనిపించిందన్న బిషప్... వన్డేల్లో తమ జట్టు గత దశాబ్దకాలం నుంచే పేలవ ప్రదర్శన కనబర్చిందని అభిప్రాయ పడ్డాడు.



స్టోక్స్ బెదరగొట్టినా...



- ఆస్ట్రేలియాదే రెండో టెస్టు
- 43 పరుగులతో ఓడిన ఇంగ్లండ్
- బెన్ స్టోక్స్ అద్భుత శతకం వృథా

‘యాషెస్’లో బెన్ స్టోక్స్ మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు... 2019లో హెడింగ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్ తరహాలో ఒంటి చేత్తో జట్టును గెలిపించేలా కనిపించాడు... ఓటమికి చేరువవుతున్న స్థితిలో ఆస్ట్రేలియా శిబిరంలో ఆందోళన కనిపించింది...అయితే గెలుపు కోసం ఇంగ్లండ్ మరో 70 పరుగులు చేయాల్సిన స్థితిలో అతడిని పడగొట్టడంలో ఆసీస్ సఫలమైంది. లార్డ్స్‌లో గెలుపు జెండా ఎగరేసి 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఏ స్థితిలోనైనా ‘బజ్‌బాల్’ను కొనసాగిస్తానంటూ పట్టుదలగా నిలిచి సిక్సర్లతో చెలరేగినా... చివరకు జట్టును మాత్రం స్టోక్స్ గెలిపించలేకపోయాడు.

లండన్: ఆస్ట్రేలియా జట్టు యాషెస్ సిరీస్‌పై తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుంది. లార్డ్స్ మైదానంలో ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 43 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 371 పరుగులను ఛేదించే ప్రయత్నంలో ఓవర్‌నైట్ స్కోరు 114/4తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 327 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (214 బంతుల్లో 155; 9 ఫోర్లు, 9 సిక్స్‌లు) చెలరేగగా... బెన్ డకెట్ (112 బంతుల్లో 83; 9 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ తలా 3 వికెట్లు పడగొట్టారు. గాయంతో ఉన్న స్పిన్నర్ లయన్ బౌలింగ్ చేయకుండానే ఆసీస్ ఈ విజయాన్ని అందుకోగలిగింది. స్టీవ్ స్మిత్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలవగా, మూడో టెస్టు గురువారంనుంచి లీడ్స్‌లో జరుగుతుంది.

విజయం కోసం చివరి రోజు చేతిలో 6 వికెట్లతో 257 పరుగులు సాధించాల్సిన స్థితిలో ఇంగ్లండ్ బరిలోకి దిగింది. డకెట్, స్టోక్స్ భారీ భాగస్వామ్యంతో జట్టును ముందుకు నడిపించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. డకెట్‌తో పాటు బెయిర్‌స్టో (10) తక్కువ వ్యవధిలో వెనుదిరిగారు. విజయం కోసం మరో 178 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో స్టోక్స్ బాధ్యత తీసుకొని భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. గ్రీన్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన అతను...గ్రీన్ తర్వాతి ఓవర్లో ఒక ఫోర్ కొట్టి 82 పరుగులకు చేరుకున్నాడు. అదే ఓవర్లో వరుస బంతుల్లో 6, 6, 6 బాది అతను సెంచరీని పూర్తి చేసుకోవడం విశేషం. హాజల్‌వుడ్ ఓవర్లోనూ మరో 2 సిక్సర్లు బాదిన స్టోక్స్... స్టార్క్ ఓవర్లోనూ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టి 150కు చేరుకున్నాడు. ఏడో వికెట్‌కు బ్రాడ్ (11)తో కలిసి స్టోక్స్ 20.2 ఓవర్లలోనే 108 పరుగులు జోడించాడు. ఆసీస్ మూడు క్యాచ్‌లు వదిలేయడం కూడా స్టోక్స్‌కు కలిసొచ్చింది. ఇంగ్లండ్ గెలుపు దిశగా వెళుతున్నట్లు అనిపించింది. అయితే హాజల్‌వుడ్ బౌలింగ్‌లో స్టోక్స్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించాడు. అంచనా తప్పడంతో ఎడ్జ్ తీసుకున్న బంతి గాల్లోకి లేవగా బ్యాక్‌వర్డ్ పాయింట్ వరకు పరుగెత్తుతూ వెళ్లి కీపర్ క్యారీ అందుకోవడంతో అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత మిగిలిన 3 వికెట్లు తీసేందుకు ఆసీస్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

బెయిర్‌స్టో స్టంపౌట్ వివాదం

లార్డ్స్ టెస్టు చివరి రోజు ఆటలో బెయిర్‌స్టోను స్టంపౌట్ చేసిన తీరు వివాదాన్ని రేపి తీవ్ర చర్చకు దారి తీసింది. లంచ్ ముందు ఈ ఘటన జరిగింది. గ్రీన్ వేసిన బంతిని ఆడకుండా కిందకు వంగిన బెయిర్‌స్టో ఆ తర్వాత సహచరుడు స్టోక్స్‌తో మాట్లాడేందుకు ముందుకు వెళ్లాడు. అదే సమయంలో బంతిని అందుకున్న కీపర్ క్యారీ అండర్‌ఆర్మ్ త్రోతో ముందుకు విసరగా అది స్టంప్స్‌ను తాకింది. ఆ సమయంలో బెయిర్‌స్టో క్రీజ్‌కు చాలా దూరం ఉండటంతో థర్డ్ అంపైర్ బెయిర్‌స్టో‌ను అవుట్‌గా ప్రకటించాడు. దాంతో ఇంగ్లండ్ బృందం ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైంది. ఆసీస్ తమ అప్పీల్‌ను కూడా వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయకపోవడంతో బెయిర్‌స్టో మైదానం వీడాడు. ఆ సమయంలో స్టేడియం మొత్తం ‘పాత ఆస్ట్రేలియా...ఎప్పటిలాగే మోసగాళ్లు’ అంటూ ప్రేక్షకులంతా గేలి చేశారు.



లంచ్ సమయంలో పరిస్థితి మరింత ముదిరింది. లార్డ్స్ మైదానంలో ప్రతిష్టాత్మక లాంగ్ రూమ్‌లో ఆసీస్ ఆటగాళ్లు నడుస్తుండగా కొందరు మాటలతో ఖ్వాజాను దూషించారు. సెక్యూరిటీ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. దీనిపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఎంసీసీకి ఫిర్యాదు చేయగా...వారు చివరకు ఘటనపై క్షమాపణ చెప్పారు. నిబంధనల ప్రకారం చూస్తే బెయిర్‌స్టో అవుట్‌లో తప్పు లేదు. బంతి ఇంకా ‘డెడ్’ కాకముందే అతను క్రీజ్ వీడాడు. బయటకు వెళ్లే ముందు అతను తన కాలితో క్రీజ్ లోపల నేలను గీకడం కూడా కనిపించినా బంతి కీపర్ చేతుల్లోనే ఉంది. అప్రమత్తంగా ఉన్న క్యారీ స్టంప్ చేశాడు. దాంతో మరోసారి క్రీడా స్ఫూర్తి చర్చ ముందుకు వచ్చింది. కామెంటేటర్లంతా వాదనకు చెరో వైపు నిలిచారు. ముఖ్యంగా ఇలాంటి విషయాల్లో స్పష్టంగా ఉండే భారత స్పిన్నర్ అశ్విన్ మాత్రం ఇందులో తప్పేమి లేదని, అది అవుట్ అని స్పష్టం చేశాడు. ‘ఒకటి మాత్రం నిజం. ఒక టెస్టులో వెనక అంత దూరం నిలబడిన కీపర్ స్టంప్స్‌పైకి బంతి విసిరాడంటే అప్పటికే బెయిర్‌స్టో ఇలాంటి ప్రయత్నం చేసిన ఉండటం అతను చూసి ఉంటాడు’ అని అశ్విన్ విశ్లేషించాడు.

లంక విజయఢంకా

- 9 వికెట్లతో ఓడిన జింబాబ్వే
- ప్రపంచకప్ క్వాలిఫయర్స్

బులవాయో: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో శ్రీలంక దూసుకెళుతోంది. సూపర్ సిక్స్ దశలో ఆదివారం జరిగిన పోరులో శ్రీలంక 9 వికెట్ల తేడాతో జింబాబ్వేపై అలవోక విజయం సాధించింది. ముందుగా టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 32.2 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మహీశ్ తీక్షణ (4/25), దిల్షాన్ మదుషంక (3/15), మతీశ పతిరణ (2/18) జింబాబ్వే బ్యాటర్స్‌ను వణికించారు. టాపార్డర్‌లో గుంబీ (0), ఎర్విన్ (14), మదెవెర్ (1)లను వరుసగా మదుషంక పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో సీన్ విలియమ్స్ (57 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (51 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. నాలుగో వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ఆ తర్వాత తీక్షణ స్పిన్ ఉచ్చు బిగించడంతో అనంతరం వచ్చిన వారెవరూ కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు. రియాన్ బర్ల్ (16), లాంగ్‌వె (10), ముజరబని



(0), ఇవాన్స్ (14) లంక బౌలింగ్‌కు దాసోహమన్నారు. దీంతో 38 పరుగుల వ్యవధిలోనే జింబాబ్వే 6 వికెట్లను కోల్పోయింది. తర్వాత సునాయాస లక్ష్యాన్ని శ్రీలంక 33.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 169 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్ పతుమ్ నిసాంక (102 బంతుల్లో 101 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. దిముత్ కరుణరత్నే (56 బంతుల్లో 30; 2 ఫోర్లు)తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 103 పరుగులు జోడించాడు. కరుణరత్నేను ఎన్‌గరవ అవుట్ చేయగా... నిసాంకకు జతకలిసిన కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు) మరో వికెట్ పడకుండా లక్ష్యాన్ని ముగించాడు.

వెర్‌స్టాపెన్‌దే టైటిల్



స్పీల్‌బర్గ్: ఫార్ములావన్‌లో చాంపియన్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఎదురే లేని జోరుతో దూసుకెళుతున్నాడు. ఆదివారం ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో ఈ రెడ్‌బుల్ డ్రైవర్ విజేతగా నిలిచాడు. ఈ ట్రాక్‌పై తనకు పోటీనిచ్చిన ఫెరారీ రేసర్ చార్లెస్ లెక్‌లెర్క్‌ను వెనక్కి నెట్టి తన వేగంతో అగ్ర స్థానంలో నిలిచాడు. దీంతో నిరుటి విజేత లెక్‌లెర్క్ రెండో స్థానంతో తృప్తి చెందాడు. పోల్ పొజిషన్‌తో రేసును ప్రారంభించిన వెర్‌స్టాపెన్ 71 ల్యాపుల్ని అందరికంటే ముందుగా ఒక గంటా 25 నిమిషాల 33.607 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో 25 ఏళ్ల ఈ డచ్ డ్రైవర్‌కిది వరుసగా ఐదో విజయం కాగా... ఓవరాల్‌గా ఇప్పటివరకు జరిగిన 9 రేసుల్లో ఏడో విజయాన్ని నమోదు చేశాడు. దీంతో 377 పాయింట్లతో రెడ్‌బుల్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే జట్టుకు చెందిన సెర్గియో పెరెజ్ మూడో స్థానంలో నిలిచాడు. తదుపరి రేసు బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఈ నెల 9న సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌పై జరుగుతుంది.

రిచా ఘోష్‌పై వేటు

బంగ్లా టూర్‌కు భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో పర్యటించనున్న భారత మహిళల క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. గాయంతో పేసర్ రేణుక సింగ్ దూరం కాగా, వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను ఈ పరిమిత ఓవర్ల సిరీస్‌లకు (టి20, వన్డే) పక్కనబెట్టారు. యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌కు సెలక్టర్లు అవకాశమివ్వలేదు. బంగ్లాదేశ్‌తో భారత్ మూడేసి టి20లు, వన్డేలు ఆడుతుంది. ముందుగా మిర్పూర్ వేదికగా ఈనెల 9, 11, 13 తేదీల్లో టి20 మ్యాచ్‌లు, అదే స్టేడియంలో 16, 19, 22 తేదీల్లో మూడు వన్డేలు జరుగనున్నాయి.

టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి (వైస్ కెప్టెన్), దీప్తిశర్మ, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, హర్లీన్ డియోల్, దేవిక వైద్య, ఉమా చెత్రి, అమన్‌జోత్ కౌర్, సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, పూజ, మేఘన సింగ్, మోనిక పటేల్, రాశి కనోజియా, అనూష బారెడ్డి, మిన్ను రాణి. వన్డే జట్టులో సబ్బినేని మేఘన, మిన్నురాణి స్థానాల్లో ప్రియా పూనియా, స్నేహ్ రాణాలను తీసుకున్నారు.

ఫేవరెట్‌గా జొకోవిచ్

- మహిళల విభాగంలో రిబాకినా
- నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ

లండన్: అల్‌కరాజ్ ప్రపంచ నంబర్‌వన్ అయినా... ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో అందరి కళ్లూ జొకోవిచ్‌పైనే ఉన్నాయి. ఈ సెర్బియన్ స్టార్, డిఫెండింగ్ చాంపియన్ ‘హ్యాట్రిక్’తో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో టైటిల్ చేజిక్కించుకుంటాడనే అంచనాలు పెరిగాయి. మరోవైపు స్పెయిన్ సంచలనం అల్‌కరాజ్ కూడా టాప్ ర్యాంకు ఉత్సాహంతో వింబుల్డన్ వేటకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్‌లో నిరుటి విజేత ఎలీనా రిబాకినా కూడా వింబుల్డన్ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సమరానికి సై అంటోంది. సోమవారం నుంచి వింబుల్డన్ టోర్నీ జరుగుతుంది. ఇప్పటికే సీడింగ్స్, డ్రా విడుదల చేయగా... ఇప్పుడు కోర్టులో టైటిల్ వేటే మిగిలింది. ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డుతో ఉన్న జొకోవిచ్ ఇప్పుడు 24వ టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు. రెండో సీడ్ సెర్బియన్ పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో పెడ్రో కచిన్ (అర్జెంటీనా)తో తలపడతాడు. టాప్‌సీడ్ కార్లోస్ అల్‌కరాజ్... జెరెమి చార్డి (ఫ్రాన్స్)తో జరిగే మొదటి రౌండ్ పోరుతో వింబుల్డన్‌కు శ్రీకారం చుట్టనున్నాడు.



డిఫెండింగ్ చాంపియన్స్ జొకోవిచ్, రిబాకినా

మహిళల సింగిల్స్‌లో రిబాకినా వరుసగా రెండో టైటిల్‌పై ఆశలు పెట్టుకుంది. గతేడాది ఈ 24 ఏళ్ల కజకిస్తాన్ స్టార్ వింబుల్డన్ ట్రోఫీతో తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని చవిచూసింది. అయితే ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను తృటిలో కోల్పోయింది. ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లో ఆమె రన్నరప్‌గా తృప్తి పడింది. టైటిల్ నిలబెట్టుకునేందుకు తొలి రౌండ్లో అమెరికన్ రోజర్స్‌తో ఆమె తలపడనుంది. ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి, తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలండ్)... ఝు లిన్ (చైనా)తో గ్రాండ్‌స్లామ్ ఆటను మొదలుపెట్టనుంది. సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్న అమెరికన్ వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినాతో పోటీ పడుతుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ-మల్టీ టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పరీక్ష-2023

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కేంద్ర మంత్రిత్వ శాఖలు /విభాగాలు /కార్యాలయాల్లో మల్టీ-టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1558.
» **పోస్టుల వివరాలు:** మల్టీ టాస్కింగ్(నాన్ టెక్నికల్) స్టాఫ్(గ్రూప్ సి నాన్ గెజిటెడ్, నాన్-మినిస్టీరియల్)-1198, హవల్దార్(గ్రూప్-సి నాన్-గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్)-360.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి పోస్టులను అనుసరించి 18-25, 18,27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఎంటీఎస్ ఖాళీలకు సెషన్-1, 2 కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, హవల్దార్ ఖాళీలకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ,కర్నూలు,నెల్లూరు,రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం,హైదరాబాద్,కరీంనగర్,వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ:** సెప్టెంబర్ 2023.
» **వెబ్‌సైట్:** ssc.nic.in

యూపీఎస్సీలో 261 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కేంద్ర ప్రభుత్వ శాఖలు/విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 261
» **పోస్టుల వివరాలు:** ఎయిర్ వర్తినెస్ ఆఫీసర్-80, ఎయిర్ సేఫ్టీ ఆఫీసర్-40, లైవ్‌స్టాక్ ఆఫీసర్-06, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-05, పబ్లిక్ ప్రాసిక్యూటర్-23, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్-86,అసిస్టెంట్ ఇంజనీర్ గ్రేడ్1-03,అసిస్టెంట్ సర్వే ఆఫీసర్-07,ప్రిన్సిపల్ ఆఫీసర్-01,సీనియర్ లెక్చరర్-06.**అర్హత:**సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.07.2023.
» **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ హార్టిసెట్-2023

పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చరల్ కోర్సులో ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్-హార్టిసెట్-2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 92(52 యూనివర్శిటీ కాలేజీ సీట్లు, 40 ప్రైవేట్ కాలేజీ సీట్లు)
» **అర్హత:**డిప్లొమా ఇన్ హార్టికల్చర్ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.**వయసు:**17నుంచి 22ఏళ్ల మధ్య ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష మాధ్యమం:** ఇంగ్లిష్, తెలుగు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, డా.వై.ఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, వెంకటరామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
» **పరీక్ష తేది:** 22.08.2023.
» **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఐటీబీపీలో 458 కానిస్టేబుల్(డ్రైవర్) పోస్టులు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. కానిస్టేబుల్(డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 458
» **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్(డ్రైవర్) గ్రూప్ సి నాన్-గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) 458(యూఆర్-195,ఎస్సీ-74, ఎస్టీ-37, ఓబీసీ-110, ఈడబ్ల్యూఎస్-42).
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.**వయసు:**21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాతపరీక్ష, ఒరిజనల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.07.2023.
» **వెబ్‌సైట్:** https://recruitment.itbpolice.nic.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్,స్కూల్ ఆఫ్ మ్యాథమేటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఎంఎస్సీ(స్టాటిస్టిక్స్)తో పాటు నెట్/స్లెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 70 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** deansm@uohyd.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 07.07.2023.
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

నర్సింగ్ కోర్సు.. ఆర్మీలో కొలువు

నర్సింగ్.. వైద్య రంగంలో మహోన్నతమైన వృత్తిగా గుర్తింపు! అలాంటి నర్సింగ్ కెరీర్‌పై ఆసక్తి కలిగిన ఇంటర్ బైపీసీ విద్యార్థులకు భారత ఆర్మీ చక్కటి అవకాశం కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ఆరు కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సులో ప్రవేశం దక్కితే.. ఆర్మీలో ఉద్యోగం ఖాయమైనట్లే!! తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు ఇండియన్ ఆర్మీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆర్మీలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు.. ప్రవేశ ప్రక్రియ.. కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



» 2023 సంవత్సరానికి మొదలైన ప్రవేశ ప్రక్రియ
» జాతీయ స్థాయిలో ఆరు కళాశాలల్లో 220 సీట్లు
» నీట్ ర్యాంకు ఆధారంగా మలి దశ ఎంపిక
» కోర్సు అనంతరం ఆర్మీలో కమిషన్డ్ ర్యాంకుతో కొలువు
» రూ.15,600-రూ.39,400 శ్రేణితో ప్రారంభ వేతనం

ఇండియన్ ఆర్మీ ప్రత్యేకంగా.. జాయింట్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ పేరుతో.. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీస్ విభాగం ద్వారా నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తోంది. కోర్సు అనంతరం వారికి ఇండియన్ ఆర్మీలోనే కొలువులు ఖరారు చేస్తోంది. ఇండియన్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ అందించే బీఎస్సీ నర్సింగ్‌లో చేరడం ద్వారా ఇంటర్మీడియెట్‌తోనే నర్సింగ్ కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా మెడికల్ కోర్సులు లక్ష్యంగా నీట్‌లో ఉత్తీర్ణత సాధించినా.. సీటు అవకాశాలు చేజారిన వారికి చక్కటి ప్రత్యామ్నాయంగా ఈ కోర్సును పేర్కొనొచ్చు.

ఆరు కళాశాలలు.. 220 సీట్లు

- ప్రస్తుతం మొత్తం ఆరు నర్సింగ్ కళాశాలల్లో 220 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అవి..
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఏఎఫ్ఎంసీ పుణె-40 సీట్లు.
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్, ఈస్ట్రన్ కమాండ్, కోల్‌కత-30 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఇండియన్ నేవల్ హాస్పిటల్ షిప్ అశ్విని, ముంబై-40 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఆర్మీ హాస్పిటల్(రీసెర్చ్ అండ్ రిఫరల్), ఢిల్లీ-30 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్(సెంట్రల్ కమాండ్), లక్నో-40 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్(ఎయిర్‌ఫోర్స్), బెంగళూరు-40 సీట్లు

అర్హతలు

- 2023లో బైపీసీ గ్రూప్‌తో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు.. నీట్-యూజీలో అర్హత పొందాలి. ఇంటర్ తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణత తప్పనిసరి. అవివాహిత, వితంతు మహిళలు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** అక్టోబర్ 1, 1998 -సెప్టెంబర్ 30, 2006 మధ్యలో జన్మించి ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** కనీసం152 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి.

ఎంపిక ఇలా

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ పరిధిలోని ఆరు కళాశాల్లోని సీట్ల భర్తీకి నీట్-యూజీ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. నీట్‌లో ర్యాంకు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు.ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఢిల్లీ కంటోన్మెంట్‌లోని బేస్ హాస్పిటల్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. స్క్రీనింగ్ ప్రక్రియలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

రాత పరీక్ష కూడా

నీట్ ర్యాంకు ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు మరోసారి ప్రత్యేకంగా రాత పరీక్ష నిర్వహిస్తారు. టెస్ట్ ఆఫ్ జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ జనరల్ ఇంగ్లిష్(టీఓజీఐజీఈ) పేరుతో పరీక్ష ఉంటుంది. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లిష్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 40 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు కోత విధిస్తారు.

సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఇండియన్ ఆర్మీ మెడికల్ విభాగం నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ చూపి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి మలి దశలో సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థులకున్న సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వ్యక్తిగత ఆసక్తి, అలవాట్లతోపాటు నర్సింగ్ కెరీర్ పట్ల ఉన్న అంకిత భావాన్ని పరిశీలించేలా ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్‌లో భాగంగా.. అభ్యర్థుల వ్యవహార శైలి, వ్యక్తిగత వైఖరి, దృక్పథం వంటి వాటిని పరిశీలిస్తారు.

ప్రతిభ ఆధారంగా తుది జాబితా

అభ్యర్థులకు సీట్లు ఖరారు చేసే క్రమంలో.. నీట్ స్కోర్, ఆర్మీ మెడికల్ బోర్డ్ నిర్వహించిన రాత పరీక్షలో పొందిన మార్కులు, అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలలో పొందిన మార్కులను క్రోడీకరించి.. మెరిట్ ఆధారంగా తుది జాబితా రూపొందిస్తారు.

నాలుగేళ్ల కోర్సు

అన్ని దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు.. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీస్ పరిధిలోని కళాశాలల్లో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి నిర్దేశిత యూనివర్సిటీల నుంచి బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్ ఇస్తారు. పుణె, ముంబైలలోని కళాశాలల్లో చదివిన వారికి మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్; కోల్‌కతలో చదివిన వారికి వెస్ట్ బెంగాల్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్; న్యూఢిల్లీలో చదివిన వారికి ఢిల్లీ యూనివర్సిటీ; లక్నోలో చదివిన వారికి అటల్ బిహారీ వాజ్‌పేయి మెడికల్ యూనివర్సిటీ; బెంగుళూరులో చదివిన వారికి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి సర్టిఫికెట్లు అందిస్తారు.

సర్వీస్ బాండ్

ఆయా కళాశాలల్లో చేరే ముందు అభ్యర్థులు.. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న తర్వాత అయిదేళ్లపాటు ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తామంటూ.. సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఎలాంటి ఫీజు చెల్లించకుండానే.. బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తి చేసుకోవచ్చు. స్టయిఫెండ్ కూడా అందిస్తారు.

కమిషన్డ్ ఆఫీసర్ హోదా

కోర్సు పూర్తి చేసుకున్న వారికి మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో కమిషన్ ర్యాంకుతో కొలువు ఖరారు చేస్తారు. నిబంధనలను అనుసరించి పర్మనెంట్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్‌ను కేటాయిస్తారు. షార్ట్ సర్వీస్ కమిషన్‌కు ఎంపికైన వారు తొలుత పదేళ్లు, తర్వాత మరో నాలుగేళ్లు మొత్తం 14 సంవత్సరాలు.. మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో నర్సింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రారంభ వేతన శ్రేణి రూ.15,600-రూ.39,100గా ఉంటుంది. పర్మనెంట్ కమిషన్ ర్యాంకు పొందిన వారు పదవీ విరమణ వయసు వరకు విధులు నిర్వర్తించొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదవీ విరమణ పొందిన వారు.. ఆ తర్వాత కూడా ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం ఉంటుంది. కార్పొరేట్ హాస్పిటల్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

లెఫ్టినెంట్ నుంచి మేజర్ జనరల్ వరకు

బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో చేరిన వారికి తొలుత లెఫ్టినెంట్ ర్యాంకుతో నర్సింగ్ ఆఫీసర్ హోదా కల్పిస్తారు. ఆ తర్వాత అదే విభాగంలో కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, బ్రిగేడియర్, మేజర్ జనరల్ వంటి హోదాలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

రాత పరీక్షలో విజయానికి ఇలా

- నీట్ ర్యాంకు ఆధారంగా.. తదుపరి దశలో నిర్వహించే జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ జనరల్ ఇంగ్లిష్ రాత పరీక్షలో మంచి మార్కుల కోసం దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- **జనరల్ ఇంగ్లిష్:** కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఫిల్లింగ్ ద బ్లాంక్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, మిస్ స్పెల్ట్ వర్డ్స్‌పై దృష్టి పెట్టాలి.
- **జనరల్ ఇంటెలిజెన్స్:** అర్థమెటికల్ కంప్యుటేషన్, నాన్-వెర్బల్ సిరీస్, నంబర్ సిరీస్, అనాలజీ, డయాగ్రమ్ క్లాసిఫికేషన్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూలై 4, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 102

సోమవారం 3-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కదిలించే కాంతి గురువు

జీవనం అనే చీకటి ఛేదనకు ప్రతి మనిషికి కాంతిని ఇచ్చే గురువు అవసరం -10లో



ఈవీ.. బీమా లేదంటే బేజారు!


వాహనం మొత్తం దెబ్బతింటేనే పరిహారం. సమగ్ర కవరేజీ ఉంటేనే మేలు -11లో



గుజరాత్ అతలాకుతలం

గుజరాత్‌లో వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి.


- వివరాలు 6లో



సూర్యకాంతిని అడ్డుకుందాం

సూర్యకాంతి భూమిపై పడకుండా అడ్డుకుంటే ఎలా ఉంటుందన్న అంశంపై పరిశోధనకు అమెరికా శ్రీకారం చుట్టింది.

- వివరాలు 6లో



ఫ్రాన్సులో అయిదో రోజూ అల్లర్లు

ఫ్రాన్సులో ఆందోళనకారులు మేయర్ నివాసంపైకి మండుతున్న కారుతో దూసుకువచ్చి, దాడికి యత్నించారు.

- వివరాలు 6లో



టైటానిక్ కంటే ఐదు రెట్లు పెద్దది

సముద్ర జలాల్లో ప్రయాణానికి ప్రపంచంలోనే అతి పెద్ద నౌక సిద్ధమైంది. టైటానిక్ కంటే ఇది ఐదు రెట్లు పెద్దది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

అందని పుస్తకం.. మొదలవ్వని పాఠం



పాఠశాలలు ప్రారంభించి 15 రోజులవుతున్నా ఇప్పటికీ 15 వేలకు పైగా స్కూళ్లలో పాఠాలు మొదలవ్వలేదు. పాఠ్య పుస్తకాలు అందకపోవడంతో జూలై నెల ప్రారంభమైనా ఇంకా పునఃశ్చరణకే పరిమితం అవ్వాల్సి వస్తోంది.

- వివరాలు 3లో▶

ముందుగానే 'ఉపకార' దరఖాస్తులు!



పోస్టుమెట్రిక్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల అమలుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు అనుమతివ్వాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రభుత్వాన్ని కోరింది.

- వివరాలు 5లో▶

టాపర్లంతా ముంబై ఐఐటీ వైపే



ఐఐటీల్లో ఎక్కువ మంది టాపర్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కే ప్రాధాన్యతనిచ్చారు. తాజాగా వెల్లడించిన తొలి దశ సీట్ల కేటాయింపులో ఈ విషయం స్పష్టమైంది. ఐఐటీల్లో ఎక్కువ మంది టాపర్లు ముంబై ఐఐటీకే మొదటి ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ మంది అక్కడే సీట్లు పొందారు.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



ఎన్ని పార్టీలు చేరితే అన్ని ఇంజిన్లు అన్నమాట!

ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, భట్టి విక్రమార్క





మోదీ చేతిలో రిమోట్

ప్రధాని మోదీకి ఏం కావాలో కేసీఆర్ అదే చేస్తారు: రాహుల్‌గాంధీ

ఖమ్మంలో కాంగ్రెస్ జనగర్జన సభ

- బీఆర్ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ సమితి
- కర్ణాటకలో జరిగిందే తెలంగాణలోనూ జరగబోతోంది
- అక్కడ బీజేపీని ఓడించాం.. ఇక్కడ ఆ పార్టీ బీ టీంనూ ఓడిస్తాం.. ఆ పార్టీతో మాకు ఎలాంటి సంబంధం ఉండదు..
- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల కలలు ఛిద్రం
- రాష్ట్రంలో బీజేపీ ఖతమైంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ

వితంతువులు, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తాం

- పార్టీని వదిలివెళ్లిన వారి కోసం తలుపులు తెరిచే ఉంటాయి
- పాదయాత్ర ముగించిన భట్టికి రాహుల్ సన్మానం
- ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటికి కాంగ్రెస్‌లోకి ఆహ్వానం



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రాహుల్. చిత్రంలో రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రధాని మోదీ చేతిలో తెలంగాణ సీఎం కేసీఆర్ రిమోట్ కంట్రోల్ ఉందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. మోదీకి ఏం కావాలో కేసీఆర్ అదే చేస్తారని, మోదీ చేతిలో కేసీఆర్ రిమోట్ కంట్రోల్ ఉండటమే ఇందుకు కారణమని చెప్పారు. బీఆర్ఎస్ అంటే 'బీజేపీ రిష్తేదార్ (బీజేపీ బంధువుల) సమితి' అని పేర్కొన్నారు. కర్ణాటకలో ఏం జరిగిందో తెలంగాణలోనూ అదే జరగబోతోందని, అక్కడ బీజేపీని ఓడిస్తే, ఇక్కడ బీజేపీ బీ టీం అయిన బీఆర్ఎస్‌ను ఓడించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటి కార్యకర్తలకు ఇది పెద్ద పని కాదని, సునాయాసంగా బీఆర్ఎస్‌ను ఓడించి చూపెడతామని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చాక చేయూత పేరుతో వితంతువులు, వృద్ధులకు నెలకు రూ.4 వేల పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయన మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్‌ను దించేందుకే కాంగ్రెస్‌లోకి..

తెలంగాణ జనగర్జన సభలో పొంగులేటి - 2లో

ఈ సర్కార్‌ను బంగాళాఖాతంలో వేయాల్సిందే..

- సమసమాజం కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సమాజం చేసిందే పీపుల్స్‌మార్చ్
- తెలంగాణ జనగర్జన సభలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

2లో

కాంగ్రెస్.. భారత రాబందుల పార్టీ: కేటీఆర్

దేశాన్ని దోచుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది: హరీశ్‌రావు

- వివరాలు 2లో▶

నిలువునా చీలిన ఎన్సీపీ



డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తున్న అజిత్ పవార్

సీనియర్ నాయకుడు అజిత్ పవార్ వేరు కుంపటి

డిప్యూటీ సీఎంగా ప్రమాణం.. శరద్ పవార్‌కు బిగ్ షాక్

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో అలజడి. ఒక్కరోజులోనే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. ప్రతిపక్ష నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) నిట్టనిలువునా చీలిపోయింది. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమి కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆదివారం బీజేపీ-శివసేన(షిండే వర్గం) ప్రభుత్వంలో చేరారు. ఏకంగా ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అజిత్ వర్గం ఎమ్మెల్యేల్లో ఎనిమిది మందికి మంత్రి పదవులు లభించాయి. కాగా, పార్టీని ధిక్కరించి, ప్రభుత్వంలో చేరినవారిపై చర్యలు తీసుకోవడం ఖాయమని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

- వివరాలు 6లో▶

కష్టంలోనే కాళేశ్వరం విలువ తెలిసేది

గోదావరి నుంచి నీళ్లు రాకున్నా ప్రాణహితలో నిరంతర ప్రవాహం

- ప్రాజెక్టు ద్వారా రోజూ టీఎంసీ జలాలు తరలించాలి
- నిర్విరామంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌లు నడపాలి
- ఆ నీళ్లను మిడ్ మానేరుకు తరలించాలి.. అక్కడి నుంచి సగం నీళ్లు దిగువ మానేరుకు, మిగిలిన సగం ఎస్సారెస్పీకి
- తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూ జలాశయాల్లో నిల్వల పర్యవేక్షణ
- వర్షాభావ పరిస్థితులపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టు విలువ కష్టకాలంలోనే తెలుస్తుంది. ఎగువ గోదావరి నుంచి నీరు రాకున్నా, ప్రాణహిత ద్వారా మేడిగడ్డ రిజర్వాయర్‌కు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ప్రతిరోజూ ఒక టీఎంసీ నీళ్లను మేడిగడ్డ నుంచి అన్నారం, అక్కడి నుంచి సుందిళ్లకు ఎత్తిపోసేలా మోటార్లను నిర్విరామంగా 24 గంటలూ నడిపించాలి. సుందిళ్ల నుంచి అంతే నీటిని మధ్య మానేరుకు తరలించాలి. అక్కడి నుంచి సగం నీటిని మిగతా 3వ పేజీలో ▶

రైతురాజ్యం కోసం జవాన్ల ముందడుగు గొప్ప పరిణామం

మహారాష్ట్ర మాజీ సైనికుల చేరిక కార్యక్రమంలో సీఎం కేసీఆర్ 3లో



ఆదివారం సచివాలయంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి, కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల, హరీశ్‌రావు, సీఎస్ శాంతికుమారి

నిమ్స్‌లో రోబోటిక్ సర్జరీలు

నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్

- రూ.31.50 కోట్లతో రోబో యంత్ర పరికరాలు సమకూర్చుకున్న ఆస్పత్రి

లక్డీకాపూల్ (హైదరాబాద్): నిమ్స్ ఆస్పత్రిలో సోమవారం నుంచి రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. రూ.31.50 కోట్లతో నిమ్స్ కొనుగోలు చేసిన డావెన్సీ ఎక్స్‌ఐ రోబో యంత్రాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. రోబోటిక్ సర్జరీల నిర్వహణకు నిమ్స్ యాజమాన్యం ఇప్పటికే సీనియర్ ప్రొఫెసర్లకు శిక్షణ ఇచ్చింది. ఇందులో వివిధ విభాగాలకు చెందిన 15 మంది వైద్యులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రోబోటిక్ సర్జరీ సిస్టంతో పాటుగా స్పెషాలిటీ బ్లాక్‌లోని ఆపరేషన్ థియేటర్లలో యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలకు సంబంధించిన ఆధునిక వైద్య పరికరాలనూ మంత్రి ప్రారంభించనున్నారు. **ఇవీ ప్రయోజనాలు..** కార్పొరేట్ ఆస్పత్రులలో



సుమారు రూ.1.75 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్న ఈ రోబోటిక్ సర్జరీలను నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేయనున్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా మిగతా 3వ పేజీలో ▶

బీజేపీ అధ్యక్షుడిగా వస్తానో.. లేదో?

హనుమకొండ: హనుమకొండలో ఈనెల 8న జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో వస్తానో.. లేదో.. అని బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు జన సమీకరణపై ఆదివారం సాయంత్రం హనుమకొండలో సమావేశం జరిగింది. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడిని మారుస్తున్నారంటూ ప్రచారం జరుగుతోందని.. వాస్తవమేనా? అని బండి సంజయ్‌ని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా వ్యాఖ్యానించారు. బండి వల్లే రాష్ట్రంలో బీజేపీ గ్రామీణ స్థాయి వరకు విస్తరించిందని..

మోదీ సభపై కార్యకర్తలతో బండి

ఆయన పోరాట స్ఫూర్తితోనే గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల అరాచకాలను ఎదుర్కొనగలుగుతున్నాం.. ప్రజల్లో గౌరవం పెరిగింది అని కార్యకర్తలు స్పష్టం చేశారు. మీరే అధ్యక్షుడిగా కొనసాగాలి.. అని కన్నీటి పర్యంతమయ్యారు. మీ కష్టం వృథా కాదు.. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు మీకే ఉంటాయి.. అని కార్యకర్తలు బండి సంజయ్‌కుమార్‌కు బాసటగా నిలిచారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యమని, ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని బండి సంజయ్ కార్యకర్తలకు చెప్పారు.

నెల్లూరు జాతి ఆవు @ రూ. 35 కోట్లు

- వివరాలు 5లో▶

వ్యాగన్ల తయారీ కేంద్రంగా కాజీపేట

రూ.5,587 కోట్లతో వరంగల్‌ను కలుపుతూ హైవేలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- తెలంగాణ అభివృద్ధికే కేంద్రం పెద్దపీట
- హనుమకొండలో 15 లక్షల మందితో సభ: బండి సంజయ్



రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటు స్థలం నమూనాను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, బండి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎంత సహకారం అందిస్తున్నా.. రాష్ట్ర సర్కారు తప్పుడు ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అభివృద్ధికే ఎక్కువ నిధులు ప్రాజెక్టులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్‌కు రానున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, జాతీయ నాయకులు ఈటల రాజేందర్, ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆదివారం ఆయన నగరంలో పర్యటించారు. కాజీపేట అయోధ్యపురంలో పీఓహెచ్, వ్యాగన్ల తయారీ కేంద్ర నిర్మాణ ప్రాంతం, బహిరంగ సభ జరిగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని సందర్శించారు. ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో మోదీ విజయసంకల్ప సభ సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ తదితరులతో కలిసి కిషన్‌రెడ్డి మాట్లాడారు.

'బయ్యారం'ఏమైందో కేసీఆర్ చెప్పాలి..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు వివిధ కారణాలతో సాధ్యం కాలేదని, దీంతో పీరియాడిక్ ఓవర్ హాలింగ్ యూనిట్‌తో పాటు అదనంగా వ్యాగన్ మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్.. భారత రాబందుల పార్టీ: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'మాది బీజేపీ బంధువుల పార్టీ కాదు, మీదే భారత రాబందుల పార్టీ. ఏఐసీసీ అంటేనే అఖిల భారత కరప్షన్ కమిటీ. దేశంలో అవినీతికి, అసమర్థతకు ఒకే ఒక్క కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం సభ వేదికగా రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా కేటీఆర్ మండిపడ్డారు. 'మా పార్టీ బీజేపీకి బీ టీమ్ కాదు, కాంగ్రెస్ పార్టీకి సీ టీమ్ అంతకన్నా కాదు. బీజేపీ, కాంగ్రెస్ రెండింటినీ ఒంటిచేత్తో ఢీకొట్టే 'డీ టీమ్' బీఆర్ఎస్'అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను నేరుగా ఢీకొనే దమ్ములేక బీజేపీ భుజంపై తుపాకీ పెట్టి మమ్మల్ని కాల్చే కుట్ర చేస్తారా, ఈ మిస్ ఫైరింగ్‌లో ముమ్మాటికీ కుప్పకూలేది కాంగ్రెస్ పార్టీయే అంటూ మండిపడ్డారు. లక్ష కోట్లు వ్యయంకాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి అంటూ కాంగ్రెస్ అర్థంలేని ఆరోపణలతో నవ్వుల పాలవుతోందన్నారు. ధరణి రద్దు చేసి దళారుల రాజ్యాన్ని తెస్తే ప్రజలు క్షమించరని, రూ.4వేల పెన్షన్‌ను ఎవరూ నమ్మరని, డిక్లరేషన్‌లను విశ్వసించరన్నారు.

దేశాన్ని దోచుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: దేశాన్ని దోచుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, అందుకే దేశ ప్రజలు వారిని అధికారం నుంచి దించి మూలన కూర్చోబెట్టారని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎవరికీ బీటీమ్ కాదని, తమది పేదలు, ప్రజా సంక్షేమం చూసే ఏ క్లాస్ టీమ్ అని వ్యాఖ్యానించారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేనందునే దేశాన్ని బీజేపీ కబంధ హస్తాల నుంచి కాపాడేందుకే బీఆర్ఎస్ పుట్టిందన్నారు. స్కామ్‌లలో ఆరితేరిన కాంగ్రెస్ కుంభకోణాల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. ఖమ్మంలో పసలేని ఆరోపణలు, ఊకదంపుడు ప్రసంగాలు, రాసిచ్చిన స్క్రిప్ట్ తో రాహుల్ స్కిట్ వేశారని హరీశ్ ఎద్దేవా చేశారు.

తెలంగాణలో 'సమష్టి నాయకత్వం' గర్వకారణం


ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. ఒకవైపు ఆదివారం ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభ ద్వారా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తమ విధి విధానాలను నేరుగా ప్రజల ముందు ఉంచారు. మరోవైపు 3.8 కోట్ల మంది తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. తెలంగాణ జనగర్జన సందర్భంగా ఆదివారం ఉదయం ట్వీట్ చేసిన ఖర్గే.. తెలంగాణ జనగర్జన మహాసభలో ప్రజల ఆకాంక్షల కోసం రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రంలో 1,360 కి.మీ సుదీర్ఘ పాదయాత్రను పూర్తి చేసుకున్నందుకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఖర్గే అభినందనలు తెలిపారు. పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాకూటమిని బలోపేతం చేయనున్నారని, తెలంగాణలో పార్టీ సమష్టి నాయకత్వంపై కాంగ్రెస్ గర్విస్తోందని ఖర్గే పేర్కొన్నారు. తెలంగాణలో నూతన శకం ఆవిర్భావానికి కాంగ్రెస్ పార్టీ బ్లూప్రింట్ సిద్ధమైందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం ఆధారంగా తెలంగాణ అభివృద్ధి, పురోగతికి తాము కట్టుబడి ఉన్నామని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

వాపును చూసి.. బలుపు అనుకుంటున్న కాంగ్రెస్

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో గెలుపుతో కాంగ్రెస్ పార్టీ భ్రమల్లో బతుకుతోందని, ఆ పార్టీ నాయకులు వాపును చూసి బలుపు అనుకుంటున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన భీంగల్, ముచ్కూర్, బాబాపూర్ గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, పలువురు యువకులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సీఎం కేసీఆర్ కంటే ముందు పదేళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులు, పేదలకు ఏం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాచికలు తెలంగాణలో పారవన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన ప్రాజెక్టులు, నిధులను గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు అన్యాయంగా తరలిస్తుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్కొండ నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు.



ఖమ్మంలో జనగర్జన సభకు భారీగా హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్

మోదీ చేతిలో రిమోట్

▶ మొదటి పేజీ తరువాయి

బృందం కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా..జనగర్జన పేరిట ఆదివారం ఖమ్మంలోని వైరా రోడ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు.

ఖమ్మం కాంగ్రెస్ పార్టీకి ఇల్లు లాంటిది..

'భారత్ జోడో యాత్ర తర్వాత మరోసారి తెలంగాణకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ దేశంలోని ప్రజలందరినీ ఐక్యంగా ఉంచేందుకు ఆలోచిస్తుంటే, ఇంకోపక్క బీజేపీ విద్వేషం, విభజన సిద్ధాంతాల వ్యాప్తికి ప్రయత్నం చేస్తోంది. దేశ వ్యాప్తంగా జోడో యాత్ర చేసి బీజేపీ విద్వేష సిద్ధాంతాన్ని విచ్ఛిన్నం చేశాం. ఖమ్మం కాంగ్రెస్ పార్టీకి ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రజలు ప్రతిసారీ కాంగ్రెస్‌కు అండగా ఉన్నారు. మీ మనసు, మీ హృదయంలో కాంగ్రెస్ ఉంది. కష్టసమయాల్లో కూడా ఇక్కడ ప్రజలు మా ఆలోచనలు, పార్టీని వీడలేదు. బీఆర్ఎస్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా మమ్మల్ని వదలిపెట్టనందుకు మీ అందరికీ ధన్యవాదాలు. వేల కిలోమీటర్లు నడిచి తెలంగాణ ప్రజలు, అణగారిన వర్గాల సమస్యలు తెలుసుకున్న ఖమ్మం జిల్లా నాయకుడు భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు. కాంగ్రెస్ పార్టీలోకి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డిని స్వాగతిస్తున్నాం. ఆయన పార్టీలోకి రావడం సంతోషదాయకం..' అని రాహుల్ అన్నారు.

అది బీజేపీ బంధువుల పార్టీ..

'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇక్కడి ప్రజల కల. పేదల స్వప్నం. రైతులు, కార్మికులు తెలంగాణ రాష్ట్రాన్ని కాంక్షించారు. కానీ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆ కలలను చిద్రం చేసింది. మీరు కన్న కలలన్నీ కల్లలయ్యాయి. టీఆర్ఎస్‌గా ఆవిర్భవించిన ఆ పార్టీ పేరు మార్చుకుని ఇప్పుడు బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్ అంటే 'బీజేపీ రిస్తేదార్ సమితి'. అది బీజేపీ బంధువుల పార్టీ. ఆ పార్టీకి బీ టీంగా పనిచేస్తోంది. పార్లమెంట్‌లో మేం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాం. కానీ బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ మాత్రం బీజేపీకి బీ టీంగా పనిచేశారు. మేం రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తే బీజేపీకి బీఆర్ఎస్ మద్దతునిచ్చింది..' అని చెప్పారు.



రాహుల్ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సభ వేదిక వద్ద రాహుల్‌ను ముద్దు పెట్టుకుంటున్న గద్దర్

వాళ్లు వస్తే మేం రాబోమని చెప్పాం..

'ఈ మధ్య ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీలన్నీ భేటీ అయ్యాయి. ఆ భేటీకి బీఆర్ఎస్‌ను పిలవాలని కొందరు నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. కానీ బీఆర్ఎస్ వస్తే ఆ మీటింగ్‌కు మేం రాబోమని కాంగ్రెస్ పార్టీ పక్షాన స్పష్టంగా చెప్పాం. బీజేపీ బీ టీంతో కాంగ్రెస్‌కి ఎలాంటి సంబంధం ఉండదు. కాంగ్రెస్‌ను వదిలివెళ్లిన వాళ్లకు ఓ మాట చెబుతు న్నా. మీ కోసం మా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. టీఆర్ఎస్, బీజేపీ ఆలోచనా విధానంతో ఉన్న వారితో మాకు సంబంధం లేదు' అని అన్నారు.

ఇక్కడా అదే జరగబోతోంది..

'కొన్ని నెలల ముందు కర్ణాటకలో బీజేపీని ఓడించాం. తెలంగాణలోనూ అదే జరగబోతోంది. కేసీఆర్, ఆయన కుటుంబం, మరో 10–15 మంది డబ్బున్నవారు ఒకవైపు, తెలంగాణలోని పేదలు, దళిత, ఆదివాసీలు, రైతులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ మరోవైపుగా పోరాడబోతున్నారు. తెలంగాణలో కూడా కర్ణాటకలో జరిగిందే జరగబోతోంది. మొన్నటి వరకు తెలంగాణలో త్రిముఖ పోటీ ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఉందని భావించారు. కానీ ఇప్పుడు తెలంగాణలో బీజేపీ లేదు. ఖతం అయిపోయింది. ఆ పార్టీ ఎక్కడుందో కూడా తెలియకుండా పోయింది. బీజేపీ బండి హైవేపై వెళ్తుంటేనే నాలుగు టైర్లు పంక్చర్ అయ్యాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ బీ టీం(బీఆర్ఎస్) మధ్యే పోటీ ఉంటుంది..' అని రాహుల్ అన్నారు.

విద్వేషపు దారిలో ప్రేమ కుటీరం తెరిచాం..

'వరంగల్ సభలో రైతు డిక్లరేషన్, హైదరాబాద్‌లో యూత్ డిక్లరేషన్ చేశాం. ఇప్పుడు ఖమ్మంలో మరో అడుగు ముందుకు వేస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయూత పేరుతో వయోవృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తాం. ఇది పేదలకు సాయం చేయడంలో పెద్ద ముందడుగు. పోడు భూములన్నీ ఆదివాసీలకు ఇస్తాం. భారత్ జోడో యాత్ర సందర్భంగా మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలు. బీజేపీది విద్వేషం అయితే, కాంగ్రెస్ పార్టీది ప్రేమ సిద్ధాంతం. అందుకే చెబుతున్నా విద్వేషపు దారిలో ప్రేమ కుటీరం తెరిచాం. (నఫ్రత్ కీ బజార్‌మే మొహబ్బత్ కీ దుకాణ్ ఖోలే) అందరికీ నమస్కారం.' అంటూ రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ముగించారు. రాహుల్ ప్రసంగాన్ని ఎంపీ ఉత్తమకుమార్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు. తొలుత వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన సీఎల్పీ నేత భట్టికి ధన్యవాదాలు తెలిపి సన్మానించిన రాహుల్.. పొంగులేటితో పాటు ఆయన ముఖ్య అనుచరులకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

కేసీఆర్ తాను రాజు అనుకుంటున్నారు..

'సీఎం కేసీఆర్ తాను తెలంగాణకు రాజు అనుకుంటున్నారు. ఈ నేల ఆయన జాగీరు అనుకుంటున్నారు. అందుకే ఇందిరమ్మ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలు, దళితులు, పేదలకు ఇచ్చిన భూములను కేసీఆర్ ప్రభుత్వం లాక్కుంటోంది. ఆ భూమి మీది. అది మీ హక్కు. ఆ భూమిపై మీకు హక్కులను కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఆ హక్కులను కాపాడుతుంది. అవినీతి విషయంలో సీఎం కేసీఆర్ ఏ ఒక్కదాన్నీ విడిచిపెట్టలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయల అవినీతి చేశారు. ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములు ఏ రకంగా గుంజుకుంటున్నారో భారత్ జోడో యాత్ర సమయంలోనే తెలుసుకున్నా. సమాజంలోని అన్ని వర్గాల నుంచి ఎంతో కొంత బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంది. కేసీఆర్ అవినీతి వెనుక నరేంద్ర మోదీ ఒత్తిడి ఉంది. లిక్కర్ కుంభకోణం జరిగిందని అన్ని దర్యాప్తు సంస్థలకూ తెలుసు. కానీ ఎలాంటి చర్యలూ తీసుకోరు. అందుకే బీఆర్ఎస్ అనేది బీజేపీకి బీ టీం అని చెబుతున్నాం. అందుకే బీఆర్ఎస్ కూడా బీజేపీ రిస్తేదార్ సమితిగా పేరు మార్చుకుంది..' అని రాహుల్ విమర్శించారు.

ఎలక్షన్ మూడ్‌లోకి 'కాంగ్రెస్'

- ఖమ్మం సభ వేదికగా కీలక హామీ ప్రకటించిన రాహుల్ గాంధీ
- 'చేయూత'పేరిట నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామని ప్రకటన
- కర్ణాటక విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ కేడర్‌కు సందేశం
- కచ్చితంగా విజయం సాధించగలరని ఆత్మవిశ్వాసం నింపే యత్నం

(జనగర్జన సభ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)



సభలో రూ.4 వేల పింఛన్ హామీ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న రాహుల్ గాంధీ తదితరులు

అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదు నెలలు సమయం ఉండగానే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయింది. రాజకీయ వర్గాలు ముందుగా ఊహించినట్టుగానే ఖమ్మం గడ్డపై నుంచి ఆ పార్టీ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సందర్భంగా భారీ జనం నడుమ ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ ఎన్నికల ప్రచార సభను తలపించింది. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు కర్ణాటక విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో బీఆర్ఎస్‌ను మట్టి కరిపించాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునివ్వడం ద్వారా పార్టీ శ్రేణులు ఎన్నికల రంగంలోకి దూకాలనే సంకేతాలిచ్చారు. బీఆర్ఎస్‌ను బీజేపీ 'బీ'టీంగా అభివర్ణిస్తూనే.. కర్ణాటకలో బీజేపీని ఓడించినట్టుగానే ఇక్కడ బీఆర్ఎస్‌ను ఓడించి తీరుతామని ఆయన శపథం చేశారు. బీఆర్ఎస్‌పై తీవ్రంగా మాటల దాడి చేసిన రాహుల్‌గాంధీ, ఖమ్మం సభలోనే పార్టీ ఎన్నికల ప్రచార వ్యూహాన్ని అమలుచేసే ప్రయత్నం చేశారు. ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక్కటేనని చెప్పే ప్రయత్నం గట్టిగానే చేశారు. తెలంగాణలో బీజేపీ లేనేలేదని చెప్పడంతో పాటు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో అమీతుమీ తేల్చుకుంటామని స్పష్టం చేశారు. తాము బీఆర్ఎస్‌ను దగ్గరకు రానిచ్చేది లేదని స్పష్టం చేసిన రాహుల్.. కాంగ్రెస్‌ను వదిలి వెళ్లిన వారు మళ్లీ పార్టీలోకి రావాలంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆలోచనా విధానం ఉన్నవారి కోసం తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పడం ద్వారా తెలంగాణలో పార్టీకి మరింత శక్తి సాధించి పెట్టే మార్గాన్ని తెరిచారు. గతంలో పీసీసీ అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు కూడా ఇదే కావడం, కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిన నేతలు మళ్లీ రావాలని ఇప్పుడు రాహుల్ కోరడం ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. మొత్తంమీద కర్ణాటక స్ఫూర్తిని, బీఆర్ఎస్‌పై యుద్ధ రీతిని ప్రకటిస్తూ.. పార్టీ కేడర్‌కు భవిష్యత్ కర్తవ్యాన్ని నిర్దేశిస్తూ రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం కాంగ్రెస్‌పార్టీని ఎన్నికల మూడ్‌లోకి తీసుకెళ్లిందని రాజకీయ వర్గాలు చెపుతున్నాయి.

అడ్డంకులు సృష్టించినా..

జనగర్జన సభ జరగకుండా అధికార బీఆర్ఎస్ అనేక అడ్డంకులు సృష్టించిందని, అయినా నిర్బంధాన్ని అధిగమించి లక్షలాది మంది కేడర్ కదం తొక్కారనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా, లారీలు, ఆటో యూనియన్లను బెదిరించి, పెద్ద ఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, సభకు వెళ్లే వాహనాలకు పెట్రోల్ పోయవద్దని బంకు యజమానులను బెదిరించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతేకాక ఖమ్మం నగరంలో నీటి సరఫరా నిలిపివేసి, ఆర్టీఏ అధికారుల ద్వారా ప్రైవేట్ వాహనదారులను బెదిరించి, సభకు వెళ్లే రూ.లక్ష సాయం చేయబోమని, ప్రభుత్వ పథకాలు కట్‌చేస్తామని చెప్పి జనం రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారనేది కాంగ్రెస్ నేతల ఆరోపణ. ఇంత చేసినా ఈ సభకు వచ్చిన జనసందోహాన్ని చూస్తే ఖమ్మం జిల్లాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఉన్న పట్టు ఏమిటో అర్థమవుతోందని వారంటున్నారు. ఇక, ఈ సభ ద్వారా సీఎల్పీనేత భట్టి విక్రమార్క 1,200 కిలోమీటర్లకు పైగా చేసిన పాదయాత్రకు భారీ ముగింపు పలికినట్టయింది.

బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు 'గండి'!

కొడితే కుంభస్థలాన్ని కొట్టాలి.. అన్నట్టుగా బీఆర్ఎస్‌కు గట్టి ఓటు బ్యాంకుగా ఉన్న పింఛన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం సభ నుంచి పెద్ద గాలమే వేసిందని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటి వరకు ఆసరా పేరుతో నెలకు రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను ఏకంగా డబుల్ చేస్తామని రాహుల్ గాంధీ ఈ సభ వేదికగా గ్రాండ్ హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, ఫైలేరియా, డయాలసిస్ పేషెంట్లకు ఈ పింఛన్‌అందజేస్తామని ఖమ్మం సభలో ప్రకటించడం వెనుక బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో అండగా ఉంటున్న పింఛన్‌దారుల ఓట్లకు గండి కొట్టే వ్యూహం ఉందనే చర్చ జరుగుతోంది.

కేసీఆర్‌ను దించేందుకే కాంగ్రెస్‌లోకి

- తెలంగాణ జనగర్జన సభలో పొంగులేటి
- సీఎం కేసీఆర్ అహంకారంతో విర్రవీగుతున్నారు
- రెండు పర్యాయాలు గెలిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'మన ఆశయం.. మన లక్ష్యం.. మన ఆలోచన అంతా అధికార మదంతో ఉన్న సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును గద్దె దించడమే.. అందుకే కాంగ్రెస్‌లో చేరాం. అధికారం ఉంది కదా అని అహంకారంతో విర్రవీగుతున్న కేసీఆర్‌ను ఇంటికి పంపే పనిలో కష్టపడి పనిచేయాలి. కేసీఆర్ కల్లబొల్లి మాటలతో తెలంగాణ ప్రజలను వంచిస్తున్నారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు..'అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన జనగర్జన సభలో పొంగులేటికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.

తెలంగాణ కలను సోనియా సాకారం చేశారు..

'ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆరు దశాబ్దాలకు పైగా తెలంగాణ బిడ్డలు పోరాటం చేసినా ఎవరూ సాహసం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదు. కానీ 2014లో సోనియాగాంధీ తెలంగాణ ప్రజల ఆత్మ బలిదానాలను, వారి కోరికను గౌరవించి రాష్ట్రాన్ని ప్రకటించారు. ఇలా సాధించుకున్న రాష్ట్రంలో మాయమాటలతో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా కేసీఆర్ గెలిచారు. కానీ ఇచ్చిన వాగ్దానాలు, చెప్పిన మాటల్లో ఒక్కటి కూడా కేసీఆర్ పూర్తి చేయలేదు. రైతుల పక్షపాతినని ముఖ్యమంత్రి చెప్పుకుంటున్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో 8వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2014 మేనిఫెస్టోలో రైతు రుణాలు రూ.లక్ష మాఫీ చేస్తామని చెప్పారు. 2018లో కూడా అదే చెప్పారు. కానీ నేటికీ అమలు జరగలేదు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఇవి కూడా అమలు చేయలేదు..'అని పొంగులేటి ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నాయకత్వంలో, ఖర్గే ఆధ్వర్యంలో వరంగల్ సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రైతులకు లబ్ధి చేకూరుస్తారని, వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పారు.

ప్రజాభిప్రాయం తెలుసుకున్నాకే..

కాంగ్రెస్‌లో చేరడానికి సుమారు 6 నెలల తర్వాత ఒక నిర్ణయం తీసుకున్నట్లు పొంగులేటి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నామని, అనేక ప్రాంతాలు తిరిగామని, సంఘాలను కలిసి అభిప్రాయాన్ని తెలుసుకున్నామని చెప్పారు. అందరూ ఒకటే తీర్పు ఇచ్చారని, కాంగ్రెస్‌లో చేరితే.. పార్టీతోపాటు మీకు కూడా మంచి జరుగుతుందని చెప్పారన్నారు. ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకలను కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా మని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సాధ్యం..

కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించగలదని, బీఆర్ఎస్ బంగాళాఖాతంలో కలవాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని పొంగులేటి అన్నారు. రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర తర్వాత ఒక్క తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందన్నారు. తెలంగాణతో పాటు రాబోయే రోజుల్లో దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి రాహుల్‌ను ప్రధానమంత్రిని చేసే పనిలో అందరం శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా పాదయాత్ర చేసి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను అభినందిస్తున్నానని అన్నారు.

కేసీఆర్ సర్కార్‌ను బంగాళాఖాతంలో వేయాల్సిందే..

- సమసమాజం కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సమాజం చేసిందే పీపుల్స్‌మార్చ్
- తెలంగాణ జనగర్జన సభలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'యావత్ తెలంగాణ ప్రజానీకానికి రాష్ట్ర సంపద పంచడానికి, అసమానతలు లేని సమాజం తయారు చేయడం కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. కృష్ణ, గోదావరి జలాలు రాకుండా అడ్డు పడుతున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలోకి నెట్టాల్సిందే'అని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఈ ఏడాది మార్చి 16న చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఖమ్మంలోని జనగర్జన సభకు చేరుకోవడంతో ముగిసింది. 109 రోజులపాటు 1,360 కిలోమీటర్లు సాగిన ఈ పాదయాత్ర చివరి రోజు కూడా ఘనంగా సాగింది. పాదయాత్ర చేసిన భట్టిని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా అభినందించి.. శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి భట్టి ప్రసంగిస్తూ.. తన పాదయాత్రలో అన్ని వర్గాలను కలిసి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నానని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సమాజం చేసిందే పీపుల్స్‌మార్చ్‌గా అభివర్ణించారు. పోడు భూములకు హక్కు కల్పించాలని ఆదివాసీలు, ధరణితో సమస్యలున్నాయని రైతులు, ఉద్యోగాలు రావడం లేదని నిరుద్యోగులు ఇలా రాష్ట్రంలో అన్ని వర్గాలు ఆందోళనతో ఉన్నాయని అన్నారు. ధరణికి వ్యతిరేకంగా పోరాడటానికి రాష్ట్రవ్యాప్తంగా రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పోడు భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని భట్టి ఆరోపించారు. రాష్ట్ర సంపదను కేసీఆర్ కొల్లగొడుతున్నారని, దాన్ని ప్రజలకు పంచేందుకు.. సమసమాజ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పంచిన 24 లక్షల ఎకరాల భూముల్లో ఒక్క ఎకరం లాక్కున్నా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి హృదయపూర్వక అభినందనలు చెబుతున్నట్లు తెలిపారు. అలాగే భారత్ జోడో యాత్రకు పొడిగింపుగా ఏఐసీసీ సారథ్యంలో పీపుల్స్‌మార్చ్ యాత్రకు అవకాశం కల్పించిన పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

కేటీఆర్.. ఇప్పుడేమంటారు?

రూ.4 వేల పెన్షన్ ప్రకటనపై కోమటిరెడ్డి


ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వృద్ధులు, వికలాంగులు తదితర అన్ని రకాల వారికి రూ.4 వేల పెన్షన్ ఇచ్చే ఫైల్ పైనే తొలి సంతకం చేస్తామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని తెలిపారు. మంత్రి కేటీఆర్ తరుచూ 200 రూపాయలు ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలా? రూ.2 వేలు ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా అని మాట్లాడుతున్నారని, తాము అధికారంలోకి వస్తే రూ.4వేల పెన్షన్ ఇస్తామని, దీనిపై కేటీఆర్ ఏమంటారో చెప్పాలని అన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర నాయకులను పార్టీలోకి స్వాగతిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు.

కేటీఆర్‌వి అన్నీ గొప్పలే: ఉత్తమ్

ఖమ్మం మయూరి సెంటర్: కాంగ్రెస్ రూ.200 పె న్షన్ ఇచ్చిందని, తాము రూ.2 వేలు పెన్షన్ ఇ స్తున్నామని మంత్రి కేటీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆసరా లబ్ధిదారులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తామని చెప్పారు. ఖమ్మం సభకు ప్రజలు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, అయినా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చారని హర్షం వ్యక్తం చేశారు.

కల్వకుంట్ల కుటుంబాన్ని అండమాన్‌కు తరుముదాం

- వచ్చే డిసెంబర్ 9 నాటికి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కుతుంది..
- ఖమ్మంలోనే విజయోత్సవ సభ నిర్వహిస్తాం..
- జనగర్జన సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఆనాడు తెలంగాణ బిడ్డల త్యాగాలను గుర్తించి సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని కొల్లగొట్టింది. ఆ కుటుంబాన్ని అండమాన్‌కు తరమాల్సిన బాధ్యత తెలంగాణ యువకులపై ఉంది'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభలో ఆయన ప్రసంగిస్తూ గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న చీడపీడను వదిలించడానికి, తెలంగాణ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి రాహుల్ గాంధీ తరలివచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇబ్బంది ఉంటుందని తెలిసినా.. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని అన్నారు. ఆ నాడు డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రకటించిందని, అదే రోజు సోనియా గాంధీ పుట్టిన రోజు కూడా అని రేవంత్ తెలిపారు. వచ్చే డిసెంబర్ 9 నాటికి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని.. మళ్లీ ఇదే ఖమ్మం గడ్డపై విజయోత్సవ సభ నిర్వహిస్తామని ఆయన స్పష్టంచేశారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ సభ ఎన్నికల శంఖారావమని అన్నారు. ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ద్వారా పార్టీకి మరింత బలం పెరిగిందని, పొంగులేటితో పాటు పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్నానని తెలిపారు. ఖమ్మంలో పదికి పది సీట్లు గెలిపిస్తే.. రాష్ట్రంలో 80 సీట్లు సాధిస్తామని పేర్కొన్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క 109 రోజుల పాటు పాదయాత్ర చేసి ప్రజాసమస్యలను తెలుసుకున్నారని అన్నారు. ఆ సమస్యలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెడతామని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి ఖమ్మంలోనే పునాది పడిందన్నారు. 1969లో అప్పటి ఖమ్మం జిల్లాలోని పాల్వంచలో తెలంగాణ ఉద్యమం మొదలైందని రేవంత్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

వైద్య వృత్తి ఎంతో గొప్పది

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: వైద్య వత్తి అనేది ఎంతో గొప్ప వృత్తి అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ఒక హోటల్‌లో నిర్వహించిన డాక్టర్స్‌ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే సైనికులను, దేశానికి అన్నం పెట్టే రైతును, ప్రజలకు ప్రాణదానం చేసే వైద్యులను సమాజం మర్చిపోదన్నారు. కరోనా సమయంలో అయినవారు సైతం దూరంగా ఉంటే వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది మేమున్నాము అంటూ ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చారని కొనియాడారు. మానవాళిని కాపాడుకుంటున్న వైద్యుల సేవలను డాక్టర్స్‌ డే సందర్భంగా గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. దేశ ఆరోగ్య రంగంలో తెలంగాణ నీతి అయోగ్‌ ర్యాంకుల్లో 11వ స్థానం నుంచి 3 స్థానానికి చేరుకుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యనిపుణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు అఖిలేశ్‌ యాదవ్‌ రాక



సాక్షి, హైదరాబాద్‌: ఉత్తరప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌ యాదవ్‌ సోమవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావుతో ప్రగతిభవన్‌లో భేటీ అవుతారు. కేసీఆర్‌తో జరిగే లంచ్‌ భేటీలో జాతీయ రాజకీయాలపై ఇరువురు నేతలు చర్చిస్తారని సమాచారం.

16న విశాఖలో బీసీల మహా గర్జన

ఆర్‌.కృష్ణయ్య



విశాఖ మహా గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య

ముషీరాబాద్‌: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 16వ తేదీన విశాఖలో బీసీ మహా గర్జన సదస్సును నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య తెలిపారు. సభకు జాతీయ బీసీ అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్‌, జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణలు అధ్యక్ష వర్గంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు పోస్టర్‌ను ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు.

16 నుంచి పాత పెన్షన్‌ సాధన సంకల్ప యాత్ర

సీపీఎస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్‌: కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీం(సీపీఎస్‌) రద్దు, పాత పెన్షన్‌ విధానం అమలు సాధన కోసం ఈనెల 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాతపెన్షన్‌ సాధన సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎస్‌ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ కోరారు. సీపీఎస్‌ ఉద్యోగ సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 1.72 లక్షల మంది సీపీఎస్‌ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీరికి సీపీఎస్‌ నిలుపు చేసి, సామాజిక భద్రత ఇచ్చే పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. తక్షణమే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలగుండా సీపీఎస్‌ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి పాత పెన్షన్‌ సాధన సంకల్ప యాత్ర నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్‌ శ్రీకాంత్‌, కోశాధికారి నరేష్‌ గౌడ్‌, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి పాత పెన్షన్‌ సాధన సంకల్ప యాత్ర పోస్టర్‌, కర పత్రాలను ఆవిష్కరించారు. సంకల్ప యాత్ర ఈ నెల 16 నుండి 31 వరకు అన్ని జిల్లాలగుండా కొనసాగుతుందని, అభీ నహీ తో..కభీ నహీ అనే నినాదంతో యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఇంకా అందని పుస్తకం.. మొదలవ్వని పాఠం

పాఠశాలలు ప్రారంభించి 15 రోజులవుతోంది. ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే కొన్ని చాప్టర్లకు సంబంధించిన పాఠాలు పూర్తయ్యాయి. కానీ వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఇప్పటివరకు కనీసం ఒక్క పాఠం కూడా ఉపాధ్యాయులు బోధించలేదు.

రాష్ట్రవ్యాప్తంగా 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలుంటే... ఇప్పటికీ 15 వేలకు పైగా స్కూళ్లలో ఇప్పటికీ పాఠాలు మొదలవ్వలేదు. పాఠ్య పుస్తకాలు అందకపోవడంతో జూలై నెల ప్రారంభమైనా ఇంకా పునఃశ్చరణకే పరిమితం అవ్వాల్సి వస్తోంది. –సాక్షి, హైదరాబాద్‌

15 వేలకు పైగా స్కూళ్లలో ఇదే పరిస్థితి

- కొద్దిరోజుల క్రితం వరకు జిల్లా కేంద్రాల్లోనే పాఠ్య పుస్తకాలు
- పంపిణీ టెండర్ల ఖరారులో ఆలస్యమే కారణం
- 15 రోజుల క్రితమే ప్రారంభమైన పాఠశాలలు
- పునఃశ్చరణకే పరిమితమైన సర్కారీ బడులు
- ఇప్పటికీ 14% ముద్రణ పెండింగ్‌లోనే..





హెచ్‌ఎంలకు బిల్లులు ఇవ్వకపోవడంతో..

వాస్తవానికి స్కూళ్ళు తెరిచేలోగా పుస్తకాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు తగ్గట్టుగానే పుస్తకాల ముద్రణపైనా దృష్టి పెట్టారు. ముద్రణ పూర్తయిన పుస్తకాలను స్కూళ్ళు తెరిచేలోగానే జిల్లా కేంద్రాలకు పంపారు. కానీ వాటిని వేసవి సెలవులు ముగిసేలోగా స్కూళ్ళకు చేరవేయడంలో సర్కారు విఫలమయ్యింది. ప్రతి ఏటా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు జిల్లా కేంద్రాల నుంచి స్కూళ్ళకు పుస్తకాలు చేరవేసే వాళ్ళు. ఇందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించేది. అయితే గత ఏడాదికి సంబంధించిన బిల్లులు ఏడాది గడిచినా ఇవ్వకపోవడంతో హెచ్‌ఎంలు ఈ ఏడాది మొండికేశారు. దీంతో కొద్దిరోజుల క్రితం వరకు పుస్తకాలన్నీ జిల్లా కేంద్రాల్లోనే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో రవాణా కోసం ప్రత్యేకంగా టెండర్లు పిలవాలని విద్యాశాఖ ఆదేశించినా, ఈ ప్రక్రియ కూడా చాలా ఆలస్యం అయ్యింది.

టెండర్ల ఖరారులో ఆలస్యం..

పుస్తకాలను స్కూళ్లకు రవాణా చేసేందుకు ప్రతి జిల్లా డీఈవో పరిధిలో టెండర్లు పిలిచారు. అయితే స్కూళ్ళు తెరిచిన తర్వాత టెండర్లు పిలవడంతో వాటిని ఖరారు చేసేవరకే జూన్‌ నెలాఖరు అయ్యింది. ఈ కారణంగానే రాష్ట్రంలోని సగానికిపైగా స్కూళ్లకు పాఠ్య పుస్తకాలు అందలేదు. పుస్తకాల రవాణా పూర్తి చేసేందుకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉందని టెండర్లు దక్కించుకున్న సంస్థలు చెబుతున్నాయి.

పంపిణీ పూర్తయినా కొరతే..

రాష్ట్రవ్యాప్తంగా 28,77,675 మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ళలో ఉన్నారు. వీరికి ఉచితంగా పుస్తకాలు అందించాల్సి ఉంటుంది. సబ్జెక్టులు, లాంగ్వేజీలు కలిపి 1,63,78,607 పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. గత ఏడాది ముద్రించినవి పోను, 1,57,48,270 పుస్తకాలు అందించాల్సి ఉంది. ఇప్పటివరకు 1,35,85,185 పుస్తకాలు ముద్రించి, జిల్లా కేంద్రాలకు కూడా చేరవేశారు. ఇంకా 14 శాతం పుస్తకాలు ముద్రించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న వాటి పంపిణీ పూర్తి చేసినా, కొన్ని స్కూళ్ళకు పుస్తకాల కొరత తప్పేట్టు లేదు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు వచ్చే నెలాఖరు వరకూ కూడా పుస్తకాలు అందే అవకాశం లేదని అధికారులు అంటున్నారు.

రెగ్యులర్‌ క్లాసులు మొదలు పెట్టాలి..

పుస్తకాల పంపిణీ ఆలస్యమై ఇప్పుడిప్పుడే పాఠశాలలకు చేరుతుండటంతో.. ప్రస్తుతం చాలావరకు ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది మొదలు పెట్టిన తొలిమెట్టు కార్యక్రమం కొనసాగుతోంది. ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూల్స్‌లో పునఃశ్చరణ చేస్తున్నారు. కోవిడ్‌ కాలంలో జరిగిన అభ్యసన నష్టాన్ని పూడ్చడం కోసం ఈ ప్రక్రియ అనివార్యమని విద్యాశాఖ భావించింది. అయితే దీన్ని అదనపు గంటల్లో చేపట్టి, రెగ్యులర్‌ క్లాసులు మొదలు పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కష్టంలోనే కాళేశ్వరం విలువ తెలిసేది

▶ మొదటి పేజీ తరువాయి

దిగువ మానేరుకు, సగం నీటిని పునరుజ్జీవన వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి తరలించాలి. తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి తుంగతుర్తి మీదుగా సూర్యాపేటలోని చివరి ఆయకట్టు చినసీతారాం తండా దాకా సాగునీరు అందేలా పకడ్బంది చర్యలు చేపట్టాలి' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ఆదివారం సచివాలయంలో సీఎం కేసీఆర్‌ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత కష్టపడ్డారో, అదే స్థాయిలో ప్రాణహిత, గోదావరి ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లు ఎత్తిపోస్తూ రాష్ట్రంలో తాగు, సాగు నీటికి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నీటిపారుదల, విద్యుత్‌, వ్యవసాయ శాఖ అధికారులపై ఉందని నొక్కిచెప్పారు. 'ఇన్ని రోజులు ఒకెత్తు... ఇప్పుడు ఒకెత్తు. ఇది నీటిపారుదల శాఖకు పరీక్షా సమయం'అని వ్యాఖ్యానించారు. పాలేరు రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్‌ నుంచి నీరు వచ్చే అవకాశాలు ప్రస్తుతం లేనందున బయ్యన్నవాగు నుంచి నీటిని సందర్భానుసారం పాలేరుకు వదిలేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

చుక్క చుక్కనూ ఒడిసిపట్టాలి...

తాగునీటికి ప్రాధాన్యతనిచ్చి గోదావరి, కృష్ణా నదుల పరిధిలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం కేసీఆర్‌ సూచించారు. నీటిపారుదల, విద్యుత్‌ శాఖలు ఈ మేరకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో తాగు, సాగునీటికి లోటు రానీయకుండా చుక్కచుక్కనూ ఒడిసిపట్టి ప్రజలకు నీటిని అందించాలన్నారు. ఎత్తిపోతలకు సరిపోయే విద్యుత్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ నీటిపారుదల, విద్యుత్‌ శాఖ సమన్వయం చేసుకోవాలని సూచించారు.

మళ్లీ విత్తనాలు, ఎరువుల పంపిణీకి ప్రణాళిక...

ఇప్పటికే కురిసిన వానలకు పత్తి, ఇతర విత్తనాలు వేసిన ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులతో మొలకలెత్తకుండా ఎండిపోయిన నేపథ్యంలో తిరిగి రైతులు విత్తుకొనే పరిస్థితులున్నాయని ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు తిరిగి అందించగలిగే విధంగా అత్యవసర ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖను కేసీఆర్‌ ఆదేశించారు.

సంక్షోభంలో సైతం పంటలు పండించి చూపాలి..

'ఇది మునుపటి తెలంగాణ కాదు. గతంలో లాగా ఆలోచిస్తే కుదరదు. నీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు కట్టుకున్నాం. తాగునీరు, సాగునీటి అవసరాలకు సమృద్ధిగా నీరు అందుతున్నది. ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడే మన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి. సంక్షోభ సమయంలోనే మనం పంటలు పండించి చూపించాలి. అప్పుడే మనం సిపాయిలం. అన్ని వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ ఎవరి పని వారు సమర్థంగా నిర్వహిస్తూ మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలి. ఈ పరిస్థితిని సవాలుగా తీసుకోవాలి. ఈ ఒక్క సంవత్సరం అనుభవం భవిష్యత్‌ తెలంగాణ చరిత్రలో ఉపయోగపడుతుంది. ఎక్కడి ఈఎన్సీలు అక్కడే ఉండి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు నీరు అందించడమే లక్ష్యంగా నిరంతరం ఏకాగ్రతతో పనిచేయాలి. ఇందుకు అందరం కలిసి ప్రతిజ్ఞ తీసుకోవాలి'అని సీఎం స్పష్టం చేశారు.

తాగునీటి సమస్య రాకూడదు..

రాష్ట్రంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని మిషన్‌ భగీరథ ఈఎన్సీని సీఎం ఆదేశించారు. ఉదయసముద్రం, కోయిల్‌ సాగర్‌ రిజర్వాయర్లలో కొంత నీటి కొరత ఉందని, వాటిలో నీటి నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

పంపింగ్‌ నిర్వహణ జెన్‌కోకు

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పంపింగ్‌ నిర్వహణను ప్రైవేట్‌ కాంట్రాక్టర్లకు కాకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కోకు ఇచ్చేలా విధివిధానాల ఖరారుకు చర్యలు చేపట్టాలని నీటిపారుదల అధికారులను సీఎం ఆదేశించారు.

నీటిని పొదుపుగా వాడాలి...

ప్రస్తుత కష్టకాలంలో ప్రజలు, రైతాంగం నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సీఎం కేసీఆర్‌ సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖల సూచనలు పాటిస్తూ పంటలు పండించుకోవాలని రైతులను కోరారు.

రైతురాజ్యం కోసం జవాన్ల ముందడుగు గొప్ప పరిణామం

- మహారాష్ట్రకు చెందిన మాజీ సైనికుల చేరిక కార్యక్రమంలో సీఎం కేసీఆర్‌
- పరివర్తన్‌ భారత్‌తోనే గుణాత్మక మార్పు సాధ్యమని వెల్లడి
- సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని నేతలకు సూచన



సాక్షి, హైదరాబాద్‌: అబ్‌ కి బార్‌ కిసాన్‌ సర్కార్‌ పిలుపు అందుకొని రైతురాజ్య స్థాపన కోసం దేశ జవాన్లు ముందుకు రావడం గొప్ప పరిణామమని బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌ జిల్లాకు చెందిన ఫౌజీ జనతా పార్టీ కార్యదర్శి, మాజీ సైనికుడు సునిల్‌ బాపురావు పగారెతోపాటు పలువురు మాజీ సైనికాధికారులు హైదరాబాద్‌లో కేసీఆర్‌ సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ మాట్లాడుతూ పరివర్తన చెందిన భారతదేశంతోనే గుణాత్మక మార్పు సాధ్యమని, అబ్‌ కీ బార్‌ కిసాన్‌ సర్కార్‌ నినాదాన్ని నలుమూలలా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. సంప్రదాయ పద్ధతుల్లో ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న పాలనను సమూలంగా మార్చుకొని రైతుల సంక్షేమం, అభివృద్ధి, సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పార్టీ నేతలంతా ముందుకు సాగాలన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించిన సీఎం కేసీఆర్‌ మహారాష్ట్రలోనూ వాటిని అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పునకు దోహదం చేసే దిశగా వీర సైనికులై కర్తవ్య నిర్వహణను కొనసాగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నేతలు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్‌, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి పాల్గొన్నారు.

వ్యాగన్ల తయారీ కేంద్రంగా కాజీపేట

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్పత్తి కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని ప్రధాని ఆదేశించారని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 8వ తేదీలోగా దీనికి భూమి కేటాయింపు కూడా పూర్తవుతుందన్నారు. కాగా సుమారు రూ.5,587 కోట్ల వ్యయంతో వరంగల్‌ను కలిపే, పలు జాతీయ రహదారులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారని తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం ఏర్పాటు చేయకున్నా.. రాష్ట్రం ఏర్పాటు చేస్తుందని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఏమైందో ముఖ్యమంత్రి కేసీఆర్‌ చెప్పాలని డిమాండ్‌ చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ బాధ్యత కేసీఆర్‌, కల్వకుంట్ల ఫ్యామిలీదేనని స్పష్టం చేశారు.

దేశంలోనే తొలిసారిగా ఔటర్‌ రింగ్‌ రైలు..

తెలంగాణలోని పలు జిల్లాలను కలుపుతూ 340 కిలోమీటర్ల మేర హైదరాబాద్‌ రీజినల్‌ రింగ్‌ రోడ్డును నిర్మిస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు రూ.26 వేల కోట్ల మేరకు ఖర్చవుతుందని చెప్పారు. ట్రిపుల్‌ ఆర్‌కు అనుసంధానంగా దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌కు ఔటర్‌ రింగ్‌ రైలు ప్రాజెక్టు రానుందని తెలిపారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రకు వెళ్లే రైల్వే లైన్లకు ఔటర్‌ రింగ్‌ రైల్‌ ప్రాజెక్ట్‌ ఉపయోగకరంగా ఉంటుందని, సిటీకి రాకుండా సరిహద్దుల నుంచే గమ్యస్థానాలకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. రింగ్‌ రైలు ప్రాజెక్టు వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని, భూసేకరణ పూర్తయితే వెంటనే పనులు మొదలు పెడతామని వివరించారు.

అధ్యక్షుడి మార్పుపై ఎవరైనా చెప్పారా..?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై జరుగుతున్న ప్రచారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి నేరుగా స్పందించకుండా జవాబు దాటవేసే ప్రయత్నం చేశారు. 'అధ్యక్ష మార్పు ఉంటుందని ఎవరైనా మీకు చెప్పారా.. అందరం వేదికపై కలిసే ఉన్నాముగా.. ఇంతకంటే క్లారిటీ ఏముంటుంది.. అలాంటిదేమీ లేదు'అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ కిరాణా దుకాణం లాంటిది..

బీఆర్‌ఎస్‌ అధినేత, సీఎం కేసీఆర్‌ అంటేనే ద్రోహం, కుట్రలకు ప్రతిరూపమని బండి సంజయ్‌ ధ్వజమెత్తారు. అభివృద్ధి గురించి మాట్లాడకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు దుష్ట రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా కేసీఆర్‌ మాత్రం సహకరించడం లేదన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరిగితే బీజేపీకి ఎక్కడ పేరొస్తుందో అన్న భయంతోనే సహకరించకుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ పార్టీ కిరాణ దుకాణం లాంటిదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ లేదని, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని సంజయ్‌ చెప్పారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 8న హనుమకొండ ఆర్ట్స్‌ కాలేజీలో 15 లక్షల మంది జనంతో కనీవినీ ఎరగని రీతిలో సభ నిర్వహించనున్నామని తెలిపారు.ఈ సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్‌, ఏపీ జితేందర్‌ రెడ్డి, గరికపాటి మోహన్‌ రావు, మాజీ మంత్రులు మర్రి శశిధర్‌ రెడ్డి, జి.విజయరామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్‌ రెడ్డి, బంగారు శ్రుతి, హనుమకొండ, వరంగల్‌, కరీంనగర్‌ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్‌, గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టాపర్లంతా ముంబై ఐఐటీ వైపే

ఎక్కువ మంది కంప్యూటర్‌ సైన్స్‌కే ● టాప్‌ 100లో 89 మంది ఇదే బాట

సాక్షి, హైదరాబాద్‌: ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఎక్కువ మంది టాపర్లు కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌కే ప్రాధాన్యతనిచ్చారు. తాజాగా వెల్లడించిన తొలి దశ సీట్ల కేటాయింపులో ఈ విషయం స్పష్టమైంది. ఐఐటీల్లో ఎక్కువ మంది టాపర్లు ముంబై ఐఐటీకే మొదటి ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ మంది అక్కడే సీట్లు పొందారు. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండటంతో 66వ ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. అడ్వాన్స్‌డ్‌లో టాప్‌ వందలో ర్యాంకులు పొందిన 89 మంది తొలి ప్రాధాన్యతగా ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నారు. వీరిలో మెరిట్‌ ప్రకారం 67 మందికి సీట్లు వచ్చాయి. గత ఏడాది టాప్‌ 100లో 93 మంది ఐఐటీ ముంబైలో కంప్యూటర్‌ సైన్స్‌ కోర్సుకు ఆప్షన్‌ ఇచ్చారు.

టాపర్స్‌ ఏ ఐఐటీలో ఎంత మంది ఆప్షన్లు ఇచ్చారు?

ఐఐటీ	విద్యార్థుల సంఖ్య
టాప్‌ 10లో...	
ముంబై	10
టాప్‌ 50లో...	
ముంబై	47
ఢిల్లీ	2
మద్రాస్‌	1
టాప్‌ 100లో...	
ముంబై	89
ఢిల్లీ	6
మద్రాస్‌	4
టాప్‌ 500లో...	
ముంబై	431
ఢిల్లీ	36
కాన్పూర్‌	5
మద్రాస్‌	21
ఖరగ్‌పూర్‌	3
గౌహతి	1

నిమ్స్‌లో రోబోటిక్‌ సర్జరీలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్‌ సక్సెస్‌ రేట్‌ కూడా నూటికి నూరు శాతం ఉంటుంది. క్లిష్టమైన మూత్రాశయం, పెద్దపేగు, చిన్న పేగు, క్లోమం, కాలేయం, గర్భసంచి, అన్నవాహిక.. తదితర సర్జరీలను రోబో విధానంలో మరింత మెరుగ్గా నిర్వహించవచ్చు. అతి సూక్ష్మమైన కేన్సర్‌ కణతులను సైతం తొలగించడానికి వీలుంటుంది. ముఖ్యంగా సర్జికల్‌ ఆంకాలజీ, సర్జికల్‌ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, కార్డియోథొరాసిక్‌ సర్జరీ, గైనకాజీ విభాగాల్లో మరింత మెరుగైన శస్త్ర చికిత్సలు చేయడానికి వీలుంటుంది.

వైద్య సేవల్లో దేశానికే రోల్‌మోడల్‌ : నిమ్స్‌ డైరెక్టర్‌ బీరప్ప

వైద్య సేవల్లో నిమ్స్‌ ఆస్పత్రి దేశానికే రోల్‌ మోడల్‌గా నిలిచిందని నిమ్స్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప అన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలు ఖర్చయ్యే శస్త్రచికిత్సలను నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే చేస్తున్నామన్నారు. ఎంత పెద్ద ఆపరేషన్‌ చేయించుకున్నా రోగి మూడో రోజునే ఇంటికి వెళ్లే విధంగా దోహదపడే రోబోటిక్‌ సిస్టంను సమకూర్చుకున్నామన్నారు. స్పెషాలిటీ బ్లాక్‌లోని ఆపరేషన్‌ థియేటర్లలో ఏర్పాటు చేసిన ఈ రోబోటిక్‌ సర్జరీ సిస్టంను ప్రస్తుతానికి సర్జికల్‌ ఆంకాలజీ, సర్జికల్‌ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ విభాగాలలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు డాక్టర్‌ బీరప్ప తెలిపారు.



'రెరా' చైర్మన్‌గా నియమితులైన సత్యనారాయణ రెడ్డి.. సహ సభ్యులు శ్రీనివాస రావు, లక్ష్మీనారాయణలతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌ రావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రెరా చైర్మన్‌, సభ్యులను సీఎం అభినందించారు.

మున్నూరుకాపులు రాజకీయాల్లోకి రావాలి

మున్నూరుకాపు విద్యావంతుల సదస్సులో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్‌



సదస్సులో పాల్గొన్న బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ తదితరులు

కీసర: మున్నూరుకాపు కులస్తుల్లోని విద్యావంతులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులు రాజకీయాల్లోకి వచ్చి సామాజికవర్గానికి గుర్తింపును తీసుకొచ్చేందుకు కృషి చేయాలని బీజేపీ ఓబీసీ జాతీయ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్య సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌ శివారులోని నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన మున్నూరుకాపు విద్యావంతుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ మాట్లాడుతూ తెలంగాణలో 53 శాతం ఉన్న బీసీ కులస్తుల్లో సమగ్ర సర్వే సరిగ్గా నిర్వహించని కారణంగా మున్నూరుకాపుల జనాభా శాతం కూడా సరిగ్గా లెక్కకు రాని పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్‌ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన మున్నూరుకాపులకు అన్ని రంగాల్లో తగిన గుర్తింపు ఇవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ మున్నూరుకాపు కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి రూ. 5 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు త్వరలో గవర్నర్‌ను కలసి వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో వాటర్‌ రిసోర్స్‌ చైర్మన్‌ వీరమల్ల ప్రకాశ్‌, ఉమెన్స్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఆకుల లలిత, మాజీ మేయర్‌ బొంతు రామ్మోహన్‌, ఐఏఎస్‌ అధికారి కె.ఎస్‌. కుమార్‌, ఓటరీ టెక్నాలజీ సొల్యూషన్‌ సీఈఓ సంజయ్‌ కుమార్‌, శ్రీశైలం మున్నూరుకాపు సంఘం ట్రస్టు అధ్యక్షుడు ఎం.హెచ్‌.రావు, గోపాలకృష్ణ, ఐటీ మాజీ చీఫ్‌ కమిషనర్‌ పి.వి. రావు, బీజేపీ రాష్ట్ర టెజరర్‌ బి.శాంతికుమార్‌, విజయ్‌కుమార్‌, కొండ దేవన్న, గోలి మోహన్‌, ఆర్గనైజర్‌ జయశ్రీ, నిమ్మ శంకర్‌, రమేష్‌, తేళ్ల శ్రీధర్‌, మురళీధర్‌, మహేందర్‌, సామల వేణు తదితరులు పాల్గొన్నారు.



జనగర్జన సభ వేదికపై రాహుల్‌ గాంధీ. చిత్రంలో బోసురాజు, జానారెడ్డి, రేణుకాచౌదరి, మధుయాష్కి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, గద్దర్‌, కోమటిరెడ్డి, ఉత్తమ్‌, మహేశ్‌కుమార్‌ గౌడ్‌, జగ్గారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య తదితరులు

పొంగులేటికి పార్టీ కండువా కప్పిన రాహుల్‌గాంధీ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్‌పై అసంతృప్తి బయటపెట్టిన ఆరునెలల తర్వాత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులు, అభిమానులతో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఖమ్మంలో తెలంగాణ జనగర్జన సభ వేదికగా పొంగులేటికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు అనుచరులకు కూడా పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈమేరకు కాంగ్రెస్‌లో చేరిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్‌ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ పిడమర్తి రవి, డీసీసీబీ మాజీ చైర్మన్‌ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, పొంగులేటి ప్రసాదరెడ్డి, పద్మావతి రవి, మార్క్‌ఫెడ్‌ మాజీ వైస్‌చైర్మన్‌ బొర్రా రాజశేఖర్‌, వైరా మున్సిపల్‌ చైర్మన్‌ సూతకాని జైపాల్‌, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబి స్వర్ణకుమారి, తెల్లం వెంకట్రావు, కొండూరు సుధాకర్‌, బొక్కలగడ్డ చంద్రశేఖర్‌, ఊకంటి గోపాలరావు, బానోత్‌ విజయాబాయి, జారె ఆదినారాయణ, డాక్టర్‌ కోటా రాంబాబు, కోటా సుజాతరాణి, డాక్టర్‌ రాజారమేష్‌, కొత్త మనోహర్‌రెడ్డి, మారుబోయిన రఘునాథ్‌ యాదవ్‌, ఝాన్సీరెడ్డి, మాజీ ఐఏఎస్‌ అధికారి డీపీ రావు, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌ తుమ్మల పాపిరెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాసేవ చేయడానికే నియోజకవర్గం కబ్జా

ప్రతిపక్షాల భూ కబ్జాల ఆరోపణల్లో వాస్తవం లేదు: ముత్తిరెడ్డి
ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని కొమ్మూరి రాజకీయం చేస్తున్నాడు

చేర్యాల (సిద్దిపేట): ప్రజా సేవ చేయడానికే నియోజకవర్గాన్ని కబ్జా చేశానే తప్ప, ప్రతిపక్షాల భూ కబ్జాల ఆరోపణల్లో వాస్తవం లేదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి వద్ద మడేలయ్య ఆలయం ఆవరణలోని కాల్వపై రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పైకప్పు పనులను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ అంకుగారి స్వరూపరాణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 'నా చివరి మజిలీ వరకు నియోజకవర్గంలోనే ఉంటా.. నా చితి కట్టె కాలేది ఇక్కడే.. నా చితాభస్మాన్ని నియోజకవర్గంలోని ప్రతీ చెరువులో కలపాలి' అని ఎమ్మెల్యే స్థానిక నాయకులను కోరారు. పెద్ద చెరువు మత్తడి నీరు పట్టణంలోకి రాకుండా చేసేందుకు కొనుగోలు చేసిన స్థలం (1,270 గజాలు) తన బిడ్డ చేర్యాల మున్సిపాలిటీకి అప్పగిస్తానని చెప్పడాన్ని స్వాగతించానన్నారు. ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన బిడ్డ బూట్లు తుడవడానికి కూడా పనికిరాడని విమర్శించారు. నియోజకవర్గ ప్రజల చేత ఛీకొట్టబడిన కొమ్మూరికి విమర్శించే అర్హత లేదన్నారు. చేర్యాల పరిసర ప్రాంతాల్లో సుమారు 33ఎకరాల్లో వెంచర్‌ చేసి నిబంధనల ప్రకారం గ్రామపంచాయితీ, మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన 10 శాతం (20వేల గజాలు) భూమిని సైతం అమ్ముకున్న నీచుడు కొమ్మూరి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే స్థాయిలో ఉండి తన బిడ్డ మాదిరిగా గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన 20 వేల గజాల స్థలాన్ని అప్పగించి చిత్తశుద్ధి చాటుకోవాలని హితవు పలికారు.



మన పిల్లల్ని సరైనవాటిని కోరుకొమ్మని బోధించడమే విద్య.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 3 జూలై 2023

అవార్డులూ.. బహుమతులూను

'అవార్డులు రావు. కష్టపడి సంపాదించుకోవాలి' అని అబ్బూరి వరద రాజేశ్వరరావు ఒకసారి అన్నారు.

సాహిత్యం, ఆ మాటకొస్తే ఏ కళైనా ప్రచారం కోరుకుంటుంది. ప్రచారం దేనికి? కీర్తి కోసం అనుకునేవారు కొందరు. కళ నిర్వర్తించాల్సిన పరమార్థం కోసం అనుకునేవారు కొందరు. ఉత్కృష్టమైన కళ మబ్బుల చాటు సూరీడు వలే ఎల్లకాలం దాగి ఉండదు. జనులకు తెలిసే తీరుతుంది. ఆదరణ పొందుతుంది. కాని బంగారు చేటకు కూడా గోడచేర్పు అవసరం అన్నట్టు కొన్నిసార్లు కళ ప్రచారం కావడానికి, ఫలానా కళాకారుడి కృషి చూడండహో అని తెలుపడానికి అవార్డులూ, బహుమతులూ ఉపయోగపడతాయి. అయితే కాలక్రమంలో ఇడ్లీ కంటే చట్నీకి విలువెక్కువైనట్టు కళ కంటే ఈ అవార్డులకు విలువ ఎక్కువై అవార్డు వచ్చినవారు 'గొప్పవారేమో' అనే భావన జన సామాన్యులలో ఏర్పడే పరిస్థితి వచ్చింది.

ముళ్లపూడి వెంకటరమణ 'ఎన్ని ఫ్యాన్లున్నా ఒక్క ఏసీకి సమానం కావు గందా' అని ఏదో పాత్ర చేత అనిపిస్తారు. చచ్చు పుచ్చు పుస్తకాలు ఎన్ని రాసినా ఒక సరైన అవార్డు కొడితే తల ఎగరేస్తూ తిరగొచ్చు కదా అనుకునే స్త్రీ పురుష సాహితీకారులు నేడు ఇరు రాష్ట్రాలలో తగు మోతాదులో మేట వేశారనే వాస్తవిక అపోహ ఉంది. జోకులు చలామణీలో ఉన్నాయి. ఒక ప్రఖ్యాత కవికి సరస్వతీదేవి ప్రత్యక్షమై 'వత్సా! కవిత్వం కావలెనా? న్యూఢిల్లీ వారి ఫలానా సాహితీ అవార్డు కావలెనా?' అని అడిగితే ఆ కవి సెకను తొట్రుపడకుండా 'కవిత్వమే దయచేయి తల్లీ! అవార్డును ఎలాగోలా మేనేజ్ చేసుకుంటాను' అన్నాట్ట!

మనుషులంటూ ఉన్న ప్రతిచోటా తప్పులు, పొరపాట్లు ఉన్నట్టే అవార్డు అనే మాట ఉన్న చోటల్లా తప్పులూ, పొరపాట్లూ, రాజకీయాలూ, బాసిసలకు వరాలూ ఉంటాయి. సాహిత్యంలో సర్వోన్నతమైనదిగా భావించే నోబెల్ పురస్కారం టాల్స్టాయ్‌కి రాలేదు. ఆయనకు కాకుండా ఆ తర్వాత దాదాపు 39 మంది నవలాకారులకు నోబెల్ ఇచ్చారు. వారంతా 'మేము టాల్స్టాయ్‌కి వారసులం మొర్రోయ్' అన్నారు. గాంధీకి నోబెల్ శాంతి ఇవ్వలేదుగాని ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన మార్టిన్ లూథర్ కింగ్‌కు ఇచ్చారు. చైతన్య స్రవంతికి ఆద్యుడైన జేమ్స్ జాయిస్‌కి నోబెల్ రాలేదు. కథా చక్రవర్తయిన సోమర్‌సెట్ మామ్‌కు ఎందుకివ్వలేదయ్యా అనంటే 'అతడు అక్కరకు మించిన ప్రచారం పొందాడు' అని సాకు చెప్పారు. మన దగ్గర రవీంద్రనాథ్ టాగోర్‌కి సరే, ప్రేమ్‌చంద్, శరత్‌లు నోబెల్‌కు ఏం తక్కువ అని తూకం వేసి నిరూపిస్తే సదరు అవార్డు కమిటీ ఏం చెబుతుందో ఏమో!

భారతదేశం వంటి దేశంలో రచయితలు, కవులు కేవలం తన రచనలతో బతికే పరిస్థితులు లేవు. ఎంతో గొప్ప అంకితభావం, ప్రతిభ, రచనాశక్తి, జనహిత అభిలాష కలిగిన రచయితలైనా బతుకు బాదరబందీలకు అవస్థలు పడుతూ కవిత్వమో, కథో రాయాలి. అప్పోసప్పో చేసి పుస్తకాలు వేసుకోవాలి. అవి అమ్ముడు పోకపోతే అటక మీద గుడ్డ కప్పి దాచుకోవాలి. ఇలాంటి సందర్భాలలో వీరికి తృణమో పణమో ఇచ్చి అవార్డు చేతపెట్టి గౌరవించుకుందాం అనే సదుద్దేశ సాహితీ సంస్థలు అనేకమే వచ్చాయి. ఇవి తమ తమ అభిరుచి, అభిలాషల మేర అవార్డులు ఇచ్చి ప్రోత్సహించినా, వాటిలో ప్రతిష్ఠాత్మకస్థాయి కలిగినవి బహు స్వల్పం కావడంతో ప్రభుత్వపరంగా వచ్చే రాష్ట్ర అవార్డులు, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డులు ప్రతిష్ఠాత్మకమై కూచున్నాయి.

'షేక్‌స్పియర్‌కు ఏ అవార్డు వచ్చిందని నేటికీ చదువుతున్నారు', 'వేమనకు ఎవరు అవార్డిచ్చారని ప్రతి నాలుక మీద పలుకుతున్నాడు' అని ఎవరు ఎన్ని కబుర్లు చెప్పినా యోగ్యులైన సాహితీకారులకు యోగ్యమైన అవార్డు వచ్చి తీరాలి. లేకుంటే అయోగ్యులు ఆ అవార్డులు పొందుతూ అవార్డుకు అయోగ్యతను తెచ్చి పెడతారు. అసలు సాహితీకారులు తమ వల్ల అవార్డుకు గౌరవం రావాలని కోరుకోవాలేగాని అవార్డు వల్ల తమకు గౌరవం రావాలనుకుంటున్నారంటేనే వీరెంత నిరుపేదలో అర్థం చేసుకోవచ్చు. ఇందుకై ఏళ్ల తరబడి పి.ఆర్ చేయుట, పెద్దలను మచ్చిక చేసుకొనుట, పథకాలు రచించుట, దొంగ పద్ధతిలో షార్ట్‌లిస్ట్‌లో చేరుట, కుల సమీకరణలు, ప్రాంతీయ సెంటిమెంట్లు.. ఇన్ని పతన సోపానాల మీద నడిచి అవార్డు తెచ్చుకుని అల్మారాలో పెట్టుకుని పొద్దున్నే అద్దంలో ముఖం ఎలా చూసుకుంటారో వీరు! నలుగురూ తిరిగే చోట తమ పుస్తకం పెట్టి, దాని మీద డబ్బు పెడితే ఆ డబ్బు కోసమైనా ఎవరూ పుస్తకాన్ని తీసుకెళ్లని నాసిరకం రచయితలు, కవులు కూడా ఫలానా అవార్డు కోసం పైరవీ చేసేవారే! వీరికి ఊ కొట్టే దిక్కుమాలిన జ్యూరీలు!

'అవార్డు వస్తే ఏమవుతుంది' అనంటే 'నోరు మూతబడుతుంది' అనేది ఒక జవాబు. ప్రభుత్వానికి ప్రత్యర్థిగా ఉండాల్సిన కవులు, రచయితలు ప్రభుత్వపరమైన అవార్డులు తీసుకున్నాక ప్రభుత్వానికి ములాజా అవుతారు. ఈ కారణం చేత కూడా ప్రభుత్వాలు అవార్డులను సృష్టిస్తాయి, ఇచ్చి ప్రోత్సహిస్తాయి. తమిళ రచయిత జయమోహన్ తనకొచ్చిన 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఈ కారణం చేతనే తిరస్కరించాడు. అయితే సరైన రచయితలు తమకు అవార్డుల వల్ల వచ్చిన అదనపు గుర్తింపును జనం కోసం ఉపయోగించడం మంచి స్ట్రాటజీనే!

ప్రస్తుతం తెలుగునాట అవార్డుల దుమారం రేగి ఉంది. అవార్డు ఇస్తాం అనంటే గౌరవప్రదమైన సాహితీకారులు పరిగెత్తి పోరిపోయే స్థితి ఉంది. నాణ్యమైన రచనల పట్ల తెలుగు పాఠకలోకం ఉదాసీనత మాని, వాటిని అక్కున జేర్చుకుంటూ, ఆ రచనలకు సముచిత స్థానం కల్పిస్తూ వెళ్లడమే దీనికి విరుగుడు. పాఠకుడి అవార్డులు, బహుమతులే ఇప్పుడు తెలుగు సాహిత్యానికి శ్రీ సరస్వతీ రక్ష.

నెహ్రూకు నచ్చింది మోదీ చేతికొచ్చింది!

కామెంట్



కరణ్ థాపర్

అమెరికా పర్యటనలో మన ప్రధానమంత్రికి బైడెన్ దంపతులు ఇచ్చిన కానుకలలో 'కలెక్టెడ్ పొయెమ్స్ ఆఫ్ రాబర్ట్ ఫ్రాస్ట్' తొలి ముద్రణ ప్రతి ఉంది. ఫ్రాస్ట్ బహుశా నెహ్రూకు నచ్చిన కవి. ఆ సంకలనంలోని ఒక కవిత '... బట్ ఐ హ్యావ్ ప్రామిసెస్ టు కీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్' అనే భావోద్వేగమైన వాక్యాలతో ముగుస్తుంది. అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, మోదీకి నెహ్రూ 'మన ప్రియతమ' పూర్వపు ప్రధాని కాదని! ఆ సంగతిని ఆయన అనేక పర్యాయాలు స్పష్టం చేశారు. దీనిని బట్టి బైడెన్ నుంచి మోదీకి ఆ పుస్తకం కానుకగా అందడం వింతగా లేదూ?

మనసు వింతైనది. విచిత్రంగా పని చేస్తుంది. ఎక్కడి నుంచి ఎక్కడికో ఆలోచనల్ని కలుపుకొంటుంది. మరచిపోయిన జ్ఞాపకాలను రేపుకొంటుంది. అందులో తర్కం ఉండదు. అలా జరుగుతుందంతే. ఫలితం హాయినిగొల్పేది అయివుండొచ్చు, కలవర పరచేదీ కావచ్చు. గతవారం నాకు ఇలాగే జరిగింది. మీకెప్పుడైనా ఇలా అయిందా?

జో బైడెన్ దంపతులు మన ప్రధాన మంత్రికి ఇచ్చిన కానుకలలో 'కలెక్టెడ్ పొయెమ్స్ ఆఫ్ రాబర్ట్ ఫ్రాస్ట్' తొలి ముద్రణ ప్రతి కూడా ఒకటని చదివినప్పుడు నాకు ఇలా అవడం మొదలైంది. ఫ్రాస్ట్‌ని కానుకగా ఇవ్వడంలో అసాధారణత ఏమీ కనిపించలేదు. ఫ్రాస్ట్ బహుశా అమెరికా దేశపు అత్యంత ప్రసిద్ధుడైన కవి. నాలుగుసార్లు పులిట్జర్ అవార్డు పొందిన వ్యక్తి ఆయన ఒక్కరే. కనుక అమెరికా అధ్యక్షుడు ఒక భారతీయ ప్రధానికి ఫ్రాస్ట్ కవితల తొలి ముద్రణ ప్రతిని ఇవ్వడం సముచితమైన కానుకే అవుతుంది.

అయితే ఇక్కడొక చిక్కు ఉంది. లేదా నా ఉద్దేశంలో ఆక్షేపణ. ఫ్రాస్ట్ బహుశా జవహర్‌లాల్ నెహ్రూకు నచ్చిన కవి. మోదీకి బైడెన్ కానుకగా ఇచ్చిన ఈ కవితా సంకలనంలోని ఒక కవిత 'స్టాపింగ్ బై ఉడ్స్ ఆన్ ఎ స్నోవీ ఈవెనింగ్'. ఆ కవిత భావోద్వేగభరితమైన ఈ వాక్యాలతో ముగుస్తుంది: 'ది ఉడ్స్ ఆర్ లౌలీ, డార్క్ అండ్ డీప్, బట్ ఐ హ్యావ్ ప్రామిసెస్ టు కీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్.'

నెహ్రూ ఈ వాక్యాలలో లోతైన అర్థాన్ని చూశారు. వాటిని ఆయన ఉన్నవి ఉన్నట్లుగా చేత్తో తిరగ రాసుకుని ఆ కాగితాన్ని బల్లపైన ఉన్న గాజు పలక కింద... పైకి కనిపించేలా పెట్టుకున్నారని ఎవరి ద్వారానో నేను విన్నాను. మరికొందరు నెహ్రూ ఆ కాగితం ముక్కకు పటం కట్టించి బల్లపై ఉంచుకున్నారని అంటారు. నెహ్రూకు తను సేకరించిన అమూల్యమైన వస్తువులను తన పడక పక్కన అమర్చుకునే అలవాటు ఉందనీ, వాటిల్లో ఈ వాక్యాలు ప్రముఖ స్థానం పొందాయనీ కూడా కొందరు అంటారు. నిజం ఏదైనప్పటికీ అదొక కవిత. నెహ్రూకు ఎంతో అమూల్యమైనది.

అయితే ఇదేమీ కొత్త కథ కాదు. 50లు, 60లు, 70లలో పెరిగి పెద్దవాళ్లయిన అనేకమంది భారతీయులకు ఈ సంగతి తెలుసు.



బైడెన్‌తో మోదీ



నెహ్రూ

నెహ్రూ జీవిత చరిత్రను రాసినవారు ఈ విషయం గురించి కూడా రాశారు. నెహ్రూ చుట్టూ అల్లుకుని ఉన్న నమ్మకాలలో ఇదొక భాగం.

అటువంటిదే ఒక వాస్తవం... అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, మోదీకి నెహ్రూ 'మన ప్రియతమ' పూర్వపు ప్రధాని కాదని! ఆ సంగతిని ఆయన అనేకానేక పర్యాయాలు స్పష్టం చేశారు. దీనిని బట్టి బైడెన్ నుంచి మోదీకి ఆ పుస్తకం కానుకగా అందడం వింతగా అనిపించడం లేదూ?

బైడెన్‌కు ఈ సంగతి ఆయనకై ఆయనకు తెలియకపోవచ్చు. లేదా ఇదే పుస్తకాన్ని మోదీకి కానుకగా ఇవ్వాలన్న నిర్ణయం ఆయనది కాకపోనూవచ్చు. కానీ ఆయనకు ఎల్లవేళలా సలహాలు ఇచ్చేవారు ఉంటారన్నది మాత్రం నిస్సందేహం. వారు ఇండియా గురించి బాగా తెలిసినవారై, మరీ ముఖ్యంగా... మోదీని సంతోషపరిచే కానుకను జాగ్రత్తగా ఎంపిక చేయగలవారై ఉండొచ్చు. వారైతే నెహ్రూ–ఫ్రాస్ట్ లేదా మోదీ–నెహ్రూల మధ్య ఎలాంటి సంబంధం ఉన్నదో తెలియని వారంటే నమ్మడం కష్టం!

కనుక ఇది నిజంగా యాదృచ్ఛికమేనా, లేక ఇవ్వకనే ఇచ్చిన సూక్ష్మమైన సందేశమా అన్న ఆలోచన నా బుర్రను ఒక గమ్మత్తయిన, అనియంత్రిత దిశలోకి నడిపించింది. అదేమిటో తెలిసేలోపు నేను 1976లోకి వెళ్లిపోయాను. ఆ ఏడాది నేను నా 21వ జన్మదినాన్ని కేంబ్రిడ్జిలో... కొంచెం ఎక్కువ చేసి చెప్పుకోవాలంటే... మత్తుపానీయాల ఆతిథ్యంతో వేడుకగా జరుపుకొన్నాను.

ఆ సందర్భంగా... డఫ్నీ, ఆమె ప్రియ స్నేహితుడు హంఫ్రీ నాకు ఆకుపచ్చ, ఎరుపు చారల 'టై'ని కానుకగా ఇచ్చారు. అది నేను కట్టుకునే రకం టై వంటిది కాదు కాబట్టి సొరుగులో పెట్టి, దానిని నాకు ఎవరిచ్చారో కూడా మర్చిపోయాను. తర్వాత ఎనిమిది నెలలకు హంఫ్రీ పుట్టినరోజు వచ్చింది. అతడి కోసం డఫ్నీ ముందేమీ చెప్పకుండా ఒక్కసారిగా ఆశ్చర్యపరిచేలా బర్త్‌డే పార్టీని ఏర్పాటు చేసింది. నేనొక మతిమరుపు గల బుద్ధిహీనుడిని కనుక నా సొరుగులో కనిపించిన టైని హంఫ్రీకి ఇవ్వదగిన బహుమతి అని భావించాను. దానినొక ఖరీదైన కాగితంలో చుట్టి, దానికి సరిపోయే బర్త్‌డే కార్డును జతపరచి రయ్యిన పార్టీకి లంఘించాను.

నేనిచ్చిన కానుకను తెరచి చూడగానే హంఫ్రీ ముఖం ఎలా మారిపోయిందో నేను ఎప్పటికీ మర్చిపోలేను. విషయం అతడికి అర్థమైన క్షణం అది. తను ఇచ్చిన అదే టై తిరిగి తనకు కానుకగా వెళ్లింది! హంఫ్రీ పెద్దగా నవ్వాడు. నా ముఖం ఎర్రబడింది. "మనం ఏదైతే చేస్తామో తిరిగి అదే మనకు జరుగుతుందని నేను ఊహించగలను" అని మాత్రం అన్నాడు హంఫ్రీ గొప్ప దయతో.

బైడెన్ పుస్తకానికీ, నా టైకీ మధ్య మీకేదైనా ప్రత్యక్ష, లేదంటే పరోక్ష సంబంధం కనిపిస్తోందా? రెండింటినీ మీరు అనుచితమైన కానుకలుగా పిలవొచ్చు, లేదంటే తగని ఎంపికలు అనవచ్చు. కానీ బైడెన్ అసంకల్ప కానుక... నేను ఇబ్బంది పడ్డంతగా... ఆయన్ని ఏ విధం గానూ ఇబ్బంది పెట్టేదైతే కాదు. హంఫ్రీకి నాపై మనసులో ఏమీ లేదు. డఫ్నీతో అతడు విడిపోయినా, మేమిద్దరం ఇప్పటికీ స్నేహితులుగానే ఉన్నాం. నన్నెప్పుడైనా అతడు టైతో చూస్తే, 'ఆ' టైని గుర్తు చేయడం మాత్రం మర్చిపోడు.

బైడెన్ తనకు ఆ పుస్తకాన్ని కానుకగా ఇవ్వడం గురించి నరేంద్ర మోదీ ఏం ఆలోచిస్తున్నారో తెలుసుకోవాలని నాకు మహా ఆరాటంగా ఉంది. నేను అనుకోవడం... అమెరికా అధ్యక్షుడి అప్రమేయ కానుక మోదీకి ముసిముసి నవ్వులు తెప్పిస్తుందని. మోదీ ఎప్పుడైనా తన జ్ఞాపకాలను పుస్తకంగా రాస్తే అందులో ఈ చిన్న కథ కోసం ఎదురు చూడవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తప్పు మీదే!



టొమాటోల ధరలు ఎలా తగ్గించాలో ప్రజల నుంచి సలహాలు కోరుతుంది ప్రభుత్వం. తర్వాత టొమాటోల ధరలు తగ్గించడంలో ప్రజలు విఫలమయ్యారని ప్రకటిస్తుంది.

– ఉర్వీశ్ కొఠారీ, వ్యంగ్య రచయిత

కొత్త క్రమం



బహుళ సంస్కృతి అనేది కలుపుకొని పోవడానికి సంబంధించినది అయి వుండాలి; కానీ 'పొలిటికల్ కరెక్ట్‌నెస్' ద్వారా సమర్థన అందుకుంటూ అది అరాచకత్వానికి లైసెన్సుగా మారిపోయింది. నూతన ప్రపంచ క్రమానికి(న్యూ వరల్డ్ ఆర్డర్) స్వాగతం!

– సుశాంత్ సరీన్, ఫెలో

ఉపవాస శక్తి



మధ్యంతర ఉపవాసాలు పాటించడం వల్ల ఎంత బాగుందో, దానివల్ల ఎలా శక్తి పెరిగిందో, ఎలా బరువు తగ్గిందో, ఇలా చేయడానికి నేను వాళ్లకు ఎలా ప్రేరణ ఇచ్చానో అని నేను ఎక్కడికి వెళ్లినా జనాలు ఒకటే చెబుతున్నారు. ఇప్పటికీ ప్రయత్నించకపోతే ఉపవాసాలు చేయండి. అవి పనిచేస్తాయి. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి ఉపవాసం శక్తిమంతమైన సాధనం.

– అహ్మద్ మాలిక్, సర్జన్

తగని సలహా



'పట్టించుకోకండి' అంటారు! ఎలా పట్టించుకోకుండా ఉంటాం? ఏదైనా అసాధారణ సంఘటన జరిగినప్పుడు, అసహనానికి లోను చేసే అనుభవం ఎదురైనప్పుడు ప్రతిస్పందించడం మానవ స్వభావమే కదా.

– ప్రాప్తి, ట్విటిజెన్

పుస్తకమే కావాలి



చాలామంది పేజీలు (వైద్యులు) పాఠ్యపుస్తకాలను ఐప్యాడ్ మీద చదవడం చూస్తుంటాను. నాకైతే ఎలక్ట్రానిక్ డివైసుల మీద కొన్ని పేజీలు చదవడం కూడా కష్టంగా ఉంటుంది. నావరకూ పుస్తకాలకు ప్రత్యామ్నాయం లేదు. ఇది తరాల అంతరమా లేక కేవలం వ్యక్తిగత అభిరుచా?

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

ఒక్కటి చాలు...



ఒక అంశం మీద ఉద్వేగాన్ని పెట్టుబడిగా పెట్టడం అనేది ఒకరి ఎంపిక, అంతేగానీ అది నిర్బంధం కాదు. కొందరు మణిపూర్ మీద పెడితే, ఇంకొందరు ఫ్రాన్స్ మీద పెడుతున్నారు. ఉన్న ప్రతి అంశాన్నీ లేవనెత్తగలిగే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ అది ఆచరణీయం కాదు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

విధ్వంసం వెనుక...



ఒకరి చరిత్రనూ, సంస్కృతి, నాగరికతల సారాన్నీ తుడిచి పెట్టడానికీ ; వారిమీద ఆధిక్యతను స్థాపించడం ద్వారా కొత్త కథనాన్ని నెలకొల్పడానికీ– జ్ఞానాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయడం అనేది చరిత్ర పొడవునా స్థిరంగా ఉపయోగిస్తూ వచ్చిన ప్రాథమిక ఎత్తుగడ. (ఫ్రాన్స్‌లోని మార్సెల్ గ్రంథాలయ దహనం నేపథ్యంలో.)

– జెబా జోరియా, కామెంటేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మణిపూర్ మంటలు ఆరేదెన్నడు?

సందర్భం



సి. రామచంద్రయ్య

ప్రకృతి అందాలకు ఆలవాలమైన మణిపూర్ దాదాపు 2 నెలలుగా అగ్నికీలల్లో దహించుకుపోతోంది. తాము చేయని తప్పుకు అమాయకులు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అన్నదమ్ముల్లా, అక్క చెల్లెళ్లుగా కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషం రగిలింది. 4,000లకు పైగా గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వేలాది మంది కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలు వెతుక్కుంటూ పారిపోతున్నారు. అక్కడ ఉన్నది ప్రజా ప్రభుత్వమే. పోలీసులు పహారా కాస్తున్నారు. కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. అయినా హింస ఆగడం లేదు.

ఒకపక్క మణిపూర్ మండిపోతుండగానే, ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన జరిగింది. రక్షణరంగంలో కీలక ఒప్పందాలు కుదిరాయి. ప్రముఖ దిగ్గజ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తాను నరేంద్ర మోదీకి అభిమానినని చాటుకొన్నాడు. తన 'టెస్లా' భారత్‌లో రంగ ప్రవేశం చేస్తుందని చెప్పాడు. ఇదంతా చూసినపుడు, 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' అనే సామెత గుర్తు రాక మానదు. మణిపూర్ సమస్యకు పరిష్కారం చూప కుండానే ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు చేస్తూ భారతదేశం గొప్పతనాన్ని గురించి చాటిచెప్పడం ఎబ్బెట్టు గానే ఉంది.

భౌగోళికంగా మణిపూర్‌కు అనేక ప్రతికూలతలు ఉన్నాయి. మణిపూర్‌కు సరిహద్దుగా ఉన్న మయన్మార్ నుంచి పెద్దఎత్తున గిరిజన అక్రమ వలసదారులు చొచ్చుకొనివచ్చి ఎప్పటికప్పుడు ఘర్షణలకు కారణం అవుతున్నారు. వారికి చైనా దన్నుగా నిలుస్తోంది. అయితే, ఇప్పుడు మణిపూర్‌ది మాత్రం పూర్తిగా స్థానిక సమస్యే!

మణిపూర్‌లో ఉన్న ప్రధాన తెగలైన మైతేయ్‌లు, కుకీలు, నాగాల మధ్య చాలా కాలంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మైతేయ్ తెగను ఎస్టీల్లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫార్సు చేయాలని మణిపూర్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడకుండా వెంటనే సుప్రీం కోర్టుకు నివేదించి ఉన్నట్లయితే పరిస్థితి దిగజారేది కాదు. దాంతో మైతేయ్ తెగకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ చిత్తశుద్ధి మీద కుకీలకు, ఇతర గిరిజన తెగలకు అపనమ్మకం ఏర్పడింది.

సామాజికంగా, రాజకీయంగా శక్తి సంపన్నులైన మైతేయ్‌లు గనుక ఎస్టీ జాబితాలో వచ్చి చేరితే తమ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతుందని, తాము ఇంత కాలం సాగు చేసుకొంటున్న భూములను వారు హస్తగతం చేసుకొంటారనీ భయం వారిలో ఏర్పడింది. అలాగే రిజర్వేషన్లు, ఇతర రాయితీలను వారితో కలిసి పంచుకోవలసి వస్తుందనే ఆగ్రహమూ వారిలో ఏర్పడింది. దానికి తోడు, కొండ ప్రాంతాల్లోని రక్షిత అటవీస్థలాల్లో నివసిస్తున్న వారిని బయటకి తరలించేందుకు బీజేపీ నేతృత్వంలోని బీరేంద్రసింగ్ ప్రభుత్వం తీసుకొన్న బలవంతపు చర్యలు గిరిజనుల్లో అభద్రతాభావం నింపాయి. దాంతో, నిరసనల స్థాయి నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు క్రమంగా ఆందోళనలుగా, ఉద్యమాలుగా, హింసాత్మక ఘటనలుగా రూపు దిద్దుకొన్నాయి.

కొండ ప్రాంతాలలో కుకీ, నాగా తెగలవారు గంజాయి సాగు చేస్తున్నారనే సాకుతో వారిని అక్కడి నుంచి బలవంతంగా ఖాళీ చేయించాలని ప్రభుత్వం ప్రయత్నించడంతో.. అది కుకీల అస్తిత్వ సమస్యగా మారింది. కొత్తగా పలు ప్రాంతాలను అభయారణ్యాలుగా, రక్షిత అటవీ ప్రాంతాలుగా ప్రకటించి అక్కడి అటవీ ఫలసాయం పొందకుండా గిరిజన తెగలను అడ్డుకోవడం కక్షసాధింపు చర్యగా వారు భావించారు. రాష్ట్ర భూభాగంలో 90 శాతం కొండ ప్రాంతాలతో నిండి ఉంది. అనాదిగా తమ జీవనానికి కొండల్నే ఉపాధి కేంద్రాలుగా మార్చుకొన్న గిరిజన తెగలను కొండల్నుంచి ఖాళీ చేయిస్తామంటే ఎలా? స్థానికంగా ఉండే చెట్టు, పుట్ట, నదీ నదాలు అన్నీ గిరిజన ఆచార సంప్రదాయాలతో ముడి వడి ఉంటాయి. మరి వారిని వాటి నుంచి ఎలా దూరం చేస్తారు?



నిజానికి, భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ తెగల జాబితాలోకి ఒక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా ఆ అధికారం ఒక్క రాష్ట్రపతికి మాత్రమే ఉంది తప్ప ఏ కోర్టుకూ, ఏ ప్రభుత్వానికీ లేదు. చివరకు పార్లమెంట్‌కు కూడా! గిరిజన తెగలు అన్నింటికీ రాజ్యాంగ రక్షణ ఉందన్న భరోసా ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించి అన్ని వర్గాలతో చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరించాలని చేసిన కృషి ఎక్కువ రోజులు నిలవలేదు. అక్కడ హింసను కేవలం శాంతి భద్రతల సమస్యగానే పరిగణిస్తే ఒనగూడే ఫలితాలు దీర్ఘకాలంపాటు ఉండవు.

అక్కడ ఎవరైతే తమ అస్తిత్వం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారో.. వారు ఈ దేశంలో భాగమేననీ, పరాయివారు కాదనీ వారిలో నమ్మకం కలిగించే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. హింసను అరికట్టడంలో విఫలమైన బీరెన్ సింగ్‌ను సీఎం పదవి నుంచి తప్పించి వేరొకర్ని ఆ స్థానంలో నియమించాల్సింది. కానీ, బీజేపీ అధిష్ఠానం ఆ దిశగా ఆలోచించడం లేదు.

జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని 2 కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడానికి అక్కడి ప్రజల స్థానికత, అస్తిత్వం అంశాలే దోహదం చేసిన విషయాన్ని ఎన్డీఏ మర్చిపోతే ఎలా? 'కశ్మీర్ ఫైల్స్' వంటి చలన చిత్రాలలో స్థానికంగా ఉండే పండిట్లు ఎందుకు తమ స్వస్థలాలను వీడి ఇతర ప్రాంతాలకు తరలిపోయారో చూపించారు. పండిట్లు తిరిగి తమ స్వస్థలాలకు తిరిగిరావాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

బీజేపీ అనుసరిస్తున్న ద్వంద్వ విధానానికి ఇదొక మచ్చుతునక. మణిపూర్‌లోని కుకీలు, ఇతర గిరిజన తెగలవారు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని తమ ప్రాంతాన్ని, భాషను, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని అందుకు ప్రాణత్యాగాలకైనా సిద్ధపడాలని చూస్తున్నారు. సమస్య పరిష్కరించాలంటే దాని మూలాల్లోకి వెళ్లాలి. అంతేకాదు, రాజకీయంగా లాభనష్టాల గురించి ఆలోచించకుండా చిత్తశుద్ధితో ప్రజల మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చాలి. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు మణిపూర్‌పై నోరు విప్పలేదు. ఇంకా ఆలస్యం చేస్తే అక్కడ పరిస్థితులు మరింత దిగజారతాయి.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

అణోరణీయాన్

'అణీయాన్' అంటే అణువులా అతి చిన్నదైనది. 'అణోరణీయాన్' అంటే అణువుల లాంటి చిన్నవాటికంటే కూడా అతి చిన్నది. 'మహీయాన్' అంటే పెద్దది. 'మహతో ర్మహీయాన్' అంటే మహత్తరమైన ఈ పృథ్వీ, ఈ బ్రహ్మాండం లాంటి పెద్దవాటి కంటే కూడా పెద్దది. అణోరణీయాన్, మహతోర్మహీయాన్ /ఆత్మా–అస్య జన్తోః నిహితః గుహా యామ్ – ఆత్మ అనేది అణువులలో అణువు, మహత్తులలో మహత్తు. అతి చిన్నవాటికంటే చిన్నది, అతి పెద్దవాటికంటే పెద్దది. అది ప్రాణి (హృదయ) గుహలో నిక్షిప్తమై ఉంటుంది, అని కఠోపనిషత్తు చెబుతుంది.

ఆ ఆత్మ పిపీలికాది బ్రహ్మ పర్యంతం సర్వ ప్రాణులలోనూ నిహితమై, అధిష్ఠానమై ఉంటుంది అనేందుకు గుర్తు, ఆ ప్రాణులకు దర్శన, శ్రవణ, మననాది జ్ఞానం ఉండటమే. ఆత్మ అనేది భౌతిక ఇంద్రియాలకూ, ప్రమాణాలకూ, కొలమానాలకూ సాక్షాత్కరించేది కాదు. అది అశాశ్వతమైన శరీరంలో ఉండే శాశ్వత తత్త్వం. శరీరం నుంచి అది నిష్క్రమిస్తే శరీరం చైతన్యరహితమైన కళేబరం అయిపోతుంది.



జ్యోతిర్మయం

ప్రాణిని చైతన్యవంతం చేసే ఈ ఆత్మకు జననమూ లేదు, మృత్యువూ లేదు. జ్ఞానమే దాని స్వరూపం. న జాయతే, మ్రియతే వా, విపశ్చిత్. అది శాశ్వతం, లేక నిత్యం లేక సనాతనం. దాన్ని 'అక్రతువు' అయిన వాడే చూడగలడు. తం అక్రతుః పశ్యతి, వీత శోకః, ధాతు ప్రసాదాత్, మహిమానం ఆత్మనః. 'అక్రతువు' అంటే ప్రాపంచికమైన కోరికలు లేని నిష్కాముడు. కనిపించే, వినిపించే ప్రాపంచిక విషయాల నుంచి బుద్ధిని మరలించుకోగలిగిన ఘనుడు. ఇంద్రియాల నిగ్రహం లేక 'ప్రశమనం' (లేక 'ప్రసాదం' వల్ల) అతగాడు తనలో ఉన్న ఆత్మ గొప్పతనాన్ని (శాశ్వ తత్త్వం, సర్వవ్యాపిత్వం, ఇత్యాది గొప్పతనాలను) సాక్షాత్కరింప జేసుకోగలడు. ఆత్మ అనేది కేవలం వేద శాస్త్ర అధ్యయనం వల్ల, మేధాశక్తి వల్ల, వేదాంత ఉపదేశాల బహు శ్రవణం వల్ల లభ్యమయ్యేది కాదు. ఆత్మ సాక్షాత్కార కాంక్ష తప్ప మరే కోరికా లేనివాడికి మాత్రమే ఆత్మ సాక్షాత్కారమౌతుంది. కోరికలతో నిండిన వారికి ఆత్మదుర్ జ్ఞేయం. పట్టుబడదు.

అంత దుర్ జ్ఞేయమయిన దాన్ని తెలుసుకోకపోతే నష్టమేమిటి? తెలుసుకొంటే లాభమేమిటి? తెలుసుకొన్నవాడు 'వీత శోకు'డౌతాడు. అన్ని సాంసారిక దుఃఖాలను అధిగమించి, దుఃఖ స్పర్శ లేని బ్రహ్మానంద స్థితిని అనుభవిస్తాడు అని ఉపనిషత్తు బోధిస్తున్నది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, వైశాఖ మాసం, **తిథి:** పౌర్ణమి సా 5.29 వరకు, తదుపరి పాడ్యమి, **నక్షత్రం:** మూల ఉ.11.38 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.07 నుండి 11.38 తిరిగి, రా. 8.43 నుండి 10.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** తె.5.49 నుండి 7.20 వరకు (తెల్లవారితే మంగళవారం), గురుపౌర్ణమి, వ్యాసపౌర్ణమి ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.35.

నెల్లూరు జాతి ఆవు@ రూ. 35 కోట్లు!

- బ్రెజిల్‌లో జరిగిన వేలంలో ప్రపంచ రికార్డు ధర



ఎక్కడైనా మేలు జాతి ఆవు ధర ఎంత ఉంటుంది? మహా అయితే రూ. లక్షల్లో ఉంటుందంటారా.. అయితే మీరు తప్పులో కాలేసినట్లే.. ఎందుకంటే బ్రెజిల్‌లో ఇటీవల జరిగిన వేలంలో నెల్లూరు జాతికి (ఏపీలోని నెల్లూరు జిల్లా నుంచి దశాబ్దాల కిందట కొన్ని ఆవులను బ్రెజిల్ తీసుకెళ్లి జన్యు లక్షణాలను మరింత అభివృద్ధి చేసుకున్న ఆవులు) చెందిన తెల్ల ఆవు కనీవినీ ఎరుగని అత్యధిక ధర పలికింది. తద్వారా ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన ఆవుగా నిలిచింది. వియాటినా–19 ఎఫ్4 మారా ఇమ్‌విస్ అనే నాలుగున్నరేళ్ల ఆవు మూడో వంతు యాజమాన్య హక్కు ఏకంగా రూ. 11.82 కోట్లకు అమ్ముడుపోయింది!! గతేడాది ఈ ఆవు సగం యాజమాన్య హక్కు రూ. 6.5 కోట్లు పలకడం అప్పట్లోనే రికార్డు సృష్టించగా ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. మొత్తంమీద ఈ ఆవు విలువ రూ. 35.30 కోట్లు పలికింది. అత్యంత నాణ్యమైన జన్యులక్షణాలు గల బ్రెజిల్‌లోని నెల్లూరు జాతి ఆవును రికార్డు ధరకు సొంతం చేసుకొనేందుకు డెయిరీ వ్యాపారులు పోటీపడటం దీని అసలుసిసలు విలువను చాటిచెబుతోంది.

బ్రెజిల్‌లోని ముఖ్యమైన ఆవు జాతుల్లో నెల్లూరు జాతి ఆవులు కూడా ఒకటి. వీటిని ఎక్కువగా మాంసం కోసం పెంచుతారు. వీటి మాంసంలో కొవ్వు తక్కువగా ఉండటం వల్ల చాలా దేశాల్లో ఈ ఆవుల మాంసానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రస్తుతం బ్రెజిల్‌లో 16.70 కోట్ల నెల్లూరు జాతి ఆవులు ఉన్నాయి. బ్రెజిల్‌లో ఉన్న మొత్తం ఆవుల సంఖ్యలో ఇవి 80 శాతం కావడం విశేషం. ఈ జాతికి చెందిన శ్రేష్టమైన ఎద్దుల వీర్యం సైతం అర మిల్లీలీటర్‌కు రూ. 4 లక్షలు పలుకుతోంది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

నెల్లూరు జాతి ఆవుల ప్రత్యేకతలు ఇవీ...

- ఈ ఆవులు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకొనేలా చిక్కటి తెలుపు రంగులో ఉంటాయి.
- దళసరి చర్మంతో ఉండటం వల్ల రక్తం పీల్చే కీటకాలు వాటిని దరిచేరవు.
- ఓక్లహోమా స్టేట్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం వాటి స్వేద గ్రంథులు యూరోపియన్ జాతి ఆవులతో పోలిస్తే రెండు రెట్లు పెద్దగా ఉండటంతోపాటు గ్రంథుల సంఖ్య సైతం 30 శాతం ఎక్కువగా ఉంటుంది.
- రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటంతో ఇన్ఫెక్షన్లను సమర్థంగా తట్టుకోగలవు.
- సమర్థమైన జీవక్రియ కారణంగా నాసిరకం గడ్డి జాతుల రకాలను సైతం తిని అరిగించుకోగలవు.
- ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఈనగలగడం, సరైన యాజమాన్య పద్ధతులు పాటించనప్పటికీ దూడలు సులువుగా పెరగగలగడం మరో ప్రత్యేకత.

మొక్కలంటే వ్యసనం

ఓ ప్రకృతి ప్రేమికుడి కథ

- వ్యసనాలకు బానిసై.. జీవితంపై విరక్తి
- వనజీవి రామయ్య స్ఫూర్తితో మొక్కల పెంపకంపై దృష్టి
- పదేళ్లుగా ప్రకృతితో మమేకం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన హరినాథ్ గత పదేళ్లుగా మొక్కల పెంపకమే లోకంగా బతుకుతున్నాడు. ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లి రోడ్లు, అడవులవెంట తిరుగుతూ విత్తనాలు చల్లడమే ఆయన పని. ఆరు పదుల వయసులో అలుపెరగకుండా అడవుల పెంపకమే లక్ష్యంగా శ్రమిస్తున్న ఆయన ఈ పనికి దిగడం వెనుక ఆసక్తికరమైన కథ దాగుంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

హరినాథ్ తల్లిదండ్రులు కష్టపడటంతో పాల్వంచ సమీపాన జగన్నాథపురంలో ఆ కుటుంబానికి 1970వ దశకంలో 50 ఎకరాలకు పైగా భూమి సొంతమైంది. చదువు కోసం పాల్వంచలోని కేటీపీఎస్ స్కూల్‌కు రోజూ నడిచి వెళ్లే హరినాథ్ ఆకాశం కనిపించకుండా పెరిగిన చెట్లు, వాటి మధ్యన తిరిగే పక్షులు, పాములు, వన్యప్రాణులను చూస్తుండేవాడు. అయితే హరినాథ్ ఎస్సెస్సీ, ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలోకి అడుగుపెట్టగానే విలాసాలు దరిచేరాయి. చదువు పూర్తయి కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)లో ఉద్యోగిగా పనిచేసిన ఆయన జూదం, తాగుడులాంటి వ్యసనాల్లో చిక్కుకుపోయారు. యాభై ఏళ్లు దాటినా బయటపడలేకపోయారు. దీంతో భూమి హరించుకుపోగా రూ.30 లక్షల అప్పు మిగిలింది.

వనజీవి రామయ్య స్ఫూర్తితో..

కేటీపీఎస్ ఉద్యోగిగా కెరీర్ చివరి దశలో ఉన్నప్పుడు 2013లో విలాసాలు, వ్యసనాలపై వైరాగ్యం ఏర్పడింది. దీంతో ఏం చేయాలో తెలియని స్థితికి చేరుకోగా టీవీలో పద్మశ్రీ వనజీవి రామయ్య జీవితంపై వచ్చిన కథనం హరినాథ్‌ను ఆకట్టుకుంది. దట్టమైన అడవి మీదుగా స్కూల్‌కు వెళ్లిన రోజులు గుర్తుకురాగా.. ప్రస్తుతం పాల్వంచ – కొత్తగూడెం పరిసర ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్‌గా మారడం కళ్లెదుట కనిపించింది. దీంతో వనజీవి మార్గంలో నడవాలనే నిర్ణయానికి రాగా, కొత్తగూడెంకు చెందిన మొక్కల వెంకటయ్య తదితరులు పరిచయమయ్యారు. అలా పదేళ్లుగా పాల్వంచ – కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంపే లక్ష్యంగా హరినాథ్ గడుపుతున్నాడు.

మొక్కల పెంపకమే లక్ష్యంగా...

ఏటా మార్చి నుంచి జూన్ వరకు 40 రకాల చెట్ల విత్తనాలను సేకరిస్తాడు. ఆ విత్తనాలను జూన్ నుంచి సెప్టెంబర్ వరకు అడవుల్లో చల్లుతాడు. పాల్వంచ, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, సుజాతనగర్ మండలాల పరిధి రోడ్లు, అడవులు, కార్యాలయాలు.. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఔషధాలు, పండ్లు, నీడనిచ్చే నలభై రకాల మొక్కల విత్తనాలు చల్లుతున్నాడు. పండ్లను కోతులు, పక్షులు తింటున్నప్పుడు కలిగే సంతోషం తనకు జీవితంలో ఎప్పుడూ కలగలేదని హరినాథ్ చెబుతుంటాడు. 2016లో ఉద్యోగ విరమణ చేశాక వచ్చే పెన్షన్ నుంచే మొక్కల పెంపకానికి ఖర్చు భరిస్తున్నాడు. పదేళ్ల క్రితం హరినాథ్ మొలుపెట్టిన పయనానికి ఇప్పుడు మరో ఇరవై మంది సాయంగా ఉంటున్నారు. మరో ఏడు జిల్లాల నుంచి వనప్రేమికులు విత్తనాలు తీసుకెళ్తుంటారు.



అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లుతున్న హరినాథ్

మొక్కలపై అవగాహన పెంచండి

"పదేళ్లుగా లక్షలకొద్దీ విత్తనాలు చల్లుతున్నాను. పశువుల కాపర్ల అత్యుత్సాహంతో చెట్లు చనిపోతున్నాయి. మొక్కల సంరక్షణపై పశువుల కాపర్లకు అవగాహన కల్పిస్తే మంచిది. నాకు ముగ్గురు ఆడపిల్లలు. నేను వ్యసనాల్లో మునిగిపోయినప్పుడు వాళ్ల బాగోగులు మా ఆవిడే చూసుకుంది. వ్యసనాల నుంచి బయటకు వచ్చాక ప్రకృతి రక్షణ, అడవుల పెంపకంపై ధ్యాస పెట్టా. నా సహకారం లేకున్నా ముగ్గురు పిల్లలు చదువు పూర్తి చేసి అమెరికాలో స్థిరపడ్డారు. ఇది ప్రకృతి నాకు తిరిగి ఇచ్చిన బహుమతిగా భావిస్తున్నా.

–హరినాథ్



విత్తనాల బస్తాలతో వెళ్తున్న హరినాథ్

ఆ స్థలాలకు మీరే యజమానులు

- జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్
- పేట్‌బషీరాబాద్ స్థలాన్ని సొసైటీకి ఇవ్వాల్సిందే: సీనియర్ అడ్వొకేట్ రామచందర్‌రావు



ఆదివారం సుందరయ్య పార్కు వద్ద టీమ్ జేఎన్‌జే ఆధ్వర్యంలో సభ్యుల ర్యాలీ. సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిజాంపేట్, పేట్‌బషీరాబాద్‌లోని 70 ఎకరాల భూమి జేఎన్‌జే సొసైటీకే చెందుతుందని, ఆ భూమి కోసం సభ్యులందరూ డబ్బులు చెల్లించినందున దానికి జేఎన్‌జే సొసైటీ సభ్యులే యజమానులని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌ స్పష్టం చేశారు. ఆదివారం టీమ్ జేఎన్‌జే ఆధ్వర్యంలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ ఎన్. రామచందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జేఎన్‌జే సొసైటీ సభ్యులకు మాత్రమే ఈ స్థలాలు చెందుతాయని స్పష్టంచేశారు. ఆ భూమిని జేఎన్‌జే సొసైటీకి అప్పగించాల్సిందేనని చెప్పారు. అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ప్రకారం రూ.12.33 కోట్లు చెల్లించి సొసైటీ సభ్యులు భూమిని కొనుగోలు చేసినందున, స్వాధీనం చేసుకునే హక్కు ఉందని ఆయన వివరించారు. ఒకవేళ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయని పక్షంలో.. ఈ అంశంపై మళ్లీ సుప్రీంకోర్టు తలుపు తట్ట వచ్చని ఆయన స్పష్టం చేశారు. అడ్వొకేట్ రామచందర్‌రావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలాలను జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి అప్పగించాలని అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని వెంటనే సొసైటీకి స్వాధీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో తాను సొసైటీ సభ్యులకు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. జేఎన్‌జే సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు పీవీ రమణారావు మాట్లాడుతూ.. స్థలాల సాధనకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం సభ్యులు సుందరయ్య పార్కు వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు.

సింగరేణి కార్మికులకు | 11వ వేజ్‌బోర్డ్ వేతనాలు నేడు

- కేటగిరీ –1 కార్మికులకు రోజుకు రూ.1502.66
- పదో వేజ్‌బోర్డులో రూ.1011.27 మాత్రమే..
- అందనున్న 23 నెలల బకాయిలు



సింగరేణి (కొత్తగూడెం)/గోదావరిఖని: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ ప్రకారం కొత్త వేతనాలను సంస్థ సోమవారం చెల్లించనుంది. కోల్ ఇండియా పరిధిలోని సింగరేణితో పాటు మరో 8 బొగ్గు పరిశ్రమలకు చెందిన సుమారు 3.50 లక్షల మంది కార్మికులకు జూలై నుంచి కొత్త వేతనాలు అందించేందుకు సర్క్యులర్ విడుదల చేసింది. 10వ వేజ్‌బోర్డ్‌లో 1వ కేట గిరీ నుంచి ఏ1 గ్రేడ్ కార్మికులు, సూపర్‌వైజర్లు కలిపి సుమారు 42వేల మంది పనిచేస్తున్నా రు. వీరికి జూన్ వరకు నెలకు రూ.320 కోట్లు వేతనాల రూపంలో చెల్లించగా, 11వ వేతన సవరణలో అదనంగా రూ.70 కోట్ల మేర పెరి గాయి. గతంలో కేటగిరీ–1 కార్మికులకు రోజు కు రూ.1011.27 చెల్లించగా, ఇప్పుడు రూ.1502.66 చెల్లిస్తారు. ఏ1 గ్రేడ్, సూపర్ వైజర్లకు వేతనం గతంలో రూ.47,802.52 ఉండగా, 11వ వేజ్‌బోర్డు అమలుతో రూ.71, 030.56కు పెరిగింది. ఇంకా వీటికి అలవెన్స్‌లు అదనంగా లభిస్తాయి.

కేటగిరీల వారీగా వేతనాల పెంపు ఇలా..(రూ.లలో)

కేటగిరీ	10వ వేజ్‌బోర్డ్	11వ వేజ్‌బోర్డ్
1	27,894	41,449
2	30,235	44,927
3	30,776	45,715
4	31,296	46,504
5	31,827	47,292
6	32,357	48,080
సూపర్‌వైజర్లు	1,00,785	1,49,758

బకాయి వేతనాలు విడుదల..

10వ వేజ్‌బోర్డ్ కాల పరిమితి 2021 జూన్ 30 తో ముగిసింది. అంటే 2021 జూలై 1 నుంచి 11వ వేజ్‌బోర్డు అమలు కానుంది. ఈ నేపథ్యంలో 23 నెలల బకాయిలు కూడా కార్మికుల ఖాతాల్లో జమ కానున్నాయి. 11వ వేజ్‌బోర్డ్‌లో 19 శాతం మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్ (ఎంజీ బీ) జీతం పెరుగుదలతోపాటు 25 శాతం అల వెన్స్‌లు కలిపి ఒకొక్క కార్మికుడికి వారి వేతన స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బకాయిలు అందే అవకాశం ఉంది.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, ఎంపీ సంజీవ్‌కుమార్, ఉడిపికి చెందిన శిరూర్ మఠం వేద వర్ధనతీర్థ స్వామీజీ తదితరులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 82,999 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.27 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్

అరుణాచలం యాత్రకు పోటెత్తిన భక్తులు

- తొలుత 2 ఆర్టీసీ బస్సులు.. ● ఊహించని డిమాండ్‌తో 34 బస్సులకు పెంపు ● చివరకు బస్సుల్లేక రిజర్వేషన్ నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: ఆదాయం కోసం ప్రత్యేక సందర్భాల్లో దూర ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాలకు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ చేసిన తొలి ప్రయోగం విజయవంతమైంది. భక్తులు పోటెత్తడంతో.. చివరకు చాలినన్ని బస్సుల్లేక రిజర్వేషన్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. తొలిసారి ఆర్టీసీ తమిళనాడులోని అరుణాచలానికి బస్సులు నడిపింది. గురు పూర్ణిమ సందర్భంగా అరుణాచల క్షేత్రంలో గిరిప్రదక్షిణలు చేయటం పరిపాటి. దీంతో అరుణాచలానికి ప్రయోగాత్మకంగా బస్సులు నడపాలని భావించి వారం రోజుల క్రితం రెండు బస్సులను కేటాయించి రిజర్వేషన్ జాబితాలో ఉంచింది. కానీ కొన్ని గంటల్లోనే అవి నిండిపోయాయి. దీంతో మరో రెండు బస్సులను కేటాయించింది. అదేరోజు వాటి సీట్లు కూడా నిండిపోయాయి. దీంతో కొన్ని సూపర్ లగ్జరీ బస్సుల ట్రిప్పులు క్యాన్సిల్ చేసి వాటిని కూడా రిజర్వేషన్‌లో ఉంచింది. అలా చూస్తుండగానే 34 బస్సులు ఫుల్ అయ్యాయి. ఇంకా డిమాండ్ పెరిగి జనం టికెట్ల కోసం పోటెత్తారు. దీంతో బస్సుల్లేక రిజర్వేషన్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. గురుపూర్ణిమ కోసం శనివారం రాత్రి నుంచి దశలవారీగా ఆర్టీసీ బస్సులు అరుణాచలం బయలుదేరాయి. ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.3200 టికెట్ ధరగా ఆర్టీసీ నిర్ణయించింది. అరుణాచలంతోపాటు కాణిపాకం, స్వర్ణదేవాలయం దర్శనం అనంతరం బస్సులు తిరుగుపయనమవుతాయి. తాజా అనుభవంతో భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని యాత్రలకు బస్సులు కేటాయిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

యాదాద్రి స్వర్ణ తాపడానికి రూ.55,03,980 విరాళం



స్వామి దివ్య విమాన గోపురానికి బంగారం తాపడం కోసం బంగారం, నగదుని ఆలయ అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ దివ్య విమాన గోపురం స్వర్ణ తాపడానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ రూ.55,03,980 విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే హనుమంతరావుతో కలిసి విరాళం మొత్తాన్ని ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మకు అందజేశారు. అంతకు ముందు గర్భాలయంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే వివేకానంద అనుచరులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి రావడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. బ్రేక్ దర్శనం సమయం ముగిసినా ఆలయ అధికారులు వీఐపీలకు బ్రేక్ దర్శనం టికెట్లు ఇవ్వడంతో సామాన్య భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. హుండీ వద్ద తోపులాట జరగడంతో ఓ భక్తురాలు కిందపడిపోయింది.

మద్యం మత్తులో స్నేహితుణ్ని చంపేశారు

హైదరాబాద్: మద్యం మత్తులో స్నేహితుడిని చంపిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దశరథ్ చెప్పిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన మహ్మద్ ఆకీల్ (25) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. బక్రీద్ సందర్భంగా అకీల్ న్యూ హాఫీజ్‌పేట్ ప్రేమ్ నగర్‌కు వచ్చి తన పాత స్నేహితులు షేక్ ఆసిఫ్ (22), మహ్మద్ అబ్బాస్ (23), సమీర్‌ఖాన్(22), షేక్ అమీద్ (25), అస్లాంఖాన్ (20), మహ్మద్ ఫరుసుద్దీన్ (22)లతో కలిసి శనివారం రాత్రి మద్యం తాగారు. ఈ క్రమంలో గొడవ జరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. కోపోద్రిక్తులైన ఆరుగురు స్నేహితులు కలిసి అకీల్ కడుపులో చాకుతో పొడిచి, సుత్తె, బండరాయితో తలపై మోది హత్య చేసి పరారయ్యారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం



దుర్గమ్మకు తెలంగాణ నుంచి బంగారు బోనం తీసుకొస్తున్న దృశ్యం. చిత్రంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. అమ్మవారికి బంగారు బోనంతో పాటు 11 రకాల బోనాలు, పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రి సమర్పించారు. బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ పాల్గొన్నారు. తీన్‌మార్ డప్పులు, కోలాట నృత్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య ఇంద్రకీలాద్రికి చేరిన ఊరేగింపునకు చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ, ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులకు బంగారు బోనం అందచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి బంగారు బోనంను సమర్పించడం జరుగుతోందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 14 ఏళ్లుగా అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తున్నామని గుర్తుచేశారు.

ముందుగానే 'ఉపకార' దరఖాస్తులు!

ప్రభుత్వాన్ని అనుమతి కోరిన ఎస్సీ అభివృద్ధి శాఖ

- విద్యార్థులకు 4 నెలలపాటు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదన
- కుల, ఆదాయ ధ్రువీకరణలు సిద్ధం చేసుకోవాలని విద్యార్థులకు సూచన



సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల అమలుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు అనుమతివ్వాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ముందస్తుగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తే.. వేగంగా పరిశీలించి అర్హతలు నిర్ధారించవచ్చని, దీంతో నిధు లు సైతం త్వరగా అర్హుల ఖాతాల్లో జమ చేయవచ్చని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపింది. సాధారణంగా జూలై నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఈ నెల నుంచే ప్రారంభించేందుకు సాంకేతిక అనుమతులను కోరింది. ప్రస్తుతం ఈ ఫైలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపై వారం రోజుల్లోగా ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ప్రభు త్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసు కుని దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించేందుకు ఎస్సీ అభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది.

నాలుగు నెలలు గడువు..

2023–24 విద్యా సంవత్సరంలో పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నాలుగు నెలల పాటు నిర్వహించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ భావిస్తోంది. గతేడాది మొదట మూడు నెలల పాటు అవకాశం కల్పించగా.. విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాల నుంచి వచ్చిన వినతుల మేరకు మరో రెండు నెలలు, చివరగా నెలరోజుల పాటు అవకాశం కల్పించింది. ఈ సారి విడతల వారీగా దరఖాస్తుల స్వీకరణకు బదులుగా ఒకేసారి నాలుగు నెలల పాటు అవకాశం కల్పించి తర్వాత నిలిపివేయాలని యోచిస్తోంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన వెంటనే వాటి పరిశీలన, అర్హతల ఖరారు ప్రక్రియను కొనసాగించనుంది. ఈ ఏడాది డిసెంబర్ కల్లా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ముందుగా ఉపకారవేతనాలను విడుదల చేసే అంశాన్ని సంక్షేమ శాఖలు పరిశీలిస్తున్నాయి. ఈ క్రమంలో ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు వెంటనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకుంటే వేగంగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారవర్గాలు సూచిస్తున్నాయి.

ఆరోగ్యమే మహా భాగ్యం!

కుటుంబ ఆదాయంలో 10 శాతానికి పైగా ఆరోగ్యపరిరక్షణకు ఖర్చు చేస్తున్న భారతీయుల సంఖ్యలో పెరుగుదల

- టాప్–5 రాష్ట్రాల్లో కేరళ, మహారాష్ట్ర, యూపీ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్
- గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లోనే అధిక వ్యయం...
- 'మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్' డేటాలో ఆయా అంశాలపై ప్రస్తావన



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యమే మహాభాగ్యం... ఈ నినాదాన్ని భారతీయులు తరతరాలుగా ఒక సందేశంగా తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ భారతీయులకు దీని అవసరం ఏర్పడింది. దీనికి తగ్గట్టుగానే 2022–23 ఆర్థిక సంవత్సరంలో తమ కుటుంబ ఆదాయాల్లో పది శాతానికిపైగా ఆరోగ్య పరిరక్షణకు భారతీయులు వ్యయం చేస్తున్నట్టుగా ఇటీవల నివేదికలో వెల్లడైంది. దీనికి సంబంధించి అత్యధికంగా ఖర్చు చేస్తున్న టాప్–5 రాష్ట్రాల్లో కేరళ, మహారాష్ట్ర, యూపీ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ నిలుస్తున్నాయి. ఇది 2017–18 స్థాయిలను బట్టి చూస్తే గణనీయంగా వైద్య, ఆరోగ్యంపై ఖర్చు పెరగడానికి ప్రధానంగా కోవిడ్ మహమ్మారి కారణంగా తలెత్తిన విపత్కర, అనిశ్చిత పరిస్థితులే కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) పురోగతిపై తాజాగా 'మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్'విడుదల చేసిన డేటాలో ఆయా అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా మొత్తంగా చూస్తే.. 2022–23లో 6.67 శాతం ప్రజలు తమ ఆదాయాల్లో పదిశాతానికిపైగా (2017–18లో ఇది 4.48 శాతం) వ్యయం చేశారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా... మొత్తం కుటుంబ ఆదాయాల్లో 25 శాతానికి పైగా ఖర్చు చేస్తున్న వారు 2.3 శాతం మంది ఉన్నట్టుగా ఈ డేటా స్పష్టం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లోని వారే తమ ఆదాయంలో పదిశాతానికి పైగా వ్యయం చేస్తున్నట్టుగా వెల్లడైంది. ఐతే కొన్ని సందర్భాల్లో...పరిస్థితులు చేయి దాటడం లేదా విపత్కర పరిస్థితులు ఎదురుకావడం వంటివి చోటుచేసుకున్నపుడు మాత్రం గ్రామాల్లోని ప్రజలు తమ కుటుంబ ఆదాయాల్లో 25 శాతానికి పైగా ఖర్చు చేయాల్సి వస్తోన్నట్టు తెలుస్తోంది.

టాప్ 5 స్టేట్స్.. చేస్తున్న వ్యయాలిలా..

దేశంలోని టాప్–5 రాష్ట్రాల్లో ప్రజలు చేస్తున్న ఖర్చు శాతం ఈ కింది విధంగా...

రాష్ట్రం	10 శాతం కంటే అధికం	25 శాతం కంటే అధికం
కేరళ	16.13	6.14
మహారాష్ట్ర	8.43	2.93
ఉత్తరప్రదేశ్	8.29	3.37
ఆంధ్రప్రదేశ్	8.13	2.93
హిమాచల్ ప్రదేశ్	7.83	3.00

ఇదిలా ఉంటే...

భారతీయుల వైద్య, ఆరోగ్యానికి సంబంధించి తలసరి వ్యయం 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి (కరోనా తరువాత) అత్యధికంగా పెరిగినట్టుగా కేంద్ర మంత్రిత్వశాఖ నేషనల్ హెల్త్ అకౌంట్స్ (ఎన్‌హెచ్‌ఏ) అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్యం, కుటుంబాల 'ఔట్ ఆఫ్ ప్యాకెట్'వైద్య, ఆరోగ్య వ్యయంపై ప్రభుత్వం ఖర్చు పెంచాక ఈ వృద్ధి నమోదైనట్టుగా ఈ అంచనాల్లోపేర్కొన్నారు. 2014–15లలో ప్రభుత్వం చేస్తున్న తలసరిఖర్చు రూ. 1,100 కాగా, 2019–20 కల్లా అది రూ. 2,014కు పెరిగినట్టు ఇందులో తెలిపారు.

సాయిచంద్ మరణంతో | తెలంగాణ పాట మూగబోయింది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో తన పాట ద్వారా ప్రజలను చైతన్యపరిచిన సాయిచంద్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అసెంబ్లీ స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సాయిచంద్ మరణంతో తెలంగాణ పాట మూగబోయినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేద సాయిచంద్ నివాసానికి వెళ్ళి వారు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కేసీఆర్ వెంట నడిచి ఆటపాటలతో ఆకట్టుకున్న కళాకారుడు సాయిచంద్ అని అన్నారు. సాయిచంద్ కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ విప్ శ్రీమతి గొంగిడి సునీత, లెజిస్లేటివ్ సెక్రటరీ వి.నరసింహా చార్యులు, బీఆర్ఎస్ ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు సైతం సాయిచంద్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్లుప్తంగా...

ట్వీట్లకు పరిమితులు

ట్విట్టర్ వినియోగదారులకు ఎలన్ మస్క్ షాక్

శాన్ ఫ్రాన్సిస్కో: సామాజిక మాధ్యమం ట్విట్టర్ వినియోగదారులకు ఆ సంస్థ యజమాని ఎలాన్ మస్క్ గట్టి షాక్ ఇచ్చారు. ప్రతీరోజూ ట్వీట్లను చూడడానికి పరిమితి విధించారు. వెరిఫైడ్, అన్‌వెరిఫైడ్ అకౌంట్లకు వేర్వేరు పరిమితులు విధించారు. అన్‌వెరిఫైడ్ అకౌంట్ యూజర్లు రోజుకి 600 పోస్టులు మాత్రమే చూడగలరని, వెరిఫైడ్ ఖాతాదారులు రోజుకి 6 వేల పోస్టులు చూడగలరని శనివారం ఒక ట్వీట్ ద్వారా వెల్లడించారు. త్వరలో ఈ ట్వీట్ల సంఖ్యను అన్‌వెరిఫైడ్ అకౌంట్లకు 800కి వెరిఫైడ్ అకౌంట్లకి 8 వేలకు పెంచుతామని చెప్పారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ట్విట్టర్ వినియోగదారులకి శనివారం ట్విట్టర్ యాక్సెస్‌లోకి రాలేదు. కొందరు ట్వీట్లు చేస్తుంటే కెనాట్ రిట్రీవ్ ట్వీట్స్, లిమిట్ ఎక్సీడెడ్ అన్న మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ట్విట్టర్ డౌన్ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ట్విట్టర్ డేటాను చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధతో పని చేసే వ్యవస్థలకి శిక్షణ ఇవ్వడానికి దుర్వినియోగం చేస్తున్నారని, అందుకే ఈ పరిమితులు వచ్చాయని చెప్పారు.

పనితీరులో సింగపూర్ టాప్



బెర్లిన్: అంతర్జాతీయంగా అగ్రరాజ్యాలైన బ్రిటన్, అమెరికా ప్రభ మరింతగా దిగజారిపోతున్నట్టుగా కనిపిస్తోంది. బ్రిటన్‌ను అత్యుత్తమ దేశంగా అక్కడ ప్రజలు అనుకుంటారేమో కానీ జర్మనీకి చెందిన వర్జ్‌బర్గ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో టాప్ -10 దేశాల్లో బ్రిటన్‌కు చోటు లభించలేదు. అత్యంత సమర్థంగా పని చేస్తున్న దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ వంటి దేశాల తర్వాత 13వ స్థానంలో బ్రిటన్ నిలిస్తే, అగ్రరాజ్యం అమెరికా 23వ స్థానంలో ఉంది. నిఫ్టీ పొలిటికల్ టూల్ సాయంతో 173 దేశాల్లో రోడ్లు, నీళ్లు, విద్యుత్, స్కూళ్లు, ఆస్పత్రులు, పోలీసులు వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ఇచ్చారు. డాక్టర్ దగ్గర వేచి చూసే సమయం దగ్గర్నుంచి విద్యుత్ సదుపాయం వరకు ప్రతీ రంగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక అత్యుత్తమ పని తీరు కనబరిచిన దేశంగా సింగపూర్ అగ్రభాగంలో ఉంటే లిబియా అట్టడుగున నిలిచింది. సింగపూర్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, ఎస్తోనియా అగ్రభాగంలో ఉన్నాయి. భారత్ 110వ స్థానంలో ఉంది.

'మహా' కుదుపు



డెప్యూటీ సీఎంగా ప్రమాణం చేశాక సంతకం చేస్తున్న అజిత్

మహారాష్ట్రలో రెండుగా చీలిపోయిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ

- శరద్ పవార్‌కు షాకిస్తూ షిండే సర్కార్‌లో చేరిన అజిత్ పవార్
- ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ఎనిమిది మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు
- ఎన్నికల్లో ఎన్సీపీ పేరు, గుర్తుపైనే పోటీ చేస్తామన్న అజిత్
- మద్దతు కోసం ప్రజల్లోకి వెళ్తానన్న శరద్ పవార్

ముంబై/పుణే/న్యూఢిల్లీ: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో అలజడి. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమి కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆదివారం బీజేపీ-శివసేన(షిండే వర్గం) ప్రభుత్వంలో చేరారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అజిత్ వర్గం ఎమ్మెల్యేల్లో ఎనిమిది మందికి మంత్రి పదవులు లభించాయి. మహారాష్ట్రలో ఒక్కరోజులోనే పరిణామాలు వేగంగా మారిపోయాయి. అజిత్ పవార్‌తో ఉప ముఖ్యమంత్రిగా, ఛగన్ భుజ్‌బల్, దిలీప్ వాల్సే పాటిల్, హసన్ ముష్రీఫ్, ధనుంజయ్ ముండే, అదితీ తట్కారే, ధర్మారావు , అనిల్ పాటిల్, సంజయ్ బాంసోడేతో మంత్రులుగా రాష్ట్ర గవర్నర్ రమేశ్ రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్‌తోపాటు డిప్యూటీ స్పీకర్ నరహరి, ఎన్సీపీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా

అజిత్ పవార్ తొలుత ముంబైలోని తన అధికారిక నివాసం 'దేవగిరి'లో ఎన్సీపీ ఎమ్మెల్యేలతో, కొందరు నాయకులతో సమావేశమయ్యారు. భేటీ అనంతరం శాసనసభలో ప్రతిపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా చేశారు. ఈ రాజీనామాను ఆమోదించినట్లు అసెంబ్లీ స్పీకర్ ప్రకటించారు. ఆ తర్వాత అజిత్ తన ఎమ్మెల్యేలతో కలిసి రాజ్‌భవన్‌కు చేరుకొని, ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్రలో ఎన్సీపీకి 53 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వీరిలో 40 మంది తమ ప్రభుత్వానికి మద్దతిస్తున్నారని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్‌కు 36 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారని ఆయన సన్నిహితుడొకరు చెప్పారు.

దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసమే చేరాం: అజిత్

దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసమే ప్రభుత్వంలో చేరామని అజిత్ చెప్పారు. ప్రభుత్వంలో చేరాలన్న నిర్ణయానికి పార్టీ ప్రజాప్రతినిధులందరూ మద్దతునిచ్చారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీలో ఎలాంటి చీలిక లేదని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఎన్సీపీ పేరుతో, ఎన్సీపీ గుర్తుపైనే పోటీ చేస్తామని అన్నారు. పరిపాలనలో తమకు ఎంతో అనుభవం ఉందని, ప్రజలకు మేలు చేయడానికి ఈ అనుభవాన్ని ఉపయోగించుకుంటామని వ్యాఖ్యానించారు. తనతోపాటు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనిమిది మందికి త్వరలోనే శాఖలు కేటాయించనున్నట్లు అజిత్ వెల్లడించారు. ఎన్సీపీ ఎమ్మెల్యేలంతా తమ వెంటే ఉన్నారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంపై అజిత్ ప్రశంసల వర్షం కురిపించారు. కాగా, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఇప్పుడు ట్రిబుల్ ఇంజన్ ప్రభుత్వంగా మారిందని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు. ఒక ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులతో అభివృద్ధి ఇక వేగం పుంజుకుటుందని ధీమా వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా జితేంద్ర అవద్

మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఎన్సీపీ ఎమ్మెల్యే జితేంద్ర అవద్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఎన్సీపీ ప్రకటించింది. ఇప్పటిదాకా ప్రతిపక్ష నేతగా పనిచేసిన అజిత్ పవార్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో జితేంద్రను నియమించినట్లు పేర్కొంది. పార్టీ ఎమ్మెల్యేలంతా తాను చేసే విప్‌నకు కట్టుబడి ఉండాలని జితేంద్ర అవద్ పేర్కొన్నారు.

బీజేపీ వాషింగ్ మెషీన్..: కాంగ్రెస్

మహారాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ వ్యంగ్యంగా స్పందించారు. బీజేపీ వాషింగ్ మెషిన్ మళ్లీ పని ప్రారంభించిందని అన్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్సీపీ నాయకులు మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరారని, ఇక వారందరికీ క్లీన్ చిట్ వస్తుందని చెప్పారు. బీజేపీ కబంధ హస్తాల నుంచి మహారాష్ట్రకు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

శరద్‌కు ఖర్గే, రాహుల్ గాంధీ మద్దతు

ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. ఇద్దరు నేతలు పవార్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితి తెల్సుకున్నారు.

పార్టీని ధిక్కరించినవారిపై చర్యలు తప్పవు: శరద్ పవార్

పార్టీని ధిక్కరించి, ప్రభుత్వంలో చేరిన వారిపై చర్యలు తీసుకోవడం ఖాయమని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన ఆదివారం పుణేలో మీడియాతో మాట్లాడారు. పార్టీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై స్పందిస్తూ.. ఇలాంటివి చూడడం తనకు కొత్తేమీ కాదన్నారు. బీజేపీ-శివసేన ప్రభుత్వం చేరాలన్నది తమ పార్టీ నిర్ణయం ఎంతమాత్రం కాదన్నారు. కొందరు నాయకులు కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులకు భయపడి ప్రభుత్వంలో చేరినట్లున్నారని అభిప్రాయపడ్డారు. ఇది తన ఇంటి సమస్య కాదని, ప్రజల సమస్య అని చెప్పారు. మద్దతు కోసం సోమవారం నుంచే ప్రజల్లోకి వెళ్తానని, పార్టీని పునర్నిర్మిస్తానని శరద్ పవార్ పేర్కొన్నారు. త్వరలో తమ పార్టీ నాయకులతో సమావేశమవుతానని, పార్టీకి సంబంధించిన నిర్ణయాలపై చర్చిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో త్వరలో జరిగే విపక్షాల సమావేశంలో తాను పాల్గొంటానని ఉద్ఘాటించారు.

రాష్ట్రంలో నాలుగేళ్లుగా అస్థిరతే

నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఎన్నికల తర్వాత ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఉద్ధవ్ ఠాక్రే పట్టుబట్టగా బీజేపీ అంగీకరించకపోవడమే ఇందుకు కారణం. దాంతో కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగింది. తర్వాత బీజేపీకి అజిత్ అండగా నిలిచారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రిగా అజిత్ ప్రమాణం చేశారు. ఆ ప్రభుత్వం కేవలం 80 గంటలపాటు మనుగడ సాగించింది. ఉద్ధవ్ ఠాక్రే ఎన్సీపీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. గత ఏడాది జూన్‌లో శివసేన నేత షిండే తిరుగుబాటు చేశారు. శివసేనలో చీలిక ఏర్పడింది. ఎంవీఏ ప్రభుత్వం కూలింది. బీజేపీతో మద్దతుతో షిండే గత ఏడాది జూన్ 30న ముఖ్యమంత్రి అయ్యారు. సరిగ్గా ఏడాది తర్వాత ప్రభుత్వంలో అజిత్ చేరడం ఆసక్తికరంగా మారింది.

నాలుగేళ్లలో మూడుసార్లు డిప్యూటీ సీఎం

అజిత్ పవార్.. ఎన్సీపీని నిట్ట నిలువుగా చీల్చి మరోసారి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవిని చేజిక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ వచ్చినప్పుడు బీజేపీ ప్రభుత్వానికి మద్దతునిచ్చి కొద్ది రోజులు ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఆయన ఇప్పుడు అధినేత శరద్ పవార్‌కు షాక్ ఇస్తూ పార్టీని చీల్చారు. 2019 నవంబర్ నుంచి 2022 జూన్ వరకు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పని చేశారు. అజిత్ 2019 తర్వాత ముచ్చటగా మూడోసారి ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. గతంలో కూడా కాంగ్రెస్-ఎన్సీపీ కలిసి 15 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన సమయంలో అశోక్ చవాన్, పృథ్వీరాజ్ చవాన్ హయాంలో డిప్యూటీ సీఎంగా చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీలో గట్టి పట్టున్న నాయకుడు. ప్రస్తుతం అజిత్ పవార్ సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారి వారి చక్కెర సహకార సంఘాల్లో అవినీతి ఆరోపణల్ని, ఈడీ కేసుల్ని ఎదుర్కొంటున్నారు. అజిత్ పవార్ పార్టీని చీల్చడానికి ఈ కేసులు కూడా ఒక

అజిత్ పవార్ పొలిటికల్ పవర్ ఇదీ!

కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అజిత్ పవార్ రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు 70 వేల కోట్ల కుంభకోణం చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది మేలో ఎన్సీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, కార్యకర్తల ఒత్తిడితో శరద్ పవార్ వెనక్కి తీసుకున్న సమయంలో అజిత్ పవార్ ఢిల్లీలో బీజేపీ పెద్దల్ని కలుసుకున్నారు. ఇక శరద్ పవార్ తన కుమార్తె సుప్రియా సూలేకి పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు అప్పజెప్పడం అజిత్ పవార్‌కు మింగుడు పడలేదని, అందుకే ఆయ పార్టీని చీల్చారన్నది బహిరంగ రహస్యమే.

మహారాష్ట్రలో పార్టీల బలాబలాలు

2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

పార్టీ	స్థానాలు
బీజేపీ	105
శివసేన	56
ఎన్సీపీ	54
కాంగ్రెస్	44
ఇతర పార్టీలు+స్వతంత్రులు	29
★ మొత్తం అసెంబ్లీ స్థానాలు	288

ప్రస్తుతం పార్టీల బలాబలాలు

పార్టీ	స్థానాలు
బీజేపీ	105
శివసేన(ఉద్ధవ్ ఠాక్రే)	16
శివసేన(షిండే)	40
ఎన్సీపీ(శరద్ పవార్)	18
ఎన్సీపీ(అజిత్ పవార్)	36
కాంగ్రెస్	44
ఇతర పార్టీలు+స్వతంత్రులు	29

బీజేపీ వ్యతిరేక కూటమి యత్నాలకు దెబ్బ!

న్యూఢిల్లీ: ఎన్సీపీలో అనూహ్య చీలిక మహారాష్ట్రలోనేకాదు జాతీయ స్థాయిలో ప్రకంపనలు కలిగిస్తోంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలను అజిత్ తనవెంట తీసుకెళ్లడంతో శరద్ పవార్‌కు సొంత పార్టీలో బలం తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో విపక్షాల ఐక్యతకు తనవంతు బలం ఇచ్చే స్థాయిలో శరద్ ప్రస్తుతం లేరనే చెప్పాలి. దీంతో గత నెలలో పట్నాలో 15 ప్రతిపక్ష పార్టీల ఐక్యత చేసిన యత్నానికి జోరు కాస్తంత తగ్గింది. ఇప్పటికే ఢిల్లీ రాష్ట్రంలో పాలనపై సర్వాధికారం విషయంలో ఆర్డినెన్స్‌కు సంబంధించి ఆప్, కాంగ్రెస్ మధ్య పొసగలేదు. అటు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ మధ్య బాహాటంగా మాటల తూటాలు పేలాయి. కేరళలోనూ కాంగ్రెస్, సీపీఎంలకూ కుదరట్లేదు. తాజాగా అజిత్ ఇచ్చిన షాక్‌తో 2024 ఎన్నికల్లో బీజేపీ మోదీ ప్రభుత్వాన్ని ఐక్యంగా ఢీకొట్టాలన్న ప్రయత్నాలకు కాస్తంత బ్రేక్ పడినట్లయింది. విపక్షాలను ఏకం చేయడంలో ఇప్పటి వరకు కీలకంగా ఉన్న శరద్ పవార్ మున్ముందు ఎలా స్పందిస్తారనే దానిపై ఆధారపడి ఉంది.

మహారాష్ట్రలో బీజేపీకి ఊపు

మహారాష్ట్ర రాజకీయాల్లో కొద్దికాలంగా బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. షిండే ప్రభుత్వంలో చేరాలన్న అజిత్ నిర్ణయంతో ఆ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ కీలకంగా మారే సమయం వచ్చింది. లోక్‌సభ ఎన్నికల సమయానికి తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వంలోని మూడు పార్టీలు మూడు శక్తివంతమైన వర్గాలకు నాయకత్వం సాధించే స్థాయిలో ఉన్నాయి. మహావికాస్ అఘాడి(ఎంవీఏ)పై బీజేపీ పైచేయి సాధించేందుకు అవకాశం చిక్కింది.




మొసలిని ముద్దాడుతున్న ఈయన మెక్సికోలోని శాన్ పెడ్రో హువామెలులా పట్టణ మేయర్ విక్టర్ హ్యూగో సోసా. విషయమేంటంటే ఈ మొసలిని ఈయన పెళ్లి చేసుకున్నారు. ఇక్కడ గత 230 ఏళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోంది. చొంటల్, హువే జాతుల మధ్య విద్వేషం తొలగిపోయి శాంతి నెలకొనేందుకు సూచికగా ఇలా పెళ్లితంతు జరుపుతారు.

సూర్యకాంతిని అడ్డుకుందాం

కొత్త పరిశోధన ప్రారంభించిన అమెరికా

వాషింగ్టన్: ఆధునిక యుగంలో మానవాళిని బెంబేలెత్తిస్తున్న అతిపెద్ద సమస్య వాతావరణ మార్పులు. వేడెక్కుతున్న భూగోళం, ఒకవైపు ముంచెత్తుతున్న వరదలు, మరోవైపు తీవ్రమైన కరువులు, పడిపోతున్న పంటల దిగుబడి.. ఇవన్నీ వాతావరణ మార్పుల సంభవిస్తున్న ప్రతికూల ప్రభావాలే. కాలుష్యానికి తోడు నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయి. రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని తాకుతున్నాయి. సూర్యుడి నుంచి వెలువడుతున్న తీవ్రమైన వేడికి భూమి అగ్నిగుండంగా మారిపోతోంది. అలాంటప్పుడు ఈ సమస్య పరిష్కారానికి సూర్యకాంతి భూమిపై పడకుండా అడ్డుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన అమెరికా ప్రభుత్వానికి వచ్చింది. దీనిపై పరిశోధనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 'వైట్‌హౌస్ ఆఫీస్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ' ఓ నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకోవాలన్నదే ఈ పరిశోధన ఉద్దేశం. జియో ఇంజనీరింగ్ విధానంతో సూర్యకాంతి భూమిపై పడకుండా అడ్డుకోవడం ఎలా అన్నదానిపై పరిశోధన చేస్తున్నట్లు తెలియజేసింది. సూర్యుడి నుంచి వెలువడే తీవ్రమైన ఉష్ణోగ్రతలను ఆకాశంలోని మేఘాలను మరింత మందంగా మార్చడం ద్వారా అడ్డుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ పద్ధతిని సిరస్ క్లౌడ్ థిన్నింగ్ అంటారు. జియో ఇంజనీరింగ్ అమలు చేయడం సులభమేనని వారి వాదన. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికం. ఆ సమయంలో క్లౌడ్ థిన్నింగ్ చేయాలన్న యోచనలో ఉన్నారు.



మోదీ అధ్యక్షతన నేడు కేబినెట్ భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని వార్తలు ఊపందుకుంటున్న వేళ జరుగుతున్న ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా, ఎన్సీపీ నుంచి వేరు కుంపటి పెట్టుకుని బీజేపీ-శివసేన ప్రభుత్వంలో అజిత్ పవార్ వర్గం చేరికపైనా చర్చించే అవకాశాలున్నాయి. ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం ఉంటుందని సమాచారం. హోంమంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితర అగ్రనేతలు ఇటీవలి కాలంలో పలుదఫాలుగా అంతర్గత చర్చలు జరపడంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడతారనే ఊహాగానాలకు బలం చేకూరింది. తాజాగా శరద్ పవార్‌ను వీడి అజిత్ పవార్ వెంట బయటకు వచ్చిన సీనియర్ ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్‌కూ ఇందులో అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన సంస్థాగతమైన మార్పులపైనా చర్చిస్తారని తెలుస్తోంది.

ఫ్రాన్స్‌లో ఐదో రోజూ అల్లర్లు

పారిస్: ఫ్రాన్స్‌లో అల్లర్లు ఐదో రోజూ కొనసాగాయి. ఆందోళనకారులు మేయర్ నివాసంపైకి మండుతున్న కారుతో దూసుకువచ్చి దాడికి యత్నించారు. పోలీసులతో ఆందోళనకారులు పలు చోట్ల బాహాబాహీకి దిగారు. అయితే, గత నాలుగు రోజులతో పోలిస్తే అల్లర్ల తీవ్రత తగ్గింది. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో మొహరించిన పోలీసులు శనివారం రాత్రి మరో 719 మంది నిరసనకారులను అరెస్ట్ చేశారు. మంగళవారం పారిస్ శివారులోని నాంటెర్రెలో ట్రాఫిక్ పోలీసులు నేహల్ అనే యువకుడిని కాల్చి చంపడంతో ఆగ్రహజ్వాలలు చెలరేగిన విషయం తెలిసిందే. నేహల్ అంత్యక్రియలు శనివారం ముస్లిం సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. శనివారం రాత్రి పారిస్‌లో చాంప్స్ ఎలిసీస్ వద్ద గుమికూడిన యువకుల గుంపును పోలీసులు లాఠీచార్జితో చెదరగొట్టారు. ఫ్రెంచి గుయానాలో తుపాకీ బుల్లెట్ తగిలి 54 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. పారిస్ ఉత్తర ప్రాంతంలో నిరసనకారులు బాణసంచా కాల్చుతూ, రోడ్లపై అడ్డంకులు పెట్టారు. టియర్ గ్యాస్, స్టన్ గ్రెనేడ్లను ప్రయోగించి వారిని పోలీసులు చెదరగొట్టారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

బాల్టిమోర్: అమెరికాలో మళ్లీ కాల్పుల మోత మోగింది. తాజాగా జరిగిన రెండు కాల్పుల ఘటనల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 37 మంది గాయాలపాలయ్యారు. బాల్టిమోర్‌లోని బ్రూక్లిన్ హోమ్స్‌లో ఆదివారం ఓ పార్టీ జరుగుతున్న సమయంలో అక్కడ చేరిన యువతపైకి గుర్తు తెలియని వ్యక్తులు యథేచ్ఛగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో 28 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణం తెలియరాలేదని పోలీసులు తెలిపారు. సమాచారం తెలిసిన వారు తమకు తెలపాలని పోలీసు విభాగం పౌరులను కోరింది. ఇలా ఉండగా, కాన్సాస్‌లో ఆదివారం ఉదయం జరిగిన మరో కాల్పుల ఘటనలో ఏడుగురు గాయపడ్డారు.

మా ఆర్మీకి శిక్షణ ఇవ్వండి

వాగ్నర్ గ్రూప్‌నకు బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో ఆహ్వానం

మిన్‌స్క్: రష్యాలో స్వల్పకాలిక తిరుగుబాటు విఫలయత్నం అనంతరం తమ దేశానికి చేరుకున్న వాగ్నర్ గ్రూప్‌నకు బెలారస్ అధ్యక్షుడు ఓ ఆఫర్ ఇచ్చారు. తమ దేశ మిలటరీకి శిక్షణ ఇవ్వాలంటూ ప్రైవేట్ సైన్యం వాగ్నర్ గ్రూప్‌ను అధ్యక్షుడు లుకషెంకో కోరారు. 'ఇక్కడికి వచ్చి మన సైన్యానికి యుద్ధ నైపుణ్యంలో శిక్షణ ఇవ్వాలని వాగ్నర్ గ్రూప్‌ను కోరాం. వారి అనుభవం మాకెంతో అవసరం'అని ఆయన అన్నట్లు అధికార వార్తా సంస్థ బెల్టా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పోరాడుతూ సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్న వాగ్నర్ గ్రూప్‌ను పశ్చిమదేశాలు ద్వేషిస్తున్నాయన్నారు. చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి స్థాయిలో ప్రపంచ సైనిక-రాజకీయ సంక్షోభం ఏర్పడబోతోందని హెచ్చరించారు. దీనిని పరిష్కరించడానికి చర్చల అవసరాన్ని పశ్చిమదేశాలు గుర్తించడం లేదని విమర్శించారు. పోలెండ్ మరో ఉక్రెయిన్ మాదిరిగా మారబోతోందని, ఆ దేశానికి ఈయూ, అమెరికా ఆయుధాలు అందిస్తున్నాయని ఆరోపించారు.

కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో 3 అపార్ట్‌మెంట్లు

సంచలన ఆరోపణలతో సుఖేశ్ చంద్రశేఖర్ మరో లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని మండావలి జైలులో గడుపుతున్న ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన ఆరోపణలు చేశాడు. ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో మూడు ఫ్లాట్లు ఉన్నాయని, హైదరాబాద్‌లోని ఒక ఫార్మా కాంట్రాక్టర్ నుంచి 2020లో అందిన ముడుపులతో వీటిని కొనుగోలు చేశారని ఆరోపించాడు. ఈ మేరకు మండావలి జైలు నుంచి మీడియాకు సుఖేష్ తన న్యాయవాది అనంత మాలిక్ ద్వారా తాజాగా మరో లేఖను విడుదల చేశారు. దుబాయ్‌లోని జుమైరా పామ్స్‌లోని మూడు అపార్ట్‌మెంట్లను అత్యవసరంగా 65 మిలియన్ దిర్హామ్స్ (ఏఈడీ)కు అమ్మాలని వారం క్రితం దుబాయ్‌లోని తన సహచరుడు మనోజ్ జైన్‌ను కేజ్రీవాల్ కోరారని సుఖేశ్ ఆ లేఖలో ఆరోపించాడు. తనకు, సత్యేందర్ జైన్‌కు మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌లో దుబాయ్‌లో మూడు అపార్ట్‌మెంట్ల కొనుగోలు లావాదేవీల వివరాలున్నాయని, ఆ చాట్‌ను విడుదల చేస్తానని సుఖేశ్ పేర్కొన్నాడు. వారం రోజుల్లో ఈడీ, అవినీతి నిరోధక విజిలెన్స్‌కి ఆధారాలు పంపిస్తానని కూడా వెల్లడించాడు. సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడటం ఆపకపోతే హతమారుస్తామని బెదిరించారని పేర్కొన్నాడు. త్వరలో కేజ్రీవాల్ తిహార్ జైలుకు చేరుతారన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు.

వరదలకు గుజరాత్ అతలాకుతలం

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదలతో అతలాకుతలమవుతున్న పలు గ్రామాలతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. వల్సాద్ ప్రాంతంలోని దర్మపూర్‌లో గత 24 గంటల్లో ఏకంగా 23.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వరదల్లో చిక్కుకుపోయిన వారిని కాపాడడానికి జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రంలో జామ్‌నగర్‌లో వరద పరిస్థితి భయంకరంగా ఉంది. ఈ ఒక్క జిల్లాలోనే గత రెండు రోజుల్లో 11 మంది మరణించారు. సురేంద్ర నగర్ జిల్లాలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసం కావడంతో ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. తాజా వరద పరిస్థితులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆపదలో ఉన్న ప్రజలకి సాధ్యమైనంత వరకు సాయం అందిస్తోందని షా ట్వీట్‌చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు స్థానిక యంత్రాంగం కూడా వరద ప్రాంతాల్లో సహాయ చర్యల్లో మునిగిపోయిందని అమిత్ తెలిపారు.

టైటానిక్ కంటే ఐదు రెట్లు పెద్దది

ప్రపంచంలో అతి పెద్ద నౌక నిర్మాణం పూర్తి ● 2024 జనవరి నుంచి ప్రయాణాలు షురూ



సముద్ర అలలతో పోటీపడేలా ఆశలు ఉప్పొంగేవారికి ఇదో అద్భుతమైన అవకాశం. సముద్ర జలాల్లో ప్రయాణానికి ప్రపంచంలోనే అతి పెద్ద నౌక సిద్ధమైంది. టైటానిక్ కంటే ఇది ఐదు రెట్లు పెద్దది. ఈ నౌకలోనే సకల సదుపాయాలు ఉన్నాయి. ప్రపంచంలోని నౌకల్లో స్వర్గధామంగా మారిన 'ఐకాన్ ఆఫ్ ది సీస్' ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. రకరకాల ధరల శ్రేణుల్లో ఈ విలాసనౌకలో అద్భుత ప్రయాణానికి ఏర్పాట్లున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రత్యేకతలివీ..

- ఫిన్లాండ్‌లో మెయర్ తుర్కు షిప్‌యార్డ్ ఈ నౌకని నిర్మించింది
- రాయల్ కరేబియన్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన ఈ నౌక పేరు 'ఐకాన్ ఆఫ్ ది సీస్'.
- నౌక పొడవు 1200 అడుగులు, బరువు 2,50,800 టన్నులు,
- ఈ నౌకలో 2,350 మంది సిబ్బంది ఉంటారు. 5,610 మంది ప్రయాణించగలరు
- ప్రపంచ వ్యాప్తంగా 40 ప్రాంతాలకు చెందిన విభిన్న ఆహార పదార్థాలు ఈ షిప్‌లో లభిస్తాయి.
- నౌకలో వాటర్‌పార్క్‌లు, స్విమ్మింగ్‌పూల్‌లు, ఫ్యామిలీలు ఎంజాయ్ చేసే సకల సదుపాయాలున్నాయి.
- వచ్చే ఏడాది జనవరిలో మియామి నుంచి బయల్దేరే ఈ నౌక కరేబియన్ సముద్ర జలాల్లో ప్రయాణిస్తుంది.
- ఈ నౌకలో ప్రపంచంలోనే అతి పెద్ద వాటర్ పార్క్ ఉంది. దీనికి కేటగిరీ 6 అని పిలుస్తారు. ఈ వాటర్ పార్కులో ఆరు స్లైడ్‌లు ఉన్నాయి.
- ఒక వాటర్ స్లయిడ్ నుంచి నేరుగా సముద్రంలోకి డైవ్ చేసేలా పెట్టారు. కానీ ప్రయాణికుల భద్రత రీత్యా దీనిని వారికి అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాల్లేవు.
- జూన్ 22న ఈ నౌక విజయవంతంగా మొదటి ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది.
- నౌకలో ఉద్యానవనాలు ఉన్నాయి. పార్కుల్లోనూ ప్రయాణికులు సేద తీరవచ్చు.
- కాలుష్య నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)ను ఇంధనంగా వాడుకుంటూ ఈ నౌక ప్రయాణం కొనసాగిస్తుంది.
- వచ్చే ఏడాది జనవరిలో మియామి నుంచి ప్రారంభమయ్యే ఈ నౌకలో ప్రయాణం కోసం ఇప్పటికే రికార్డు స్థాయిలో టిక్కెట్లు అమ్ముడుపోతున్నాయి.
- వివిధ రకాల ప్యాకేజీల కింద ధరలున్నాయి. అన్నింటికంటే తక్కువగా ఏడు రాత్రులు ఓడలో గడపాలంటే 3 వేల పౌండ్ల (రూ. 3 లక్షలకు పైన) వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుంది.
- కరేబియన్‌లో అత్యంత అందమైన దీవులైన బహామస్, కొజుమెల్, ఫిలిప్స్‌బర్గ్, సెయింట్ మార్టెన్, రోటన్, హోండురస్ వంటి వాటి మీదుగా ఈ నౌక ప్రయాణిస్తుంది.
- వినోదమే ప్రధానంగా రూపొందించిన ఈ షిప్‌లో జర్నీకి సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సాక్షి కరీంనగర్

సోమవారం ౹ 3 ౹ జూలై ౹ 2023



మైసమ్మతల్లికి బోనం

కరీంనగర్‌కల్చరల్: జిల్లాకేంద్రంలోని ఆదర్శన గర్‌లో ఆదివారం మైసమ్మతల్లి బోనాల జాతర ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



మిడ్‌మానేరులో 17 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరులో నీటిమట్టం 17.94 టీఎంసీలకు చేరింది. కరీంనగర్ ఎల్ ఎండీలోకి ఆదివారం ఒక్క గేటు ద్వారా 1,265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. పొగమంచు కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు గురువందనం



కరపత్రం ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

కరీంనగర్: వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, గన్నమనేని రంగారావు తెలిపారు. ఆదివారం సంఘ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న 80 మందిని విశిష్ట ఉపాధ్యాయులుగా గుర్తించి సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. గురువందనం కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు అంబటి వేణుకుమార్, అన్నమనేని తిరుపతిరావు, జిల్లా, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

స్వీపర్స్ సమావేశం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ ఉమ్మడి జిల్లా సమావేశం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల పరిధిలో గత 40 ఏళ్లుగా నెలకు రూ.5 నుంచి నేటికీ రూ. 5,200 నిర్ణీత వేతనంపై పూర్తిస్థాయి పని గంటలు స్వీపర్లుగా పనిచేస్తున్నారని, వారికి ఈ జీతాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. ఈనెల 4న ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దిశానిర్దేశం చేయడం జరుగుతుందని, అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా నాయకులు రాజా మహమ్మద్, రాజమల్లు, యూసుఫ్, మొండయ్య, రాజలింగు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి



సమావేశంలో డీటీఎఫ్ నాయకులు

జమ్మికుంట(హుజూరాబాద్): ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి, పదోన్నతులు కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి యేబూషి శ్రీనివాస్ అధ్యక్షతన డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్ ఫెడరేషన్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందజేయాలని, ప్రతీ స్కూల్‌లో స్కావెంజర్లను నియమించాలన్నారు. పీఆర్‌సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు నరహరి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సంపత్, వీణవంక, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, వేణు, శ్రీకాంత్, ఉమ, రాజిరెడ్డి, సదానందం, రాజేందర్ పాల్గొన్నారు.

తెరవే నూతన కార్యవర్గం



మల్లారెడ్డి



వెంకటేశ్వర్లు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కమిటీని ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో ఎనుకున్నారు. వీరగోని పెంటయ్య, కోల రామచంద్రారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్ష, కా ర్యదర్శులుగా కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నగునూరి శేఖర్, ఉదారి నారాయణ, వర్కపల్లి యాదగిరి, సూరారం శంకర్, గో పగాని రవీందర్, కూకట్ల తిరుపతి, తోట నిర్మలారాణి, తోటపల్లి భూ మన్న, సీహెచ్.ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా పెంచాల రంగారావు, రాష్ట్ర కార్యదర్శులుగా నల్లె రాజయ్య, జోగు అంజయ్య, సుద్ర తిరుపతి, గౌరవ సలహాదారులుగా డాక్టర్ నలిమెల భాస్కర్, జయధీర్ తిరుమలరావు, జే.జగన్నాథం, గాజోజు నాగభూషణం ఎన్నికయ్యారు.

దళితబంధులో అవినీతి జాడలు!

లబ్ధిదారుల నుంచి 'వసూళ్ల'పై కలెక్టర్ కన్నెర్ర



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకాన్ని లంచాల బెడద వీడటం లేదు. లబ్ధిదారుల జీవన ప్రమాణాలు, స్థితిగతులు మెరుగుపడాలన్న సంకల్పంతో మొదలుపెట్టిన ఈ పథకాన్ని కొందరు అక్రమార్కులు తమ అవినీతి కోసం దుర్వినియోగం చేస్తున్నారు. దళితబంధు రెండోవిడత డబ్బుల కోసం లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తులను ఫార్వర్డ్ చేసేందుకు కొందరు అధికారులు లంచాలు తీసుకుంటున్న వైనంపై కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ కన్నెర్ర చేశారు. లబ్ధిదారుల నుంచి లంచాలు వసూలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో హుజూరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శిధర్‌ను ఇటీవల సస్పెన్షన్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తదుపరి విచారణ పూర్తయ్యేవరకూ సస్పెన్షన్ అమలులో ఉంటుందని జెడ్పీ సీఈవో ప్రియాంక ఆదేశాలు జారీ చేశారు.

- హుజూరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్ సస్పెండ్
- మరో ఉద్యోగి ఘనకార్యాలపై ఏసీబీ నిఘా
- అఫిడవిట్ మెలికపై మింగుడు పడని దళారులు
- అధికార పార్టీ నేతతో అధికారులపై ఒత్తిడి

జమ్మికుంట, హుజూరాబాద్‌లో..

దళిత కుటుంబాల స్థితిగతులు మార్చేందుకు ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌లోని శాలపల్లిలో 2021 ఆగస్టు 16న ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదే వేదిక నుంచి 10మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చెక్కులను అందించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, హుజూరాబాద్, కమలాపూర్ (హన్మకొండ జిల్లా)లో పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేశారు. అధికారులంతా సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించారు. ఇప్పటివరకు 18,021 మంది దళితకుటుంబాలు పథకం ద్వారా లబ్ధి పొందాయి. ఇందులో కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంటలో 14,080 కుటుంబాలు, హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ నుంచి



హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం

3,941 మంది ఉన్నారు. వీరిలో 10,970 మందికి పూర్తిస్థాయిలో రూ.10 లక్షల చొప్పున సాయం అందజేశారు. మిగిలిన 3,110 మంది మొత్తం రిటైల్ రంగానికి చెందినవారు. వీరికి ఇదివరకే తొలివిడత సాయం అందింది. రెండోవిడత సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో దళారులు కొటేషన్లలో అవినీతికి పాల్పడుతున్నారని అధికారులు గుర్తించారు. దీంతో కలెక్టర్ కొటేషన్‌కు అఫిడవిట్ మెలిక పెట్టారు. ఈ క్రమంలో అవినీతి తగ్గిందనుకున్నారు. అయితే లబ్ధిదారుల దరఖాస్తు ముందుకు కదలాలంటే జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీల్లో పనిచేసే కొందరు ప్రభుత్వ ఉద్యోగులు రూ.15 వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు రావడంలో కలెక్టర్ కర్ణన్ విచారణకు ఆదేశించారు. ఇందులో జిల్లా పరిషత్ జూనియర్ అసిస్టెంట్ శిధర్ ప్రమేయం ఉందని తేలడంతో జెడ్పీ సీఈవో ప్రియాంక అతడిని సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మరో ఉద్యోగి కూడా ఒక్కో దరఖాస్తుకు రూ.30వేలకుపైనే వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కూడా దృష్టి సారించింది.

రంగంలోకి అధికార పార్టీ నేత..

కలెక్టర్ దళితబంధు రెండోవిడత డబ్బుల మంజూరుకు అఫిడవిట్ మెలిక పెట్టడం కొందరు దళారులకు మింగుడు పడటం లేదు. ఇంత కాలం అర్హత లేకున్నా కొటేషన్లు ఇచ్చి లబ్ధిదారుల నుంచి భారీగా వసూలు చేసిన వారి ఆదాయానికి ఈ ప్రతిపాదనతో గండిపడింది. దీంతో వారంతా అధికార పార్టీనేతను ఆశ్రయించి, అధికారులపై లేనిపోనివి కల్పించి చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా అధికార పార్టీ నేత కలెక్టర్ కార్యాలయం అధికారులపై కొంతకాలంగా చిందులు తొక్కుతున్నారు. సాక్షాత్తూ సీఎం ప్రారంభించిన కార్యక్రమం.. కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారని.. ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని మొత్తుకున్నా.. సదరు అధికార పార్టీ నేత వినడం లేదు. ఆ ప్రాంతంలో పేరున్న నేత కావడంతో అధికారులు తీవ్ర ఒత్తిడి మధ్య దళితబంధు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

ఆ అధికారి తీరు అంతే..!

కరీంనగర్‌కార్పొరేషన్: ఆ అధికారికి పలుకుబడి ఎక్కువ. ప్రజాప్రతినిధుల్లో.. పాలకవర్గ సభ్యుల్లో ప్రత్యేక గుర్తింపు. సుదీర్ఘకాలం నగరంలో పనిచేసిన అనుభవంతో అందరితో మంచి సంబంధాలు. కానీ ఆ పలుకుబడే ఇప్పుడు గాడి తప్పుతోంది. నగరపాలక సంస్థ మొత్తంలో తన మాటే చెల్లుబాటు అవుతుందడంతో సదరు అధికారి ఎవరినీ లెక్క చేయడం లేదనే ఆరోపణలున్నాయి. చివరకు ఉన్నతాధికారులు కూడా ఆ అధికారికి భయపడే పరిస్థితి నెలకొందంటే కింది స్థాయి అధికారుల పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు.

- సంతకం పెట్టకుంటే ఉద్యోగులకు బెదిరింపులు
- నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగంలో రగడ
- అధిక పలుకుబడితో గాడి తప్పుతున్న పాలన



ఇంజినీరింగ్ విభాగం.. వివాదాలమయం

- నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం నిత్యం వివాదాలకు కారణమవుతోంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో నగరం ఎంపిక కావడం, సాధారణ నిధులు వందల కోట్లు వస్తుండడంతో కొద్ది సంవత్సరాలుగా నగరంలో నిత్యం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.
- సుమారు రూ.వేయి కోట్లతో స్మార్ట్ సిటీ పనులు, కోట్లాది రూపాయలతో జంక్షన్లు, రోడ్లు, సమీకృత భవనాలు తదితర నిర్మాణాలు జరుగుతున్నాయి. అన్నీ కోట్లల్లో జరిగే పనులే. ఈ పనులను ఇంజినీరింగ్ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇక్కడే సమస్య మొదలైంది.
- ఇంజినీరింగ్ విభాగాన్ని శాసిస్తున్న ఓ అధికారి, పనులన్నింటినీ తన చేతికిందికే తెచ్చుకున్నారనే ఆరోపణలున్నాయి. అటు స్మార్ట్ సిటీ పనుల్లోనూ ఇటు సాధారణ నిధులతో చేపట్టే పనుల్లోనూ ఆయన చెప్పిందే వేదం.
- ఏ కాంట్రాక్టర్‌కు ఏ పని కావాలన్నా, ఆ పనిని మించి బిల్లులు కావాలన్నా సదరు అధికారి చక్రం తిప్పాల్సిందేనని సహచర అధికారులు గుసగుసలాడుకుంటారు.
- పై స్థాయిలో ఉన్న పలుకుబడి, కింది స్థాయిలో ఉన్న ఆధిపత్యం.. ప్రజాప్రతినిధుల అండదండలు.. వెరసి ఆ అధికారి నగరపాలకసంస్థలో ఓ సూపర్ పవర్‌గా మారారనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల తయారీ వ్యవహారంలో సదరు అధికారి వ్యవహరిస్తున్న తీరు ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. పనుల స్థాయికి మించి అంచనాలు రూపొందిస్తారని, పనులు పూర్తయ్యాక బిల్లు చేసే సమయంలోనూ అంచనాలను మరింత పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్డగోలుగా పెంచుతున్న బిల్లులపై కిందిస్థాయి అధికారులు సంతకం చేయకపోతే వారి అంతుచూస్తానంటూ బెదిరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.
- ఇటీవల ఓ కిందిస్థాయి అధికారిని బెదిరించినా సంతకం పెట్టలేదని, సంతకం పెడితే ఉద్యోగానికి ఎసరు వస్తుందని తప్పించుకున్నట్లు వినికిడి. అయితే ఆ అధికారి సంతకం పెట్టకున్నా, మరో అధికారితో బిల్లుపై సంతకం పెట్టించుకున్నట్లు కాంట్రాక్ట్ వర్గాల్లో ప్రచారం ఉంది.

ఆగడాలు భరించలేక..

ఇటీవల సదరు అధికారి తన తోటి ఇంజినీరింగ్ అధికారి ఒకరిని ఇటీవల తీవ్ర పదజాలంతో దూషించడం నగరపాలకసంస్థ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. ఓ కాంట్రాక్టర్ డీఈ స్థాయి అధికారిని దూషించిన ఘటన మరవకముందే సదరు అధికారి కూడా తోటి అధికారులను కార్యాలయంలోనే పరుష పదజాలంతో దూషించినట్లు సమాచారం. దీనిపై అవాక్కయిన సదరు అధికారి, మంత్రి గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సదరు అధికారి ఆగడాలు శృతి మించడంతో లీవ్‌లో వెళ్లడానికి కూడా కొంతమంది అధికారులు సిద్ధపడగా, మరికొంతమంది ఇక్కడి నుంచి బదిలీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీర్ఘకాలిక అనుభవం ఉండి, పనుల్లో చురుగ్గా ఉంటారని పేరున్న సదరు అధికారి, అధిక పలుకుబడితో గాడి తప్పుతున్నారని బల్దియా వర్గాలు భావిస్తున్నాయి. ఏదేమైనా ప్రస్తుతం ఆ అధికారి వ్యవహారం నగరపాలకసంస్థలో హాట్ టాపిక్‌గా మారింది.

తెలంగాణలో కుటుంబ పాలన



మాట్లాడుతున్న నర్సయ్యగౌడ్

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

గన్నేరువరం(మానకొండూర్): నిధులు, నీళ్లు, నియామకాల లక్ష్యంతో ఏర్పాటైన తెలంగాణ కుటుంబ పాలనలో బందీ అయిందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండ్లపల్లిలో మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేవలం హుజురాబాద్ ఎన్నికల్లో లబ్ధి కోసమే దళితబంధు పథకం అమలు చేశారని విమర్శించారు. మన దేశానికి నేడు ప్రపంచంలో కీర్తిప్రతిష్టలు పెరిగాయంటే ప్రధానమంత్రి మోదీతో సాధ్యమైందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు, ఉద్యమకారుడు దరువు ఎల్లన్న మాట్లాడుతూ, అవినీతిని ప్రశ్నించిన ప్రజలు, కళాకారులపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, కరివేద మహిపాల్‌రెడ్డి, అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: తెలంగాణలో ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి 9 ఏళ్లు గడిచినా అమలుచేయడం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు పోల్సాని సుగుణాకర్‌రావు ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లోని తన నివాసంలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 24 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసి కేవలం 700 మాత్రమే ఇచ్చారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇచ్చిన దాదాపు 2 లక్షల ఇళ్లను నిర్మించకుండా పేదలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కేసీఆర్ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలుపరచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట 'మహాధర్నా' నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఇల్లు లేని వారందరు మహాధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కన్నెబోయిన ఓదెలు, లింగంపల్లి శంకర్, తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్, గంప జగన్, మొలుగురి కిషోర్, బేతి మహేందర్‌రెడ్డి, గడ్డం నాగరాజ్, కామారపు నరహరి, దుర్గం మారుతి, నగునూరి లక్ష్మణ్, మునీర్‌ఖాన్, సుజాతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల తిరుపతి, కనుక చంద్రం, జితేందర్‌రెడ్డి, సొన్నాకుల శ్రీనివాస్, మావురావు సంపత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

కరీంనగర్: జిల్లాలో గత మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వయంగా సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించారని, ఆచరణలో నేటికీ అమలు కాకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందన్నారు. జిల్లాలో వరి నార్లు పోసేందుకు ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యు.శ్రీనివాస్, డి.నరేష్, నాయకులు జి.తిరుపతినాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.



చెంజర్లలో కప్పతల్లి ఆడుతున్న గ్రామస్తులు

వరుణుడు కరుణించాలని..

కరీంనగర్‌రూరల్/మానకొండూర్/కొత్తపల్లి: వర్షాలు కురువాలని కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఆదివారం చిన్నారులు కప్పతల్లి ఆటాడారు. గుడ్డపేగులో కప్పను పెట్టి రోకలికి కట్టి కప్పతల్లి పాటలు పాడుతూ ఇంటింటా తిరిగారు. మహిళలు బిందెలతో చిన్నారులతో పాటు కప్పపై నీళ్లు పోశారు. మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామస్తులు డప్పు చప్పుళ్ల మధ్య కప్పతల్లి ఆట ఆడుతూ పోచమ్మతల్లి, భూలక్ష్మి, మహాలక్ష్మి, ఎల్లమ్మతల్లి తదితర దేవతల విగ్రహాలకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి పట్టణంలోని పోచమ్మ గుడి, కట్ట మైసమ్మ, శివాలయం, బొడ్రాయిల వద్ద జలాభిషేకం చేశారు. వరుణ దేవుడు కరుణించి తొందరగా వర్షాలు కురిపించాలని వేడుకున్నారు.



కొత్తపల్లిలో..



గోపాల్‌పూర్‌లో..

రెవెన్యూలో పదోన్నతుల జాతర

- అభ్యంతరాలకు అవకాశం
- తొలుత జూనియర్ అసిస్టెంట్లు.. తదుపరి ఆపై పోస్టులకు పదోన్నతి
- అనంతరం ఎన్‌టీలకు.. పలువురు తహసీల్దార్లకు ఆర్డీవో అవకాశం?

కరీంనగర్ అర్బన్: రెవెన్యూలో పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. అటెండర్ నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ప్రమోషన్లకు కసరత్తు సాగుతోంది. ఉద్యోగులు, అధికారుల సీనియారిటీ, అర్హతలు, రిజర్వేషన్ల క్రమంలో హోదా మారనుండగా అధికారులు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్లకు ఆర్డీవోలుగా పదోన్నతులు రాగా మరికొందరిని వరించనున్నాయి. నాయబ్ తహసీల్దార్ల(ఎన్‌టీ)లకు తహసీల్దార్లుగా పదోన్నతులు



నోటీస్ బోర్డులో జాబితా

రానుండగా సీనియర్ అసిస్టెంట్, గిర్దావర్లకు ఎన్‌టీలుగా అటెండర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్/గిర్దావర్‌గా పదోన్నతులు లభించనున్నాయి. రెవెన్యూ ప్రధాన విభాగం సదరు ప్రక్రియ చేపడుతుండగా జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను కలెక్టరేట్‌లో ప్రదర్శించారు. అభ్యంతరాలుంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సర్వీస్..అర్హతే కొలమానం

జిల్లాల పునర్విభజన తర్వాత శాఖల స్వరూపాలు మారడం ఖాళీలు పాలనపై ప్రభావం పడుతోంది. జిల్లా రెవెన్యూలో ఆయా విభాగాల్లో ఖాళీలుండగా పదోన్నతుల తదుపరి ఇప్పటికే ప్రకటించిన ఉద్యోగ నియామక ప్రకటనల క్రమంలో భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు బట్టి పదోన్నతులు ఇవ్వడం అనవాయితీగా వస్తున్నా.. తెలంగాణ ఏర్పాటు తర్వాత పదోన్నతుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఒక్కో ఉద్యోగి పదోన్నతికి పొందాలంటే మూడేళ్ల సర్వీసును కలిగి ఉండాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే శాఖాపర పరీక్షల్లోనూ అర్హత సాధించడం తప్పనిసరి. సర్వీసు పూర్తి చేసుకున్నా పదోన్నతి పొందే ఉద్యోగానికి సరిపడా అర్హతలు లేకపోతే ప్రయోజనం ఉండదు. పదోన్నతుల్లోనూ 70శాతం మేర ఖాళీలను ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో భర్తీ చేయాలనేది నిబంధన. అలాగే మిగిలిన 30శాతం ఖాళీలు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. కాగా పదోన్నతుల ప్రక్రియను జూలై నెలలో పూర్తి చేయనున్నట్లు సమాచారం. నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్ పదోన్నతి వరకు జిల్లాస్థాయిలో జరిగే ప్రక్రియ కాగా తహసీల్దార్ల పదోన్నతి సీసీఎల్ఏ పరిధిలో జరగనుంది.

పలువురు తహసీల్దార్లకు ఆర్డీవో అవకాశం?

జిల్లాలోని పలువురు తహసీల్దార్లకు ఆర్డీవోలుగా పదోన్నతులు రానున్నట్లు సమాచారం. జిల్లా నుంచి నలుగురికి ఆర్డీవోలుగా పదోన్నతులు రావడం ఖాయమని తెలుస్తోంది. హుజూరాబాద్ తహసీల్దార్ కోమల్‌రెడ్డి, జిల్లా మైనారిటీ అధికారి మధుసూదన్, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కన్నం నారాయణ, శంకరపట్నం తహసీల్దార్ గూడూరు శ్రీనివాసరావుకు పదోన్నతులు రానున్నట్లు పక్కా సమాచారం. అలాగే రిజర్వేషన్ అనుకూలిస్తే తహసీల్దార్ రాజేశ్వరికి కూడ ఆర్డీవోగా పదోన్నతి లభించే అవకాశముంది.

సీనియారిటీ జాబితాలు.. అభ్యంతరాలు

ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను రూపొందించగా అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. సదరు వివరాలను నోటీస్ బోర్డులో పేర్కొనగా జిల్లాలోని సదరు స్థాయి అధికారులు వివరాలను పరిశీలిస్తున్నారు. సుమారు 60మంది వరకు ఉన్నట్లు సమాచారం. వీరిలో అర్హత గలవారిని సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లుగా పదోన్నతి రానుండగా తదుపరి సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లు ఉండగా వీరంతా 110మంది వరకు ఉండనున్నారని సమాచారం. శాఖాపర పరీక్షల్లో పాసైనవారు, రిజర్వేషన్, అర్హత ప్రకారం జాబితాను రూపొందిస్తున్నారు. అర్హత ప్రకారం నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి పొందనున్నారు. సదరు ప్రక్రియ ముగిశాకా నాయబ్ తహసీల్దార్లను తహసీల్దార్లుగా పదోన్నతి ఇవ్వనున్నారు. 20రోజుల్లోనే పదోన్నతుల పరంపర ముగుస్తుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

ముగిసిన స్కూల్ చిల్డ్రన్స్ చెస్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక వైశ్య భవన్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ స్కూల్ చిల్డ్రన్స్ చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ కన్న కృష్ణ, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కేశవపట్నంకు చెందిన బొజ్జ రాధ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాధ, దేవయ్య దంపతులకు అరవింద్ ఒక్కడే కుమారుడు. ఏడేళ్ల క్రితం అతను చనిపోయాడు. దీంతో రాధ అప్పటి నుంచి కొడుకుపై బెంగ పెట్టుకుంది. మూడేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త పోలీసులకు సమాచారం అందించడంతో హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రం సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. అనారోగ్యం, కొడుకుపై బెంగతోనే రాధ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె భర్త ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి


లచ్చాగౌడ్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన రావుల లచ్చాగౌడ్ (55) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చాగౌడ్ ఆదివారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి, ఇంటికి వచ్చాడు. కాసేపటికే ఒళ్లంతా చెమటలు పట్టి, గుండెపోటు రావడంతో చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా అందరికీ వివాహాలయ్యాయి.

చికిత్స పొందుతూ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు..


నందిరెడ్డి (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్‌): అంబాల్‌పూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుమ్మేటి నందిరెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నందిరెడ్డి అంబాల్‌పూర్ ఉపసర్పంచ్‌గా పని చేశారు. కొంతకాలంగా ఆయన కిడ్నీ సంబంధ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందిరెడ్డి ఆదివారం చనిపోయారు. మృతుడి భార్య ఉన్నారు.

పలువురిపై కేసు

సారంగాపూర్‌(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బొనగంటి మల్లయ్య మేకలను అనుమతి లేకుండా తీసుకెళ్లి, డబ్బులు చెల్లించని వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ వివరాల ప్రకారం... మల్లయ్యకు చెందిన 10 మేకలను మండలంలోని రంగపేటకు చెందిన రవి రూ.90 వేలకు కొనుగోలు చేశాడు. డబ్బులు చెల్లించకుండా రవితో పాటు, బీర్‌పూర్‌కు చెందిన దుబ్బయ్య, మరికొందరు మల్లయ్య అనుమతి లేకుండా మేకలను ఓ వాహనంలో రంగపేటకు తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించాలని మల్లయ్య పలుమార్లు కోరినా చెల్లించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పొలాలకు పండ్ల మొక్కలు

- దరఖాస్తు తదుపరి అందజేత
- నాలుగేళ్లపాటు నిర్వహణ ఖర్చులు
- కూలీలకు కలగనున్న ఉపాధి
- చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం


మామిడి తోట

కరీంనగర్ అర్బన్‌: పంట పొలాల్లో పండ్ల మొక్కలు పెంచుకోవాలనుకునేవారికి ఇది సదవకాశం. ప్రభుత్వమే సదరు ప్రక్రియ చేపట్టనుండగా దరఖాస్తు చేసిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దరఖాస్తుకు గడువంటూ లేకపోగా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ అధికారులు వివరించారు. రైతులు మరింత ఆర్థికంగా ఎదిగేలా ఈ పథకం దోహదపడనుండగా కూలీలకు ఉపాధి లభించనుంది. సన్న, చిన్నకారు రైతులు అర్హులు కాగా ఎంతమందికైనా లబ్ధి చేకూర్చనున్నారు. మొక్క నాటిన నుంచి మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వమే చెల్లించనుంది. రైతులు ఆయా ధ్రువపత్రాలు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

అయిదెకరాల వరకు అవకాశం

పండ్ల మొక్కలు నాటుకునేందుకు 5 ఎకరాల వరకు అనుమతివ్వనున్నారు. అంతకంటే ఎక్కువ భూమి ఉంటే అనర్హులుగా పరిగణిస్తారు. దరఖాస్తు చేసిన రైతులు ప్రభుత్వ అనుమతి గల మొక్కలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. సదరు విస్తీర్ణంలో రైతు తనకిష్టమున్న రెండు, మూడు రకాల పండ్ల మొక్కలను కూడ నాటుకోవచ్చు. రైతులు వారికి నచ్చిన నర్సరీల నుంచి మొక్కలు తెచ్చుకోవచ్చు. ఒక్కో మొక్కకు ప్రభుత్వం వేసిన కొటేషన్ ఆధారంగా సదరు రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. ప్రభుత్వం సూచించిన ధర కన్నా మొక్క ధర అధికంగా ఉంటే ఆ మొత్తాన్ని రైతే భరించాలి. ఎకరం విస్తీర్ణంలో ఎన్ని మొక్కలు అవసరమవుతాయో ఆయా ఉద్యాన, ఉపాధి హామీ అధికారులే అంచనా వేస్తారు. వారి సూచనల ప్రకారమే మొక్కలను నాటుకోవాలి. నిబంధనలను విస్మరిస్తే నిర్వహణ ఖర్చులు రావు.

అందుబాటులో 16 రకాల మొక్కలు

ప్రభుత్వం16 రకాల పండ్ల మొక్కలను నాటుకోవడానికి అనుమతించింది. మామిడి, బత్తాయి, నారింజ, జామ, సపోట, జీడిమామిడి, సీతాఫలం, ఆపిల్ బేర్, దానిమ్మ, కొబ్బరి, మునగ, చింత, అల్లనేరేడు, ఆయిల్‌ఫాం, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల మొక్కలు నాటుకోవచ్చు. అయితే పండ్ల మొక్కలు మన నేలలో మనగలుగుతాయా..లేదోనన్న సందేహాలను అధికారుల వద్ద నివృత్తి చేసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం. ఇక్కడి వాతావరణానికి అనుకూలమా.. కాదానన్నదే ముఖ్యం.

నిర్వహణకు ఉపాధిహామీ నిధులు

మొక్కలు నాటడమే కాకుండా తదుపరి సంరక్షణ చర్యలకు నిధులను ఇవ్వనున్నారు. మొక్కల నిర్వహణకు ఉపాధిహామీ నిధులు వెచ్చిస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులను ఉపాధి కూలీలతో చేపట్టి మరుసటి ఏడాది నుంచి మూడేళ్ల పాటు మొక్కల నిర్వహణ నిధులు చెల్లిస్తారు. నాలుగేళ్ల పాటు రైతు మొక్కలను సంరక్షించుకుంటే ఐదో ఏడాది ఫలాలు చేతికందనున్నాయి. ఆయా సీజన్లకు అనుకూలంగా మొక్కల రకాలను ఎంచుకోవాలి. డిమాండ్ వేళ పండ్లు చేతికి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. పండ్ల మొక్కలు నాటిన నుంచి ఆరేళ్ల వరకు అంతర పంటలను కూడ పండించుకోవచ్చు. మొక్కజొన్న, తృణధాన్యాలు తదితర పంటలను పండించుకుని అదనపు ఆదాయం పొందవచ్చు.

'అల్ఫోర్స్' ఐసెట్ ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థినులను అభినందిస్తున్న రవీందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కాకతీయ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన ఐసెట్–2023 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి ఆదివారం సత్కరించారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి.జాహ్నవి(108), బి.మేఘన (137), బి.గ్రీష్మ (161), సీహెచ్.హర్షిత (228), అర్ఫియా జాబీన్ (949), ఎస్.విద్య (995), సమీరా మెహరీన్ (1761), ఇ.అనూష (1950), శ్రావణి (2094)లను అభినందించారు. అలాగే 21 మంది విద్యార్థినులు 5 వేలలోపు, 64 మంది 10 వేలలోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. డిగ్రీతోపాటు ఐసెట్, మ్యాట్, క్యాట్, బ్యాంకింగ్, ఇతర జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు దోహదపడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్ ఘటనలో పలువురిపై కేసు

రామడుగు(చొప్పదండి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన యువతి కిడ్నాప్ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మేరుగు శ్రీనివాస్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మోతెకు చెందిన బండారి మల్లవ్వ కూతురు మౌనిక శనివారం కరీంనగర్‌లో గ్రూప్–4 పరీక్ష రాసి, సాయంత్రం ఆటోలో ఇంటికి వస్తోంది. కొత్తపల్లి సమీపంలో శ్రీనివాస్‌తోపాటు మరికొందరు యువకులు ఆ ఆటోను వెంబడించారు. మౌనిక ఇంటి చేరుకున్నాక వారు రాత్రి 7.30 గంటలకు ఆటో, రెండు ద్విచక్రవాహనాలపై వచ్చారు. ఆమె తల్లిని ఇంట్లో ఉంచి, గొళ్లెం పెట్టారు. అనంతరం మౌనికను బలవంతంగా కిడ్నాప్ చేసి, తీసుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దూరవిద్య పితామహుడికి నివాళి

కరీంనగర్ సిటీ: సార్వత్రిక, దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి 28వ వర్ధంతిని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదురుగా ఆర్.బి.వి.ఆర్.ఆర్.కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ ఉప సంచాలకుడు డాక్టర్ ఇటిక్యాల రాజేందర్ రెడ్డి హాజరై, ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, మొదటి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన రాంరెడ్డి కరీంనగర్ జిల్లా వాస్తవ్యులు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడని, వైస్ ఛాన్సలర్, యూజీసీ చైర్మన్, ఓయూ వైస్ ఛాన్సలర్‌గానూ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఉచ్చిడి మోహన్ రెడ్డి, లయన్ మెతుకు సత్యం, రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, అర్జున అవార్డు గ్రహీత అంజనారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆకారపు భాస్కర్ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, మాజీ తహసీల్దార్ పెండ్యాల కేశవ రెడ్డి, ఓపెన్ యూ నివర్సిటీ కౌన్సిలర్లు హరిశంకర్, నారాయణరెడ్డి, సిబ్బంది, మైలారం గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ సర్వసభ్య సమావేశం


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

కరీంనగర్‌: పట్టణంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు గుండోజు లక్ష్మయ్య, వేములవాడ ద్రోణాచారిలు హాజరై, మాట్లాడారు. ఈ నెల 9న సంఘం రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సీతాఫల్ మండి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి, సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం పట్టణ కన్వీనర్లను ఎన్నుకున్నారు. మహిళా కన్వీనర్‌గా గొట్టెముక్కల ఉమారాణి, అధ్యక్షుడిగా తిప్పారపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపెల్లి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ రమణ, నాయకులు సత్యనారాయణ, దయానంద్, శివప్రసాద్, శ్రీకాంత్, రమేశ్, రాధాకృష్ణ, ప్రభాకర్, బ్రహ్మచారి, తిరుమలాచారి, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'టెక్నీషియన్ల వెబ్ కౌన్సెలింగ్‌కు అంగీకారం'

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న నాలుగు బ్యాచ్‌ల ఈపీ ఫిట్టర్, ఈపీ ఎలక్ట్రీషియన్ ట్రైనీల కోసం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించిందని ఏఐటీయూసీ నేత డి.శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఒక సంవత్సరం శిక్షణ పూర్తి చేసి, డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం, అంతర్గత బదిలీలు కోరుకునే సీనియర్ టెక్నీషియన్లకు ఈ నెలలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి డైరెక్టర్(పా) అంగీకరించారని పేర్కొన్నారు. గతంలో రెండు బ్యాచ్‌లకు మాత్రమే వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జారీ చేసిన ఉత్తర్వులను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వ్యతిరేకించి, అన్ని బ్యాచ్‌లకు చేపట్టాలని కోరామన్నారు. ఈ మేరకు పాత ఉత్తర్వులు రద్దు చేసి, నాలుగు బ్యాచ్‌లకు ఒకేసారి కౌన్సెలింగ్ చేపట్టేందుకు అంగీకరించిందని తెలిపారు. టెక్నీషియన్లకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


రాజు (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ): భూషణరావుపేట గ్రామానికి చెందిన గోపిడి రాజు (57) అనే మహిళా రైతు ఆదివారం పాము కాటుతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోపిడి రాజు తన పంటచేనులో పెసర పంట సాగుచేసింది. పంట చేతికొచ్చిందని పెసర కాయలను తెంపేందుకు ఆదివారం ఉదయం వెళ్లింది. పెసరకాయను తెంపే క్రమంలో పాముకాటు వేసింది. అక్కడున్న వారు చికిత్సకోసం కోరుట్లలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆస్పత్రి వద్దకు చేరుకోగానే ఆమె మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ వివరించారు.

స్తంభం పైనుంచి పడిన అన్‌మ్యాన్డ్ కార్మికుడు

- తలకు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- జేఎల్ఎంను సస్పెండ్ చేసిన డీఈ

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్ టౌన్–6 పరిధిలో పని చేస్తున్న జేఎల్ఎం బి.రాజును సస్పెండ్ చేస్తూ టౌన్ డీఈ రాజం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని కెమిస్ట్ భవన్ పక్కనున్న అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై బల్లి పడి, హెచ్‌బీ ఫ్యూజ్ పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు జేఎల్ఎం రాజు, అన్‌మ్యాన్డ్ కార్మికుడు వెంకటేశ్ శనివారం ఉదయం 7 గంటలకు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. వెంకటేశ్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదే సమయంలో విద్యుత్ సరఫరా జరగడంతో సీసీరోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు గాయాలవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఏబీ స్విచ్‌లు, డీటీఆర్ బంద్ చేసినప్పటికీ విద్యుత్ సరఫరా జరగడంపై అధికారులు విచారణ చేపట్టనున్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికుడి పరిస్థితి బాగానే ఉన్నట్లు తెలిసింది. కాగా అతన్ని స్తంభం ఎక్కించడాన్ని తీవ్రంగా పరిగణించిన డీఈ జేఎల్ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

జేఎల్ఎం సస్పెన్షన్ అన్యాయం..

జేఎల్ఎం రాజును సస్పెండ్ చేయడం అన్యాయమని టీఈఈయూ–327 జిల్లా అధ్యక్షుడు యుగంధర్ అన్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికుడు స్తంభం ఎక్కవద్దని సంస్థ నియమ నిబంధనల్లో లేదని, ఆఘమేఘాల మీద రాత్రిపూట సస్పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్మికుడికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల అక్రమాలు

- వెంటనే విచారణ జరపాలి
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్


డాక్టర్ నగేశ్

హుజూరాబాద్‌: యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలులో మిల్లర్లు అక్రమాలకు పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యంలో తరుగు పేరిట క్వింటాల్‌కు 6 నుంచి 8 కిలోల వరకు కోత పెట్టారని మండిపడ్డారు. అంతేకాకుండా మిల్లర్లు 100 బస్తాలకు నాలుగైదు బస్తాలు కట్ చేయడం దుర్మార్గమన్నారు. ఈ అక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు వాటాలున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది రైతు ప్రభుత్వం కాదని దోపిడీ ప్రభుత్వమని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహించి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మట్టిపెళ్ల కూలి కార్మికుడి దుర్మరణం


ఎల్లయ్య (ఫైల్)

వేములవాడరూరల్‌: బావి పనులు చేస్తుండగా మట్టి పెళ్ల కూలి కార్మికుడు మృతిచెందిన సంఘటన వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన చిందం రాజయ్య అనే భూ యజమాని బావిలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెనకు చెందిన ఆలకుంట ఎల్లయ్య (55)తో పాటు శివరాత్రి రాజు, ఆయన కుటుంబ సభ్యులు పని చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పైనుంచి మట్టి పెళ్ల కూలడంతో ఎల్లయ్య, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఎల్లయ్యను కరీంనగర్, రాజును హైదరాబాద్ తరలించగా కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆలకుంట ఎల్లయ్య మృతిచెందాడు. రాజు చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ఎస్సై నాగరాజు విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూ యజమాని చిందం రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

నీటిగుంతలో పడి మేస్త్రీ...

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధి భూపతినగర్ శివారులోని భావనకుంట చెరువునీటి గుంతలో పడి మేస్త్రీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరా లు. గుంటూరు జిల్లా పెద్దపాలెంకు చెందిన ఒంటినీడి వీరాంజనేయులు మల్లారపు సాయి వద్ద మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఆదివారం వీరాంజనేయులు భూ పతినగర్ శివారులోని భావనకుంట చె రువులోకి బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు నీ టిగుంతలో పడి మృతిచెందాడు. మల్లారపు సాయి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

- మహిళపై పడిన నిప్పురవ్వలు.. తప్పిన ప్రాణాపాయం


కాలిపోయిన విద్యుత్ మీటర్లు

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్ టౌన్–3 పరిధి వావిలాలపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో పలు ఇళ్లలోని గృహోపకరణాలు టీవీలు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు కాలిపోయాయి. ఓ మహిళపై నిప్పురవ్వలు పడి, చున్నీ నిప్పంటుకుంది. అప్రమత్తమైన ఆమె వెంటనే చున్నీని తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ సర్కిల్ ఆఫీసు ఆవరణలోని 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ధర్మారం వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ కింద పలువురు గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకున్నారు. 33 కేవీ టవర్‌కు ఆ ప్రాంతంలో ఉపయోగించే విద్యుత్, కేబుల్ వైర్లతో దండేలను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం ఇక్కడ మాంసం ముక్క ఎత్తుకెళ్తున్న ఓ కాకి ఆ విద్యుత్ లైన్‌పై వాలింది. ఫలితంగా ఇండక్షన్ వచ్చి, టవర్‌కు కట్టిన సర్వీస్, కేబుల్ వైర్ల ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ఘటనలో నాలుగు ఇళ్లలోని విద్యుత్ పరికరాలన్నీ మాడిపోయాయి. ఫలితంగా బాధిత కుటుంబసభ్యులందరూ రాత్రంతా అంధకారంలోనే ఉన్నారు.

ఏడీఈ పరిశీలన..

విద్యుత్ ప్రమాదం జరిగిన ఇళ్లను ఆదివారం స్థానిక కార్పొరేటర్ గంట కల్యాణితో కలిసి కరీంనగర్ టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ పరిశీలించారు. 33 కేవీ టవర్‌కు ఇండక్షన్ రావడం వల్లే షార్ట్‌సర్క్యూట్ జరిగి, గృహోపకరణాలు, మీటర్లు కాలిపోయాయని నిర్ధారించారు. ముఖ్యంగా విద్యుత్ టవర్ల కింద షెడ్లు నిర్మించడం, వాటికి సర్వీస్, కేబుల్ వైర్లను దండేలుగా కట్టడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు జరగకముందే టవర్ల కింద ఉన్న షెడ్లు, నిర్మాణాలను తొలగించుకోవాలని సూచించారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

కరీంనగర్‌: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఆర్సీ జూన్ 30తో ముగిసిందని, నూతన పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కమిషన్ వేస్తే నివేదిక రావడానికి మూడు నుంచి ఆరు నెలలు పడుతుందని, దాని అమలుకు ముందే మధ్యంతర భృతి 30 శాతానికి తగ్గకుండా ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నా స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా డీఎస్సీ వేసి, నియామకాలు చేపట్టాలని, టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


ప్రైవేట్ విద్యా వ్యవస్థలో నూతన ఒరవడి


ప్రసాద్‌రావును సన్మానిస్తున్న శేఖర్‌రావు

కరీంనగర్‌: ప్రైవేట్ విద్యా వ్యవస్థలో ట్రస్మా నూతన ఒరవడి సృష్టించేలా అడుగులు వేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. కొత్త పద్ధతులు అవలంబిస్తూ పాఠశాల నిర్వహిస్తున్న ట్రస్మా ప్రతినిధులు డాక్టర్ ఇ.ప్రసాదరావు, డాక్టర్ జీఎస్ పరంజ్యోతి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి లండన్ బయలుదేరుతున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ, లండన్‌లోని ప్రముఖ ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీలను సందర్శించి అక్కడి విద్యా విధానాన్ని పరిశీలించి, వారు అవలంబిస్తున్న పద్ధతులను అధ్యయనం చేస్తారని పేర్కొన్నారు. కిమ్స్ కాలేజీ చైర్మన్ రవీందర్‌రావు, ట్రస్మా నాయకుడు సొగాని కొమరయ్య ఉన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

గోదావరిఖని(రామగుండం): కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మిక వర్గం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గోదావరిఖని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణకై, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల పర్మినెంట్, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలన్నారు. కేంద్రం కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలు, బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం నెలకు రూ.27 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజన్న, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, ఈ.నరేష్, బి.అశోక్, ఎం.దుర్గయ్య, రాంకీ, కె.లింగమూర్తి, బి.బుచ్చయ్య, ఎస్.మనోజ్, బి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

గన్నేరువరం: మండలంలోని జంగపల్లికి చెందిన అటికం కనకయ్యగౌడ్(40) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కనకయ్యగౌడ్ ఎకరం భూమిలో వివిధ పంటలు సాగు చేశాడు. ఇందుకోసం చేసిన అప్పుల భారంగా మారాయి. ఇటీవల ఉన్న భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బులతో కొంత అప్పు చెల్లించాడు. మరో రూ.4 లక్షల అప్పు ఉంది. తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేందర్ పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఇంటికో బోనం చొప్పున తరలివెళ్లి భగత్‌నగర్, హస్నాపురంలోని పెద్దమ్మతల్లి ఆలయాల్లో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్ సునీల్‌రావు బోనమెత్తుకుని పూజలు చేశారు. కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, ముదిరాజ్ సంఘం బాధ్యులు తదతరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి దప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా పెద్దమ్మగుడికి తరలివెళ్లారు. పెద్దమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు నెల్లి రాజేశం, రాజు, శ్రావణ్, రవీందర్, సుధాకర్, కన్నయ్య, మహేశ్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా నల్లా నీరు



మండల పరిషత్ కార్యాలయం ఎదుట వృథాగా పోతున్న నల్లా నీరు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలకసంస్థ నీటి విభాగం నిర్లక్ష్యం కొనసాగుతోంది. నగరంలోని తాగు నీటి పైప్‌లైన్‌ల నిర్వహణలో సిబ్బంది పూర్తి విఫలం కావడంతో చాలా చోట్ల లీకేజీలు తప్పడం లేదు. పైప్‌లైన్‌లు సరిగా లేకపోవడం, డ్రైనేజీల్లో తాగునీటి పైప్‌లైన్‌లు పగులుతుండడం మూలంగా లీకేజీల తో మురికిగునీరంతా ఇళ్లల్లోకి చేరుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల నల్లా నీళ్లు వృథాగా పోతున్నా పట్టించుకున్న వారు లేకుండా పోయారు. నగరంలోని కలెక్టరేట్ స మీపంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట డ్రైనేజీలో వాటర్ పైప్ పగలడంతో కుళాయి నీరు ఫౌంటేన్ తరహాలో రోడ్డుమీదికి వస్తున్న దృశ్యం ఆదివారం కనిపించింది. ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరా జరిగినంత మేరకు ఈ నీళ్లు పోతూనే ఉన్నాయి. నల్లా నీటి వృథాను అరికట్టడంతో పాటు, లీకేజీలను సరి చేయాల్సిన అవసరం నగరపాలకసంస్థ నీటి విభాగం అధికారులపై ఉంది.

క్లుప్తంగా

గురువు దైవ సమానుడు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న పురాణం మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): జ్ఞాన సంపదకు గురువు అవసరమని, గురువును దైవం అనే దృష్టితో చూస్తేనే అది సాధ్యమవుతుందని వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. ఆదివారం కరీంనగర్ జ్యోతినగర్‌లోని కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లోని తొడుపునూరి నీరజ సంతోష్‌కుమార్‌ల నివాసంలో నిర్వహించిన సామూహిక కనకధారా స్తోత్ర పారాయణంలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మన దేశంలో పుట్టిన ప్రతి ఆధ్యాత్మిక మార్గమూ అహింసే పరమధర్మమని చెప్తుతుందన్నారు. శంకరాచార్యుల అద్వైతం, బుద్ధుడి కరుణా దృష్టి భగవంతుడి ప్రేమమార్గాన్ని బోధిస్తున్నాయని తెలిపారు. భగవద్గీత మనకు మోక్షమార్గం చూపిస్తుందన్నారు. ఈ పారాయణంలో కార్పొరేటర్ వంగళ శ్రీదేవి, సుహాసినీలు పాల్గొన్నారు.

ఆశ్రమానికి టిఫిన్ క్యారియర్ బాక్స్ అందజేత



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లోని అమ్మ ఒడి వృద్ధాశ్రమానికి ఆదివారం తీగలగుట్టపల్లికి చెందిన చిక్కాల మనోహర్‌రావు తన తల్లి అరుణ జ్ఞాపకార్థం టిఫిన్ క్యారియర్ బాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, అనుముల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీ రోడ్డు నం.3లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాలనీలో కొంతదూరమే సీసీరోడ్డు నిర్మించి మిగితా విడిచిపెట్టారని వివరించారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని కోరగా స్పందించిన సర్పంచ్ శ్రీనివాస్ వెంటనే కాంట్రాక్టర్ గంగారెడ్డిని పిలిపించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు షాకీర్, ఇమ్రాన్, శంసుల్‌ఉద, గౌస్, వలీ, తాహసీన్, షఫీ, కాశిఫుల్ ఉద తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



కరీంనగర్‌కల్చరల్: గురుపౌర్ణమి పురస్కరించుకొని వికాసతరంగిణి, జెట్ ఆధ్వర్యంలో 15రోజులుగా నగరంలోని పాఠశాలలో శిక్షణ ఇచ్చిన అంశాలపై ఆదివారం సప్తగిరికాలనీ కోదండరామాలయంలో పోటీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కృష్ణాష్టక శ్లోకాలు, కృష్ణలీలపై చిత్రలేఖనం, హైస్కూల్ విద్యార్థులకు యతిరాజ వింశతి శ్లోక పఠనం, సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిపి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు, కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, పి శ్రీహరిరెడ్డి, జి రాజిరెడ్డి, శ్రీదేవి, స్రవంతి, రాఘవరావు, రామయ్య పాల్గొన్నారు.

విత్తనాల ధరలకు రెక్కలు

- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- రైతులపై అదనపు భారం

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్ వ్యవసాయ పనులు చేపట్టిన రైతాంగానికి విత్తనాల ధరలు చుక్కలు చూపెడుతున్నాయి. పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా సాగయ్యే వరి, పత్తి పంటలకు సంబంధించిన విత్తనాల ధరలు గతంలో కంటే ప్రస్తుతం రూ.50 నుంచి రూ.100 వరకు పెరగడంతో రైతులపై అదనంగా పెట్టుబడి భారం పడుతోంది. గత వారం రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పలువురు రైతులు వరినార్లు పోస్తుండగా మరికొందరు రైతులు పత్తి విత్తనాలు సాగు చేస్తున్నారు.

బ్రాండ్ల పేరిట దోపిడీ

కరీంనగర్ మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరిపంట 10,837 ఎకరాల్లో సాగవుతుంది. ఎకరానికి నారుమడికి కనీసం 25కిలోల విత్తనం అవసరమవుతుంది. వివిధ ప్రైవేట్ కంపెనీలు తమ బ్రాండ్ల పేరిట డీలర్ల వద్ద వరి విత్తనాలను ఉంచి విక్రయిస్తున్నాయి. పత్తి తప్పా మిగితా పంటల విత్తనాల ధరపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఒక్కో కంపెనీ ఒక్కో తీరున వరి విత్తనాల ధరను సంచులపై ముద్రించి విక్రయిస్తున్నాయి. మూడేళ్ల నుంచి ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేయడంతో రైతులు ప్రైవేట్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ కంపెనీలు పలు బ్రాండ్ల పేరుతో బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, ఎంటీయూ విత్తనాల 25 కిలోల బస్తాను రూ. 750 నుంచి రూ.900 వరకు డీలర్ల ద్వారా విక్రయిస్తున్నాయి. టీఎస్ సీడ్స్ సైతం సబ్సిడీ లేకుండానే వరి విత్తనాల ధరను నిర్ణయించి సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల ద్వారా విక్రయిస్తోంది.



దుకాణంలో వరి విత్తన బస్తాలు

పత్తి ప్యాకెట్‌కు రూ. 2వేలు

వరి తర్వాత రైతులు ఎక్కువగా సాగు చేసేది పత్తి పంట. ఈ సీజన్‌లో కరీంనగర్ మండలంలో 4,300 ఎకరాల్లో పత్తిని సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీజన్ ఆరంభంలో కురిసిన తొలకరి వర్షాలకే పలువురు రైతులు 1,050 ఎకరాల్లో విత్తనాలు వేయగా మరికొందరు రైతులు నాలుగైదు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు వేస్తున్నారు. అన్ని రకాల 450 గ్రాముల బీటీ–2 పత్తి విత్తనాల ప్యాకెట్‌కు ప్రభుత్వం రూ.853 ధర నిర్ణయించింది. అయితే పలువురు వ్యాపారులు సాకేత్, యూఎస్7067 రకాల పత్తి విత్తనాలను బ్లాక్ చేశారు. ఎక్కువ దిగుబడి వస్తుందని ప్రచారం చేయడంతో డిమాండ్ పెరిగింది. ఒక్కో ప్యాకెట్‌ను రూ.1,800 నుంచి రూ.2వేలకు డీలర్లు రహస్యంగా రైతులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని తెలిసింది.

సబ్సిడీపై విత్తనాలివ్వాలి



వానాకాలం సీజన్‌లో రైతులందరూ ఎక్కువగా వరిపంటనే సాగు చేస్తారు. 6 ఎకరాల్లో వరిపంట సాగుకు ఒక్కో బస్తాకు రూ.970 చొప్పున 7 బస్తాలను కొనుగోలు చేసి నారు పోశా. గతంలో మాదిరిగానే సబ్సిడీపై వరివిత్తనాలను ప్రభుత్వం అందించాలి. సబ్సిడీ లేకపోవడంతో ఏటా పెట్టుబడి భారం పెరుగుతోంది.

– బుర్ర పర్శరాములు, రైతు, చెర్లభూత్కూర్

రూ.100 పెరిగింది



రెండున్నర ఎకరాల్లో వరిపంటకు నారు పోసేందుకు నాలుగు విత్తన బస్తాలు కొన్న. ఒక్కో బస్తాకు రూ.900 పెట్టా. గతేడాది బస్తాకు రూ.750 నుంచి రూ.800 ఉండగా ప్రస్తుతం రూ.900 ధర పెంచారు. ధర పెంచడంతో పెట్టుబడి పెరిగింది.

– కొట్టె ఆంజనేయులు, రైతు, తాహెర్‌కొండాపూర్

ఆధ్యాత్మికం

బెండకాయల మాలతో అలంకరణ



కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాఢ మాసం శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదుర్గాభవానీ అమ్మ వారిని బెండకాయల మాలలతో అలంకరించారు. ఆలయ పూజారులు అమ్మవారికి విశేష హారతులిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

– విద్యానగర్(కరీంనగర్)

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో పాటు సిస్టం ఇంప్రూవ్‌మెంట్ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ వెంకటసాయి, కాపువాడ ఫీడర్ల పరిధిలోని బొమ్మకల్ చౌరస్తా, మారుతినగర్, కాపువాడ, కమాన్‌రోడ్, వెంకటసాయి రోడ్, పాత బజార్, శ్రీనివాస థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

నియామకం

జీకే యూత్ మండల అధ్యక్షుడిగా అజయ్



కరీంనగర్‌రూరల్: జీకే యూత్ కరీంనగర్‌రూరల్ మండల శాఖ అధ్యక్షుడిగా చెర్లభూత్కూర్‌కు చెందిన జక్కు అజయ్‌గౌడ్‌ను నియమించినట్లు జీకే యూత్ గౌరవ అధ్యక్షుడు గంగుల ప్రదీప్, అధ్యక్షుడు మొగిలోజు వెంకట్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొమ్మకల్‌కు చెందిన తాని హరీశ్‌పటేల్, ఉపాధ్యక్షుడిగా చామనపల్లికి చెందిన కల్వల గంగరాజును నియమించామని అన్నారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించి జీకే యూత్ బలోపేతానికి కృషి చేస్తానని అధ్యక్షుడు అజయ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన జీకే యూత్ అడ్వయిజర్స్ కర్ర సూర్యశేఖర్, పొన్నం రాజు, నేతికుంట హరీశ్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు ప్రకటించారు.

కొత్తపల్లి మున్నూరుకాపు కార్యవర్గం ఎన్నిక

కొత్తపల్లి: మున్నూరు కాపు సంక్షేమ సంఘం కొత్తపల్లి పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సిరిపురం భూమయ్య, ఉపాధ్యక్షులుగా గాజుల భూమయ్య, కొప్పుల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సూర్ల రాజు, సహాయ కార్యదర్శిగా చిందం రాజ్‌కుమార్, కోశాధికారిగా సిరిపురం కృష్ణంరాజు, ప్రచార కార్యదర్శిగా నమిలకొండ రాములు, సభ్యులుగా నమిలకొండ రఘుపతి, సిరిపురం రాజేశం, కొత్త కిషన్, పుప్పాల శంకర్, గాజుల అజయ్‌కుమార్, పుప్పాల సందీప్‌లు ఎన్నికయ్యారు.

భక్త మార్కండేయ ఆలయ కమిటీ కార్యవర్గం

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి ఆలయ అభివృద్ధి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అనుమల్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా రుద్ర రాజేశం, గౌరవ సలహాదారుగా వాసాల రమేశ్, సభ్యులుగా మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, స్వర్గం శంకరయ్య, గుండేటి విశ్వనాథం, స్వర్గం నర్సయ్య, బోగ మునీందర్, మేరుగు మల్లేశం, నందాల శ్రీనివాస్, నడిమెట్ల రాజు, బోగ రంజిత్, గుల్లపెల్లి మల్లికార్జున్, సుంకె చంద్రయ్య, బొద్దుల శ్రీనివాస్, ఉమాశంకర్‌లు ఎన్నికయ్యారు.

శివారు డివిజన్లలో వేగంగా అభివృద్ధి

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని శివారు డివిజన్లలో వేగంగా అభివృద్ధి జరుగుతుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం 35వ డివిజన్ సప్తగిరికాలనీలో నగరపాలక సంస్థ రూ.30లక్షల నిధులతో నిర్మించనున్న పల్లవి అక్షరదీపం సమాఖ్య సంఘ భవనానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. 35వ డివిజన్ సప్తగిరికాలనీ శివారు ప్రాంతమని, ప్రస్తుతం నగరం మధ్యలో ఉన్న ప్రాంతంగా మారిందన్నారు. తమ పాలకవర్గం వచ్చాక అనేక పనులు చేపట్టి ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ప్రతీ ఇంటికి తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. వర్షాకాలంలో వరద నీటి సమస్య స్టాం వాటర్ డ్రెయినేజీ నిర్మాణంతో తీరిందన్నారు. మానేరు డ్యాం ఆనకట్టపై ఈ ప్రాంత ప్రజలు వాకింగ్ చేసేందుకు రెండు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ కూడా నిర్మించామని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీకి చెందిన మహిళలు సమాఖ్య సమావేశాలు, శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా అన్ని రకాల వసతి సౌకర్యాలతో భవన నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం చేసి అవసరాన్ని బట్టి మొదటి అంతస్తు కూడా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, డీఈ మసూద్ అలీ, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మేయర్

గురుపౌర్ణమికి సాయిబాబా ఆలయం ముస్తాబు



కరీంనగర్‌కల్చరల్: వ్యాస (గురు) పౌర్ణమి ఉత్సవాలకు కరీంనగర్‌లోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయం ముస్తాబైంది. ఆలయంలో చలువ పందిళ్లు, టెంట్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ఆలంకరించారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు మహాగణపతి, నవగ్రహ, సమస్త దేవతల సాయిపూజలు జరుగనున్నాయి. 6 గంటల నుంచి 7.30 వరకు సాయిబాబా మంగళస్నానాభిషేకాలు, అనంతరం పుష్పార్చన, అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 నుంచి మంగళవారం వరకు 24 గంటల అఖండనామ సంకీర్తన జరుగనుంది.

మేదరి మహిళలు చైతన్యవంతులు కావాలి

కరీంనగర్: మేదరి మహిళలు చైతన్యవంతులై సంఘటితంగా ముందుకు సాగితే తమ హక్కులు సాధించుకోవచ్చని మేదరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకుల రాజనర్సు అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో సంఘం నగర అధ్యక్షుడు ఏకుల రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేదరి మహిళా సంఘం నగర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షురాలిగా మన్న వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శిగా పిట్టల స్వప్న, కోశాధికారిగా పిల్లి జ్యోతి, ప్రచార కార్యదర్శిగా గైని లలిత, గౌరవ అధ్యక్షురాలిగా చింతల అమృతవేణిలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి మదిరె వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మదిరె రవీందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిలివేరి సత్యనారాయణ, గైని లక్ష్మి, వాసం సర్వేశం, రవి, రాంగోపాల్, వెంకటనర్సయ్య, ప్రభాకర్, తిరుపతి, శ్రీనివాస్, వీరస్వామి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన మేదరి మహిళా సంఘం నగర కార్యవర్గం

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కరీంనగర్‌టౌన్: నగరంలోని 53, 54 డివిజన్లకు చెందిన దాదాపు 200 మంది ఉప్పరి అజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో వీరికి పార్టీ నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పనిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ప్రజల అభీష్టం మేరకే ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్, బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. గడపకు గడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరినీ కలిసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతీ ఇంటికి కరపత్రం ద్వారా తెలియజేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో తమ్మదేవని అఖిల్, మేడిపల్లి హరీశ్, మేడిపల్లి తరుణ్, ఊట్ల జాన్‌తో పాటు దాదాపు 200మంది చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమద్ నవాబ్, చర్ల పద్మ, ఎండీ తాజ్, శ్రవణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, సయ్యద్ అఖిల్, దండి రవీందర్, సయ్యద్ ఖంరొద్దీన్, ఎండీ చాంద్, దన్న సింగ్, షేక్ శేహెన్ష, షబానా మహమ్మద్, ఊరడి లత, ముల్కల కవిత, అన్నె జ్యోతి, పద్మ, మెతుకు కాంతయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, తమ్మడి ఎజ్రా, నేహాల్ అహ్మద్, కీర్తికుమార్, సిరాజొద్దీన్, నదీమ్, ఎండీ బారీ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న నరేందర్‌రెడ్డి

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతుల అందజేత



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తిలో మాజీ ఎంపీటీసీ బాషవేణి సరోజనమల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. టోర్నీలో మొత్తం 8 జట్లు పాల్గొనగా మారం సంతోశ్ జట్టు విన్నర్, కోటగిరి రాజు జట్టు రన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.5వేలు, రన్నర్ జట్టుకు రూ.2వేల నగదు బహుమతిని మాజీ ఎంపీటీసీ బాషవేణి సరోజన మల్లేశం ప్రకటించగా సర్పంచ్ చామనపల్లి అరుణ అందజేశారు. ఉత్తమ ఆటగాళ్లుగా ఎంపికైన గుర్రం అరుణ్, చందు, నిఖిల్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చామనపల్లి రాజయ్య, మల్లేశంలతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు హౌసింగ్‌బోర్డ్‌కాలనీ కిడ్స్ వర్డల్స్ స్కూల్‌లో ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి అంజయ్య, సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు తమ కవితలతో హాజరు కావాలని కోరారు.

5 నుంచి ఎంపిక పోటీలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో 2023–24 విద్యా సంవత్సరానికి క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 5,6,7 తేదీల్లో 4,5వ తరగతి విద్యార్థులకు కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎం.మధుసూదనాచారి తెలిపారు. విద్యార్థులు స్టడీ, బర్త్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, 4 పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో పోటీలకు హాజరు కావాలని సూచించారు. అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91602 90135 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ల వినూత్న నిరసన



కరీంనగర్‌టౌన్: బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల వైఫల్యంతో రోజురోజుకు పెరుగుతున్న వంటగ్యాస్, కూరగాయల ధరలను నిరసిస్తూ ఆదివారం నగరంలోని తెలంగాణచౌక్‌లో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు వినూత్న నిరసన చేపట్టారు. తలపై కూరగాయల బుట్ట పెట్టుకొని మెడలో కూరగాయల మాలలు ధరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు చెర్ల పద్మ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు షబానా, కవిత, లతా, శారద, పద్మ, మహాలక్ష్మి, మానకొండూర్ కవిత, సులోచనజ్యోతి, మంజుల, రేణుక, కవిత, నాయకులు శ్రావణ్ నాయక్, కుర్ర పోచయ్య, షాహెన్షా గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

మంచి మాట

'గు' అంటే చీకటి. 'రు' అంటే కాంతి. అజ్ఞానపు చీకటిని నిర్మూలించేది గురు. కాంతి లేకపోతే మనకు ఏదీ తెలియరాదు. గురువులు కాంతిని ఇస్తారు. జీవనం అనే చీకటిని ఛేదించడానికి ప్రతి మనిషికి కాంతిని ఇచ్చే గురువు ఎంతో అవసరం.



కదిలించే కాంతి గురువు

వ్యాసుడు కీలకమైన గురువుకాగా ఆది శంకరాచార్య భారతీయతకు మహోన్నతమైన గురువు అయ్యారు. శంకరాచార్యే ఉండి ఉండకపోతే ఒక దశలో భారతీయత చిందరవందరైపోయేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు, రామానుజుడు, అరవిందుడు వంటి పలువురు మేలైన గురువులు మన మట్టికి, మనకు మేలు చేశారు.

శంకరుల తరువాత స్వామి వివేకానందవల్ల ఒకదశలో భారతీయతకు రావాల్సిన చలనం, జ్వలనం వచ్చాయి. భారతీయ తత్త్వానికి, సత్యానికి విశ్వవ్యాప్తిని కలిగించారు వివేకానందులు. మనదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం రావడానికి వివేకానందులు పరోక్ష కారణం. వారు వెలిగించిన భారతీయ స్ఫూర్తి పలువురిని జాతీయ ఉద్యమంవైపు నడిపించింది. వైదికత్వం కోసం, జాతి కోసం తన ఆత్మానుభూతిని సైతం త్యాగం చేసిన అత్యున్నత

> మనకు అత్యవసరమైన గురువులుగా ఆది శంకరాచార్యను, స్వామి వివేకానందను మనం ఇకపై సంభావించి స్వీకరించాలి. ఈ ఇరు గురువుల ఉపదేశాల్ని అందుకుని భారతీయులమైన మనం దేశ సంక్షేమం కోసం, సౌభాగ్యం కోసం, ప్రగతి కోసం పనిచెయ్యాలి; మనమూ పరిఢవిల్లాలి.

మైన యోగి–గురువు వారు. ఒక దశలో శంకరులు, ఒక దశలో వివేకానందులు అందివచ్చిన గురువులై మనల్ని కదిలించే కాంతులు అయ్యారు.

'కృష్ణం వందే జగద్గురుం' అన్నది మన మట్టిలో మెరుస్తూ ఉండే మాట. కృష్ణుడు చెప్పిన పాఠం భగవద్గీత ప్రపంచం అంతా విలసిల్లుతోంది. 'తుచ్ఛమైన హృదయ దౌర్బల్యాన్ని విడిచి పైకిలే' అంటూ కృష్ణుడు మనల్ని ఉన్ముఖుల్ని చేస్తూనే ఉన్నాడు. 'భగవద్గీత సందేశం అంతా ఈ మాటల్లో ఇమిడి ఉంది' అని చెప్పారు వివేకానందులు. ఈ మాటల స్ఫూర్తితో వారు 'లే, జాగృతి పొందు, లక్ష్యాన్ని చేరే వరకూ ఆగకు' అని అన్నారు. 'పనిలో నేర్పరితనమే యోగం' అనీ, 'హీనమైన పనిని దూరంగా వదిలెయ్యి' అనీ, 'నిర్ణయించబడిన పనిని చెయ్యి' అనీ, 'శ్రద్ధ ఉన్నవాడికి జ్ఞానం లభిస్తుంది' అనీ, 'అనుమానస్తుడికి సుఖం లేదు' అనీ కృష్ణుడు చెప్పినవి మన జీవితాలకు కాంతిని ఇచ్చేవి. 'మానవ విజ్ఞానంలో సాటిలేనివాడు, అద్వితీయమైన వ్యక్తిత్వం ఉన్నవాడు కృష్ణుడు' అని వివేకానందులు చెప్పిందాన్ని అర్థం చేసుకుందాం.

ఏది అన్నిటికన్నా ప్రయోజనకరమైంది? అన్న సంశయానికి 'ధర్మం' అని చెప్పి శంకరాచార్య సంశయ నివృత్తి చేశారు. ఏది వాంఛింపదగింది? అన్న సంశయానికి 'స్వ, పర హితం' అనీ, శత్రువు ఎవరు? అన్న సంశయానికి 'సోమరితనం' అనీ, ఏది దుఃఖం? అన్న సంశయానికి 'ఉత్సాహం లేకపోవడం' అనీ, ఏది జాడ్యం? అన్న సంశయానికి 'నేర్చుకున్నది ఆచరించకపోవడం' అనీ, ఎవరు స్నేహితులు? అన్న సంశయానికి 'పాపాన్ని నివారించే వాళ్లు' అనీ, ఏది పాతకం? అన్న సంశయానికి 'హింస' అనీ, ఎవరు ఎదుగుతారు? అన్న సంశయానికి 'వినయం ఉన్నవాళ్లు' అనీ, ఎవరు ప్రత్యక్ష దేవత? అన్న సంశయానికి 'అమ్మ' అనీ, వేటిని మనుషులు సంపాదించాలి? అన్న సంశయానికి 'విద్య, ధనం, బలం, కీర్తి, పుణ్యం' అనీ, ఎవరి చేత ప్రపంచం జయించబడుతుంది? అన్న సంశయానికి 'సత్యం, ఓర్పు ఉన్న వ్యక్తి చేత' అనీ తెలియజెప్పి మనకు దిశానిర్దేశం చేశారు శంకరాచార్య. 'మీరు అపారమైన ఓర్పు కలిగి ఉన్నారా, అయితే విజయం మీదే' అని శంకరుల స్ఫూర్తితో వివేకానందులు ఉవాచించారు.

'సత్యం, నిగ్రహం, తపస్సు, శుచి, సంతోషం, సిగ్గు, ఓర్పు, నిజాయితీ, జ్ఞానం, శాంతి, దయ, ధ్యానం కలిగి ఉండాలి; ఇదే సనాతన ధర్మం' అన్న వ్యాసుడి ఉపదేశాన్ని వ్యక్తిత్వంలో నింపుకుని ప్రతి వ్యక్తీ ఉదాత్తంగా బతకాలి.

– రోచిష్మాన్

బౌద్ధవాణి



ఆషాఢ మాసం. శుక్లపక్షం. చతుర్దశి చంద్రుడు పశ్చిమ ఆకాశంలోంచి కిందికి వాలిపోయాడు. అది ఒక విశాల వనంలోని పచ్చికబయలు. దానిమధ్య పెద్ద మర్రిచెట్టు. దానికింద ఎత్తైన దిబ్బ. దాని మీద కూర్చుని ఉన్నారు ఐదుగురు తాపసులు. తెల్లవారకముందే సమీప గంగానదిలో స్నానం చేసి వచ్చి తపోసాధన గురించి తర్కించుకుంటున్నారు. తెల్లని నార వస్త్రాలు ధరించారు. వారిలో పెద్దవాడు కొండణ్ణ. అతని చూపు పొదలమాటున లేచి తత్తర పడుతున్న జింకకేసి పడింది. అందరూ అటుకేసి చూశారు. ఎవరో కాషాయ చీవరం ధరించిన ఒక వ్యక్తి వారికేసి వస్తూ కనిపించాడు.

''మిత్రులారా! అలా నడిచేది ఎవరు? గుర్తించారా? శాక్య గౌతముడే!'' అన్నాడు అశ్వజిత్తు.

''మిత్రమా! నీవన్నది నిజమే. అతను తపోభ్రష్టుడు. అతను రాగానే మనం గౌరవించకూడదు. లేచి నిలబడకూడదు'' అన్నాడు బద్దియుడు.

''కూర్చోమని ఆసనం ఇవ్వకూడదు'' అన్నాడు మహానామ!

''ప్రత్యేక గౌరవ వందనాలు చేయొద్దు. ఆసనం ఇద్దాం'' అన్నాడు పెద్దవాడైన కొండణ్ణ.

''కానీ... ఆ తేజోమూర్తి వారి దగ్గరకు రాగానే.. ఆ ముఖంలోని జ్ఞానతేజస్సుని చూసి.... ఒకరికొకరు అప్రయత్నంగానే లేచి నిలబడ్డారు. నమస్కరిస్తూ ఎదురు వెళ్లారు. ఆహ్వానించారు. ఉచితాసనం ఇచ్చారు. కాళ్ళకు నీళ్ళిచ్చారు.

''మిత్రమా! శాక్య గౌతమా!'' అన్నారు.

''భిక్షువులారా! నేను ఇప్పుడు గౌతముణ్ణి కాను. జ్ఞానోదయం అయిన బుద్ధుణ్ణి తథాగతుణ్ని భదంతను. కాబట్టి నన్ను భదంతా (భంతే) అని సంబోధించాలి'' అన్నాడు.

బుద్ధత్వం అనే పదం వినగానే వారి మనస్సు వికసించింది. గౌరవంతో వంగి నమస్కరించారు.

ఆకాశంలో నల్లని మేఘాల బారు మెల్లగా జింకలవనం మీదుగా నైరుతి దిక్కుకేసి కదలిపోతోంది...!

అప్పటికి ఆరేళ్ళ క్రితం... జ్ఞాన సాధన కోసం దుఃఖ నివారణీ మార్గం కోసం అన్వేషిస్తూ తన రాజ్యాన్నీ పదవినీ, రాజభోగాల్నీ వదిలి వచ్చేశాడు సిద్ధార్థుడు. అతనితోపాటే ఆస్థాన పురోహితుడు కొండణ్ణ కూడా వచ్చాడు. సిద్ధార్థుడు పుట్టినప్పుడు ''మహారుషి అవుతాడు'' అని చెప్పింది ఈ కొండణ్ణే. ఇంకా వారితో పాటు నలుగురు పురోహిత పుత్రులూ వచ్చేశారు. సిద్ధార్థుడు ఆరేళ్ళు అనేకమంది, రుషుల దగ్గరకూ, తాత్వికుల దగ్గరకూ, గురువుల దగ్గరకూ తిరిగాడు. చివరికి ఈ ఐదుగురు మిత్రులతో కలిసి నిరంజనా నదీ తీరంలో కఠోర తపోసాధనకు దిగాడు. తిండి మానాడు, నీరసించి పడిపోయాడు. ''ఇది సరైన సాధన కాదు'' అని కొద్దిగా ఆహారం తీసుకోసాగాడు. దానితో అతను తపో భ్రష్టుడయ్యాడు'' అని కోపగించి, మిగిలిన ఐదుగురూ అతణ్ణి వదిలి వచ్చేశారు. ఆ తర్వాత బుద్ధగయలో జ్ఞానోదయం పొంది సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. దుఃఖ నివారణా మార్గాన్ని తెలుసుకున్నాడు. దాన్ని బోధించడానికి, తనని దూషించి వెళ్లిన వారిని వెతుక్కుంటూ వచ్చాడు.

ఆరోజు.... నాల్గు ఆర్య సత్యాల్ని, అష్టాంగ మార్గాన్నీ, మధ్యమ మార్గాన్నీ వివరించాడు. విన్న వెంటనే కొండణ్ణ అర్థం చేసుకున్నాడు. దుఃఖ విముక్తి పొందాడు. ఆ తర్వాత మిగిలిన వారు ఆ మార్గాన్ని దర్శించారు. వారితో బౌద్ధ సంఘం ఏర్పడింది. కాబట్టి ఈ ఆషాఢ పున్నమి ''సంఘం పుట్టిన రోజుగా'' ప్రసిద్ధి పొందింది. తాము తెలుసుకున్న ధర్మాన్ని (దుఃఖ నివారణీ మార్గాన్ని) ప్రపంచానికి చాటాలనుకున్నారు. కాబట్టి దీన్ని ''ధర్మ చక్ర ప్రవర్తనా దినం'' అని పిలుస్తారు. బుద్ధుడు వారికి చేసిన మొదటి ప్రవచనం ధర్మ చక్ర ప్రవర్తనా సూత్రంగా, రెండవ ప్రవచనం 'అనాత్మక లక్షణ సూత్రం'గా బౌద్ధ సాహిత్యంలో ప్రసిద్ధి.

విముఖుల్ని సుముఖులుగా చేసిన గురువు కాబట్టి 'గురుపూర్ణిమగా' ఈ ఆషాఢ పున్నమిని ప్రపంచ బౌద్ధులు జరుపుకుంటారు.

– డా. బొర్రా గోవర్ధన్

దిద్దుబాటు

గురువాణి



జీవితంలో కొన్ని వదిలించుకుని తీరవలసినవి, ఎన్ని సర్దుబాట్లుచేసుకుని అయినా వదలకూడనివి కొన్ని ఉంటాయి... వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని తదనుగుణంగా దిద్దుకోకపోతే పచ్చటి జీవితాలు పాడయిపోతాయి, మోడయిపోతాయి. అందులో మొదటగా స్నేహితుడు.. అదీ ఆత్మీయుడు, ప్రాణసముడు.. అని నమ్మి మనం మన కష్టం, సుఖం, బాధలు, ఇబ్బందులు, బలహీనతలు అన్నీ మనసు విప్పి ఏవీ దాచుకోకుండా చెప్పేసుకుంటాం. ఇవన్నీ తెలుసుకుని మనల్ని మోసం చేయడానికి అతను కనిపెట్టుకుని ఉన్నాడు... అని తెలిసినప్పుడు మీరెంత ప్రమాదంలో ఉన్నారో ఊహించుకోండి. మీరు వెంటనే అప్రమత్తం కావాలి. దిద్దుబాటు చర్యలు చేపట్టాలి... సాధ్యం కానప్పుడు దూరంగా పెట్టడానికి సందేహించకూడదు.

అలాగే భృత్యుడు... సేవకుడికి వినయం ఉండాలి. యజమాని పట్ల గౌరవభావం ఉండాలి. ఆయన చెప్పిన ఆదేశాలను పాటించడం తన విధిగా అనుకోవాలి. తనసేవలతో యజమానిని మెప్పించడానికి ప్రయత్నం చేస్తుండాలి. అలా కాక యజమానికన్నా తాను ఎక్కువ చదువుకున్నవాడిననీ, దేనిలోకూడా ఆయనకేమీ తాను తీసిపోననీ, ఆయన మాటలు నేను వినేదేమిటనే సేవకుడు... యజమానిని ఎప్పుడూ తిరస్కార భావంతోనే చూస్తుంటాడు. అటువంటి భృత్యుడిని సంస్కరించగల శక్తి ఉంటే సంస్కరించగలగాలి... అది సాధ్యంకానప్పుడు వదిలించుకోవాలి. కపటి అయిన మిత్రుడు, అహంకారి అయిన భృత్యుడు మృత్యువుతో సమానం. ఇంట్లో పెద్ద తాచుపాము దూరింది.. ఇంట్లోనే ఎక్కడో ఉంది.. రోజుకు నాలుగైదు సార్లు కనిపిస్తున్నది. ఏదో దానిమానాన అది ఉందని ప్రశాంతంగా, నిబ్బరంగా ఇంట్లో ఉండగలమా... ఇవి కూడా అంతే...

ఇక ... ఒకసారి అనుబంధం ఏర్పడిన తరువాత ఎన్ని అవాంతరాలు, ఎంత మానసిక క్లేశం ఎదురవుతున్నా సర్దుబాటు చేసుకుంటూ, చివరిదాకా కొనసాగించాల్సిన బంధం – దాంపత్య బంధం. ఇద్దరూ కలిసి చెయ్యిచెయ్యిపట్టుకుని ప్రస్థానం చేయాలి. ఎవరు ఎవరి చేయి పట్టుకున్నారు, ఎవరు ఎవరిని కాపాడుకోవాలి.. అనేది ఆయా సందర్భాలను బట్టి ఉంటుంది. ఉదాహరణకు...

ఒక చిన్న పిల్లను తీసుకుని తండ్రి నడిచి వెడుతున్నాడు. 'అమ్మా! మనం నడుస్తున్న ప్రదేశం అంత మంచిది కాదు. కొండ మీద నడుస్తున్నాం. జారితే ప్రమాదం. నా చేయి గట్టిగా పట్టుకో..' అన్నాడు. దానికి ఆ పిల్ల .. ''వద్దు నాన్నగారూ, నేను మీ చేయి పట్టుకున్నాననుకోండి. జారిపోవడం ఎంత ప్రమాదకరమో, మీ చేయి విడిచి పెట్టేయడం కూడా అంతే ప్రమాదకరం కావచ్చు. అందుకని నేను మీ చేయి పట్టుకోను. మీరే నా చేయి పట్టుకోండి. అప్పుడు ఎంత ప్రమాదం వచ్చినా మీరు నా చేయి వదలరు.. అది నా నమ్మకం'' అన్నది. ఆ నమ్మకం ఎంత గొప్పది. ఇది భార్యాభర్తలమధ్య జీవితాంతం అలాగే ఉండాలి... ఒకరికొకరు బాసటగా. అంతే తప్ప ఎవరి చేయి ఎవరు ఎప్పుడు పట్టుకోవాలో వాళ్ళకే తెలియకపోతే... వాళ్ల మధ్యే అభిజాత్యాలు, అహంకారాలు పుడితే, ఆ దాంపత్యం ఏం వర్ధిల్లుతుంది, దానివల్ల ఏ ప్రయోజనం సిద్ధిస్తుంది...

ఇవి చిన్న చిన్న విషయాల్లాగానే కనిపిస్తాయి. తరువాత చూసుకోవచ్చులే అని కాక .. సమస్య మొదలయిందని గుర్తించిన మరుక్షణం దృష్టి పెట్టి దిద్దుకుని జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలి.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

ఒక్కటి గుర్తు పెట్టుకోండి!

'నేనెవరో ఈ ప్రపంచానికి ఇంకా తెలియకపోవచ్చు.. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి.. నేను వైఎస్ రాజశేఖర రెడ్డి కొడుకుని' అంటూ 'యాత్ర 2' సినిమా పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్‌గా డైరెక్టర్ మహీ వి. రాఘవ్ తెరకెక్కించిన 'యాత్ర' (2019) సినిమా మంచి విజయం అందుకుంది. 'యాత్ర'కి సీక్వెల్‌గా ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బయోపిక్‌తో 'యాత్ర 2' ఉంటుందని మహీ వి.రాఘవ్ గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 8న వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా 'యాత్ర 2' అప్‌డేట్ ఉంటుందని అందరూ అనుకున్నారు. అయితే వారం ముందే అప్‌డేట్ ఇచ్చి సర్‌ప్రైజ్ చేసింది చిత్రయూనిట్. మహీ వి.రాఘవ్ దర్శకత్వంలో వి.సెల్యులాయిడ్‌పై శివ మేక నిర్మించనున్న ఈ సినిమాని 2024 ఫిబ్రవరిలో రిలీజ్ చేయనున్నట్లు ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలో 2009 నుంచి 2019 వరకు జరిగిన ఘటనల నేపథ్యంలో 'యాత్ర 2' కథ సాగుతుంది. ఇందులో జగన్ పాత్రలో 'రంగం' మూవీ ఫేమ్ జీవా నటించనున్నారు. ఆగస్టు 3 నుంచి 'యాత్ర 2' షూటింగ్ మొదలవుతుంది.



'యాత్ర 2' పోస్టర్

రంగబలితో బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం

– నాగశౌర్య

''సుధాకర్‌గారు, నేను ఎప్పటి నుంచో ఓ సినిమా చేయాలనుకున్నాం. పవన్ చెప్పిన 'రంగబలి' కథ మా ఇద్దరికీ నచ్చడంతో ఈ మూవీ చేశాం. చాలా నమ్మకంగా చెబుతున్నాను.. 'రంగబలి'తో కచ్చితంగా బ్లాక్ బస్టర్ కొడుతున్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటించిన చిత్రం 'రంగబలి'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి యాంకర్ సుమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగశౌర్య మాట్లాడుతూ–''ఇప్పటి వరకూ సుధాకర్‌గారికి వచ్చిన లాభాల కంటే 'రంగబలి' కి వచ్చే లాభాలు ఎక్కువగా ఉంటాయి. 'రంగబలి'తో పవన్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతారు'' అన్నారు. ''ఈ సినిమాలో నాగశౌర్య హీరోయిజం, ఎమోషన్ కొత్తగా చూస్తారు. సుధాకర్‌గారు ఎక్కడ రాజీపడకుండా తీశారు'' అన్నారు పవన్ బాసంశెట్టి. ''రంగబలి' టీమ్‌తో పని చేయడాన్ని చాలా ఎంజాయ్ చేశాను'' అన్నారు యుక్తి తరేజ. ''రంగబలి' పెద్ద విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్స్ కిషోర్ తిరుమల, శ్రీకాంత్ ఓదెల.


పవన్ బాసంశెట్టి, యుక్తి తరేజ, నాగశౌర్య, సుధాకర్ చెరుకూరి

జెండా కాదు.. ఆత్మగౌరవం

విరాట్‌కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటిక్ డ్రామా 'పెద్ద కాపు'. ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా తొలిభాగం 'పెద్ద కాపు-1' టీజర్‌ను ఆదివారం విడుదల చేసి, ఈ సినిమాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'ఇది కేవలం జెండా కాదురా.. మన ఆత్మగౌరవం' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''అణచివేత, ఘర్షణల నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఇద్దరు వ్యక్తుల ఆధిపత్యం ఉన్న ఓ గ్రామంలో ఒక సాధారణ వ్యక్తి పాలనను చేపట్టడం అనేది ఈ చిత్ర కథాంశం. విరాట్‌కర్ణలో మంచి ఇంటెన్సిటీ కనిపిస్తుంది' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె మేయర్.


విరాట్ కర్ణ

డిఫరెంట్ రన్నర్

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ హీరోగా, విజయ్ చౌదరి దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమాకు 'రన్నర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఢమరుక ఆర్ట్స్ పతాకంపై విజయ భాస్కర్, జి. ఫణీంద్ర, ఎం. శ్రీహరి విజయ ఈ సినిమాను నిర్మించనున్నారు. జూలై 2న (ఆదివారం) జానీ మాస్టర్ బర్త్ డే. ఈ సందర్భంగా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు మేకర్స్. విజయ్ చౌదరి మాట్లాడుతూ– ''ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. తండ్రీకుమారుల మధ్య వచ్చే సెంటిమెంట్ ఈ సినిమాకు హైలెట్'' అన్నారు. ''హైదరాబాద్‌లో జరిగిన వాస్తవ ఘటనలతో ఈ సినిమాను తెరకెక్కించనున్నాం. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్‌ని ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: పీజీ విందా.


జానీ మాస్టర్

యాక్షన్ థ్రిల్లర్

'ఓదెల రైల్వేస్టేషన్' చిత్ర దర్శకుడు అశోక్ తేజ ఓ యాక్షన్ థ్రిల్లర్‌కి శ్రీకారం చుట్టారు. ఇందులో 'జార్జిరెడ్డి', 'వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా, కేథరిన్ త్రెసా హీరోయిన్‌గా నటించనున్నారు. కేసీఆర్ ఫిల్మ్స్, శ్రీ మహావిష్ణు మూవీస్ బ్యానర్లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మించనున్న ఈ చిత్రాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా దావులూరి జగదీష్, పల్లి కేశవరావు మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఈ నెల చివరి వారంలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం. 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రాన్ని చివరి వరకూ సస్పెన్స్ రివీల్ చేయకుండా ఎంతో గ్రిప్పింగ్‌గా రూపొందించిన అశోక్ తేజ.. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను అంతకుమించి తీస్తారనే నమ్మకం ఉంది. త్వరలోనే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తాం'' అన్నారు.


కేథరిన్ త్రెసా, సందీప్ మాధవ్, అశోక్ తేజ

మనసుకు హత్తుకునే ప్రేమకథ


విజయ్ దేవరకొండ, చైతన్య, లావణ్య

'నేడే చూడండి.. మీ అభిమాన థియేటర్లలో 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' సినిమా ట్రైలర్. చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన పీరియాడికల్ లవ్‌స్టోరీ 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. 'ఇచ్చట ఫోటోలు అందంగా తీయబడును' అనేది క్యాప్షన్. బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్ బాగుంది. ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి. యూనిట్‌కు ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''1980-1990 నేపథ్యాన్ని మళ్లీ గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు చైతన్య రావ్. ''ఫస్టాఫ్ ఫన్నీగా, సెకండాఫ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా కథనం సాగుతుంది'' అన్నారు చెందు ముద్దు, యష్ రంగినేని. 'మనసుకు హత్తుకునే అందమైన ప్రేమకథ', 'చంటి జాతకంలో ప్రాణగండం ఉంది', 'ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో చావు తప్ప నాకు వేరే దారి లేదు' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

హారర్ నేపథ్యంలో...

టై సింప్కిన్స్, పాట్రిక్ విల్సన్, హియామ్ అబ్బాస్, సింక్లైర్ డేనియల్, ఆండ్రూ ఆస్టర్, రోజ్ బైర్న్ కీలక పాత్రల్లో పాట్రిక్ విల్సన్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఇంసిడియోస్: ది రెడ్ డోర్'. స్క్రీన్ జెమ్స్, స్టేజ్ 6 ఫిల్మ్స్, బ్లమ్ హౌస్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ హాలీవుడ్ సినిమా ఈ నెల 6న సోనీ పిక్చర్స్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్, తమిళ్, హిందీ భాషల్లో విడుదలకానుంది. ''ఇంసిడియోస్' హారర్ ఫ్రాంచైజీలో రూపొందిన 5వ భాగం 'ఇంసిడియోస్: ది రెడ్ డోర్'. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


'ఇంసిడియోస్' లో ఓ దృశ్యం

డిసెంబరులో యానిమల్?


రణ్‌బీర్ కపూర్

'యానిమల్' చిత్రం అనుకున్న సమయాని కన్నా కాస్త ఆలస్యంగా థియేటర్స్‌కు రానుంది. రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'యానిమల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, మురాద్ ఖేతని, అశ్విన్ వార్దే, ప్రణయ్ రెడ్డి నిర్మిస్తున్నారు. యాక్షన్, రొమాన్స్, ప్రతీకారం అంశాలతో తండ్రీకొడుకుల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. ఈ సినిమాను ఆగస్టు 11న విడుదల చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కావడం లేదని, కొన్ని కారణాల వల్ల డిసెంబరులో రిలీజ్ చేసే యోచనలో చిత్రయూనిట్ ఉన్నారని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో అనిల్‌కపూర్, బాబీ డియోల్, శక్తికపూర్ కీలక పాత్రలు పోషించారు.

నటుడు హరీశ్ మాగోన్ మృతి


హరీశ్ మాగోన్

హిందీ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ బాలీవుడ్ సీనియర్ నటుడు హరీశ్ మాగోన్(76) ఆదివారం ముంబైలో కన్నుమూశారు. ఈ విషయాన్ని సినీ, టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (సీఐఎన్‌టీఏఏ) ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. 'గోల్ మాల్, చుప్కే చుప్కే, షహెన్‌షా, నమక్ హలాల్, ఇంకార్, ముఖద్దర్ కా సికందర్, ఖుష్బూ ' వంటి పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించారు హరీశ్ మాగోన్. ఆయన చివరిగా నటించిన 'ఉఫ్ యే మొహబ్బత్' చిత్రం 1997లో విడుదలైంది. ముంబైలో హరీష్ మాగోన్ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్ కూడా నడిపారాయన. హరీష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు బాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

వినోదం.. సందేశం


ప్రియ

కమల్ తేజ నార్ల, ప్రియా శ్రీనివాస్, సూర్య తేజ కోట, విజయ్ కృష్ణ, హరి తేజ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'గోవిందా భజగోవిందా'. కార్తికేయ దర్శకత్వంలో ఉపేంద్ర, సూర్య కార్తికేయ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు త్రినాథ రావు నక్కిన విడుదల చేసి, ''ట్రైలర్లో మంచి ఫన్ ఉంది'' అన్నారు. ''వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిది. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కొంటారో కామెడీగా చూపించాం. ఈ నెల మొదటి వారంలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని సూర్య కార్తికేయ అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	803	64,718
నిఫ్టీ ▲	216	19,189

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,788	▲	197
డోజోన్స్	34,408	▲	285
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,531	▲	197
డాక్స్	16,148	▲	201
షాంఘై	3,202	▲	20
నికాయ్	33,169	▽	64


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఈవీ జోరు.. బీమా లేదంటే బేజారు!

ప్రస్తుతం మోటారు వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం థర్డ్ పార్టీ వెహికల్ ఇన్సూరెన్స్‌ను తప్పకుండా తీసుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల)కు సైతం ఇదే నిబంధన వర్తిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌కు కొత్త. ఇంత కాలం ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) వాహనాలే ఉండడంతో బీమా ఉత్పత్తులు వీటికి అనుగుణంగానే తయారయ్యాయి. వీటినే బీమా సంస్థలు ఎలక్ట్రిక్ కార్లు, స్కూటర్లకు సైతం జారీ చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు రెండు రకాల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ కాంప్రహెన్సివ్ పాలసీలు ఒక రకం. ఓన్ డ్యామేజ్ తోపాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర బీమా ఇది. మోటారు ఇన్సూరెన్స్ విభాగంలోకి రాని తక్కువ సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ వాహనాలకు అస్సెట్ ఇన్సూరెన్స్ పాలసీలను బీమా సంస్థలు విక్రయిస్తున్నాయి. ఇవి ప్రమాద నష్టాలను భర్తీ చేస్తాయి. ''25 కిలోమీటర్లకు పైగా వేగంతో నడిచే అన్ని రకాల ఈవీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ఓన్ డ్యామేజీ కవరేజీ అనేది కేవలం వాహనదారు ఇష్టం మేరకు తీసుకోవచ్చు. అదే 25 కిలోమీటర్ల కంటే తక్కువ వేగం కలిగిన ఈవీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరి కాదు. కానీ, వాహనదారులు తమ వాహనాలకు సరైన రక్షణ కల్పించుకునేందుకు వీలుగా సరిపడా బీమా రక్షణను తీసుకోవాలని మేము సూచిస్తాం''అని డిజిట్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ ఆదర్శ్ అగర్వాల్ తెలిపారు.

అన్నింటికీ కాదు..

బీమా ఉన్నంత మాత్రాన వాహనంలో ఏ నష్టం జరిగినా బీమా వస్తుందని భావించడానికి లేదు. ఈవీకి ఇది సరిగ్గా వర్తిస్తుంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) కంటే ఈవీలు భిన్నంగా తయారవుతాయి. ముఖ్యంగా ఈవీలో ఒక్క బ్యాటరీ ధరే మొత్తం వాహనం ధరలో 40 శాతం మేర ఉంటుంది. ''ఇప్పటికీ మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా చాలా తక్కువ. భారీ సంఖ్యలో అమ్మకాలు పెరిగితే తప్ప వాటికి ఎదురయ్యే నష్టాలను విశ్లేషించలేము. తగినంత డేటా, క్లెయిమ్స్ అనుభవం ఉన్నప్పుడే ఈవీలకంటూ ప్రత్యేకమైన పాలసీలను తీసుకురావడం సాధ్యపడుతుంది''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ టీఏ రామలింగం తెలిపారు. టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ కొంత కాలం క్రితం ఈవీల కోసమే ప్రత్యేకమైన పాలసీని రూపొందించినట్టు ప్రకటించింది. 'ఆటో సెక్యూర్ ఈ వెహికల్ కాంప్రహెన్సివ్ పాలసీ' పేరుతో తీసుకొచ్చిన ప్లాన్‌లో ఓన్ డ్యామేజీతో పాటు ఎలక్ట్రిక్ బ్యాటరీ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినా కవరేజీ అందులో భాగంగా ఉంది. కానీ, ఇప్పటికీ ఇది మార్కెట్లోకి రాలేదు.



అతని పేరు శివకుమార్ (40). 2022 ఏప్రిల్‌లో ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ముచ్చటపడి కొనుగోలు చేశాడు. ఆ స్కూటర్ డిటాచబుల్ బ్యాటరీ ఆప్షన్‌తో ఉంది. దాంతో బ్యాటరీని తీసి తన బెడ్‌రూమ్‌లోనే రాత్రి చార్జింగ్ పెట్టాడు. అదే బెడ్ రూమ్‌లో శివకుమార్, అతడి భార్యాపిల్లలు నిద్రించారు. అర్ధరాత్రి బ్యాటరీ నుంచి మంటలు వచ్చి గది అంతటా వ్యాపించాయి. ఈ మంటలకు శివకుమార్ ప్రాణాలు కోల్పోగా, భార్యా పిల్లలు గాయాల పాలయ్యారు. ఆ మధ్య ప్రముఖ కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్లు మంటలకు ఆహుతి కావడం తెలిసిందే. అంతెందుకు ముంబైలో ఓ ప్రముఖ కంపెనీ కారు పార్క్ చేసి ఉండగా, ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. నిజానికి కంబషన్ ఇంజన్‌తో కూడిన వాహనాల్లో అగ్ని ప్రమాదం జరగదని కాదు. కానీ, చాలా చాలా అరుదు. అదే ఎలక్ట్రిక్ వాహనాల్లో (ఈవీలు) అయితే బ్యాటరీ సిస్టమ్‌లో లోపాల వల్ల అగ్ని ప్రమాద రిస్క్ ఎక్కువగా ఉంటుంది. మరి ఈ అగ్ని ప్రమాదాలకు వాహన బీమాలో కవరేజీ ఉంటుందా? వేటికి అసలు కవరేజీ వస్తుంది? తదితర అంశాలపై అవగాహన కల్పించే కథనమే ఇది.

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఈవీ పాలసీల్లో పెద్ద లోపం ఉంది. బ్యాటరీ ఒక్కటే డ్యామేజ్ అయితే పరిహారం రాదు. మొత్తం వాహనం డ్యామేజ్ అయితేనే బీమా సంస్థలు క్లెయిమ్‌లు ఆమోదించి పరిహారం చెల్లిస్తున్నాయి. ''వాహన విడిభాగాలు విఫలమైతే మోటారు ఇన్సూరెన్స్ పాలసీల్లో కవరేజీ ఉండదు. సంప్రదాయ పాలసీల్లో అయితే ప్రమాదం వల్ల, అల్లర్లు, దోపిడీలు, వరదల వల్ల వాహనం, దాని విడిభాగాలకు నష్టం జరిగితే పరిహారం వస్తోంది''అని గల్లాగర్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ప్రాక్టీస్ లీడర్ ఎస్ భోజరాజన్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనంలో ఖరీదైన బ్యాటరీని ఎవరైనా ఎత్తుకుపోయాంటే క్లెయిమ్‌ను బీమా సంస్థలు ఆమోదించకపోవచ్చు. ఈవీలకు బ్యాటరీ అత్యంత కీలకం కనుక బ్యాటరీ ఒక్కదానికే కవరేజీ ఇచ్చే పాలసీల అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'బ్యాటరీలు, చార్జింగ్ ఎక్విప్‌మెంట్‌కు ఉద్దేశించిన ప్రత్యేకమైన పాలసీలు అవసరం. ఈవీ చార్జింగ్ సదుపాయాలతో ముడిపడిన రిస్కుల కారణంగా ఈవీలు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ప్రమాదాల వల్లే నష్టం జరగాలని లేదు. బ్యాటరీ చార్జింగ్ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం వాటిల్లితే బ్యాటరీతోపాటు, కనెక్టర్‌కూ నష్టం జరుగుతుంది. సంప్రదాయ పాలసీలో బ్యాటరీతోపాటు వాహనం కూడా అగ్నికి ఆహుతి అయితే తప్ప క్లెయిమ్‌ను ఆమోదించవు' అని భోజరాజన్ వివరించారు. అందుకే ఈవీలకే ఉద్దేశించిన ప్రత్యేక పాలసీల అవసరం ఉందని అన్నారు.

మనం ఏమి చేయగలం?

బీమా సంస్థలు పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను అర్థం చేసుకుంటున్నాయి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాల తరమే కనుక ఈవీల కోసం ప్రత్యేక పాలసీలకు రూపకల్పన చేస్తున్నాయి. కనుక వాహనదారులు అన్ని బీమా సంస్థలను సంప్రదించిన తర్వాతే పాలసీని ఎంపిక చేసుకోవాలి. బ్యాటరీ కవరేజీతో కూడిన ప్లాన్‌ను ఏదైనా సంస్థ ఆఫర్ చేస్తే ఎంపిక చేసుకోవడం మెరుగు. ప్రీమియం కొంచెం ఎక్కువైనా, బ్యాటరీ కవరేజీతో కూడిన ప్లాన్‌ను తప్పక తీసుకోవాలన్నది నిపుణుల సూచన. మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్న కొద్దీ బీమా సంస్థలు కూడా ఈవీల కోసమే ఉద్దేశించిన ఎన్నో ఫీచర్లతో పాలసీలను అందుబాటులోకి తెస్తాయి. కేవలం థర్డ్ పార్టీ డ్యామేజ్ కాకుండా ఓన్ డ్యామేజ్ కవరేజీతో కూడిన కాంప్రహెన్సివ్ పాలసీకే ప్రాధాన్యం ఇవ్వాలి. రైడర్లను కూడా యాడ్ చేసుకోవడాన్ని పరిశీలించాలి. డిప్రీసియేషన్ కవర్, గ్యాప్ వ్యాల్యూ కవర్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్ తీసుకోవాలని లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్ ప్రెసిడెంట్ ఉదయన్ జోషి సూచించారు. ముఖ్యంగా ఈవీ వాహనదారులు రిటర్న్ టు ఇన్వాయిస్ రైడర్‌ను తీసుకోవాలని పాలసీబజార్ మోటార్ రెన్యువల్స్ హెడ్ అశ్విని దూబే సూచించారు. ఈ రైడర్‌తో వాహనం ఇన్వాయిస్ విలువ మేర పరిహారం పొందొచ్చన్నారు. కారు చోరీకి గురైనా లేక రిపేర్ చేయడానికి అనుకూలంగా లేని రీతితో దెబ్బతిన్నా లేక అగ్ని ప్రమాదంతో మొత్తం నష్టం వాటిల్లినప్పుడు ఈ రైడర్ కింద పరిహారం వస్తుందన్నారు. పాలసీ కొనుగోలుకు ముందే వేటికి కవరేజీ వస్తుంది, వేటికి మినహాయింపు ఉన్నదీ తప్పకుండా అడిగి తెలుసుకోవాలి.

ప్రీమియం భారం అనుకోవద్దు..

ఈవీలకు ఇచ్చే బీమా పాలసీల ప్రీమియం ఎక్కువగా ఉంటుందనుకోవడం పొరపాటు. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ వాహనాల కంటే ఈవీలకు థర్డ్ పార్టీ కవర్ 15% వరకు తక్కువ. ''ఐసీఈ వాహనాలతో పోలిస్తే ఈవీ కార్లు, బైక్‌లకు కాంప్రహెన్సివ్ కవరేజీ ప్రీమియం 5–20% వ్యత్యాసంతో ఉంటోంది. ఓన్ డ్యామేజ్ కవరేజీలోనూ స్వల్ప వ్యత్యాసం ఉంటోంది. ఏడాది కాలానికి 30 కిలోవాట్ అవర్ ఎలక్ట్రిక్ కారుకు థర్డ్ పార్టీ ప్రీమియం రూ.2,000 స్థాయిలో ఉంది. అదే ఐఈసీ వాహనాలకు (1,000 సీసీ మించని) ప్రీమియం మరో రూ.200 వరకు అటూ ఇటూగా ఉంటోంది. 'ఈవీలకు ప్రీమియం, బీమా సంస్థ ధరల విధానంపైనే ఆధారపడి ఉంటుంది. ఈవీ తయారీ, మోడల్, బ్యాటరీ సామర్థ్యం, ప్రాంతం, వాహనం వయసు వంటి అంశాలు ప్రీమియం ధరపై ప్రభావం చూపిస్తాయి' అని ఉదయన్ జోషి వెల్లడించారు. ఈవీలకు సంబంధించి మరిన్ని క్లెయిమ్‌లు వస్తే కానీ, ప్రీమియం మెరుగ్గా మారగలదన్నారు. ఈవీలకు ఉన్న రిస్కుల నేపథ్యంలో వాటికంటూ ప్రత్యేకమైన ఉత్పత్తులు తీసుకువచ్చేందుకు ఐఆర్‌డీఏఐ సైతం బీమా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఒకే పాలసీలో జీవిత, ఆరోగ్య బీమా ప్రయోజనాలు

• 'ఐషీల్డ్' పాలసీ



ముంబై: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు కలిసి 'ఐషీల్డ్' పేరిట కొత్త బీమా పాలసీని ప్రవేశపెట్టాయి. ఇటు ఆరోగ్య బీమా, అటు జీవిత బీమా ప్రయోజనాలు ఉండేలా ఈ పథకాన్ని తీర్చిదిద్దాయి. వైద్య చికిత్సల వ్యయాలకు కవరేజీ ఇస్తూనే పాలసీదారు దురదృష్టవశాత్తూ మరణించిన పక్షంలో కుటుంబానికి పెద్ద మొత్తంలో సమ్ అష్యూర్డ్‌ను అందించేలా ఈ పాలసీ ఉంటుందని ఐసీఐసీఐ లాంబార్డ్ ఈడీ సంజీవ్ మంత్రి తెలిపారు. చికిత్స వ్యయాల భారం పడినా, ఇంటిపెద్దకు ఏదైనా జరిగినా కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఈ సమగ్రమైన బీమా పథకం తోడ్పడగలదని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా వివరించారు. హాస్పిటలైజేషన్, డే–కేర్ ట్రీట్‌మెంట్ మొదలైన వాటికి ఆరోగ్య బీమా భాగం ఉపయోగపడనుండగా, జీవిత బీమా భాగంతో.. 85 ఏళ్ల వయస్సు వరకూ లైఫ్ కవరేజీ ఉంటుంది.

ఎస్‌బీఐకు కొత్త సీఎఫ్‌వో

కొడవంటి కామేశ్వర రావు ఎంపిక




ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త సీఎఫ్‌వోగా కొడవంటి కామేశ్వర రావును ఎంపిక చేసినట్లు తా జాగా పేర్కొంది. 1991 నుంచి బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న కామేశ్వర రావు 2023 జూలై 1నుంచి సీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేసింది. సీఎఫ్‌వోగా రాజీనామా చేసిన చరణ్‌జిత్ సురీందర్ సింగ్ అత్రా స్థానే కామేశ్వర రావును నియమించినట్లు వెల్లడించింది. చార్టెర్డ్ అకౌంటెంట్ అయిన కామేశ్వర రావు బ్యాంకింగ్, ఫారెక్స్, ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాలలో విధులు నిర్వర్తించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ తెలియజేసింది.

మరోవైపు, చిన్న వ్యాపారాలు చేసుకునే కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ఎస్‌బీఐ 34 ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్ హబ్‌లను ఏర్పాటు చేసింది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 21 జిల్లా కేంద్రాల్లో వీటిని నెలకొల్పినట్లు ఎస్‌బీఐ తెలి పింది. ప్రీ–లాంచ్‌లో ఈ కేంద్రాల్లో రూ. 1,000 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు వివరించింది.

భారత్ డైనమిక్స్	ఐసీఐసీఐ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,123
టార్గెట్: రూ. 1,325



ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) యాజమాన్యం ఇటీవల ఇన్వెస్టర్లతో నిర్వహించిన సమావేశంలో కొన్ని కీలక అంశాలను ప్రస్తావించింది. వీటి ప్రకారం 2025 ఆర్థిక సంవత్సరం తదుపరి రక్షణ శాఖకు సంబంధించిన పలు ఆర్డర్లను పొందేందుకు అవకాశముంది. డీఆర్‌డీవోతో సహకారం ఇందుకు తోడ్పాటును అందించనుంది. దీనికి తోడు విదేశీ దిగ్గజాలతో సాంకేతిక సహకార ఒప్పందాలు, కంపెనీ సొంత పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ) సైతం కాంట్రాక్టులు సాధించేందుకు దోహదపడనున్నాయి. రూ. 2,600 కోట్ల విలువైన ప్రస్తుత ఎగుమతుల ఆర్డర్ బుక్ ప్రభుత్వ రంగ సంస్థలలోకెల్లా అత్యధికంకాగా.. కంపెనీ మొత్తం ఆర్డర్ల విలువలో 10 శాతానికి సమానంకావడం ప్రస్తావించదగ్గ విషయం! కంపెనీకి గల పటిష్ట ఆర్డర్ బుక్ విభిన్నతరహా ఆర్జనకు వీలు కల్పించనుంది. నీటిఅడుగున వినియోగించే ఆయుధాల విభాగంలో భారీ నౌకా విధ్వంసక(హెవీవెయిట్ టోర్పెడో) ఆయుధ ప్రయోగాలు అన్ని అంశాలలోనూ విజయవంతంకావడంతో పలు అవకాశాలకు తెరలేవనుంది. వెరసి 2026కల్లా ఎలక్ట్రికల్ హెవీవెయిట్ టోర్పెడోలకు, 2027కల్లా ఆధునిక(అడ్వాన్స్‌డ్) లైట్‌వెయిట్ టోర్పెడోలకు ఆర్డర్లు లభించగలవని అంచనా వేస్తోంది. దీంతో సమీప భవిష్యత్‌లో కంపెనీ ఆదాయ ఆర్జనకు సముద్రగర్భ ఆయుధ విభాగం అదనపు బలాన్నిచ్చే వీలుంది. అయితే ఇకపై ఆయుధ సామగ్రికి సంబంధించిన విజయవంత పరీక్షలు వంటి అంశాలు ఆదాయ వృద్ధిపై ప్రభావాన్ని చూపనున్నాయి.

హీరో మోటోకార్ప్	జేఎం ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,905
టార్గెట్: రూ. 3,200




ఎందుకంటే: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ యాజమాన్యం ఇటీవల విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. వీటి ప్రకారం ఇకపై కంపెనీని మరింత లాభదాయకంగా పరుగు పెట్టించేందుకు యాజమాన్యం పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తోంది. పలు చర్యలు తీసుకుంటోంది. ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టెక్, జూమ్ ప్రొడక్టులకు వినియోదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ బాటలో మరిన్ని కొత్త మోడళ్లను ప్రవేశపెట్టనుండటంతో ప్రొడక్టుల పైప్‌లైన్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. సమీప భవిష్యత్‌లో 125 సీసీ విభాగంలో ప్రీమియం మోటార్ సైకిళ్లు, స్కూటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయనుంది. ప్రొడక్టుల కొనుగోలులో డిజిటల్ సౌకర్యాల కల్పన ద్వారా కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తోంది. తద్వారా కస్టమర్లను కొనుగోళ్లవైపు ఆకట్టుకునేందుకు హీరో 2.0 బ్రాండుతో 500కుపైగా స్టోర్లను ప్రారంభించే వ్యూహంలో ఉంది. ఈ బాటలో 100 ప్రత్యేక ప్రీమియం షోరూములకు తెరతీయనుంది. సమీప కాలంలో ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) విక్రయాలను పెంపొందించుకోవడంపై దృష్టి సారించనుంది. నెట్‌వర్క్ విస్తరణ, విభిన్న ప్రొడక్టుల విడుదల ద్వారా ఇందుకు దన్నుగా నిలవనుంది. ముడివ్యయాలు తగ్గడం, విడిభాగాల గరిష్ట విక్రయాలు, స్థానిక తయారీ, పటిష్ట నిర్వహణ బలం వంటి అంశాలు మార్జిన్లు మరింత పుంజుకునేందుకు దోహదపడనున్నాయి. ఈవీ కంపెనీ ఏథర్‌లో 35 శాతం వాటాను కలిగి ఉంది. మరోవైపు హైఎండ్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల అభివృద్ధికి జీరో మోటార్‌సైకిల్స్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈవీ విభాగంలో ఇతర సంస్థల కొనుగోళ్లకూ యోచిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంచుకోవచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ఇటీవలే ప్రత్యామ్నాయ రుణ సాధనాల గురించి వింటున్నాను. ముఖ్యంగా ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌ల గురించి తెలిసింది. వీటికి మంచి చరిత్ర ఉందా? అవి 12 శాతం వరకు రాబడిని ఆఫర్ చేస్తున్నాయి. వీటితో ఏదైనా రిస్క్ ఉంటుందా? – శ్రీరామ్ రామనాథన్

ఈక్విటీలన్నవి సంపద సృష్టికి అనుకూలమైనవి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్) సాధనాలు పెట్టుబడి రక్షణ, క్రమం తప్పకుండా ఆదాయం కోసం ఉద్దేశించినవి. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ప్రత్యామ్నాయ సాధనాలు) సంప్రదాయ ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, నగదుకు అదనపు వ్యూహాలు మాత్రమే. ఇవి ప్రధానంగా ఐదు విభాగాలు. హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్యాపిటల్, నేచురల్ రీసోర్సెస్, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. వీటన్నింటిలోనూ లిక్విడిటీ తక్కువ. నియంత్రణలు తక్కువ. పారదర్శకత తక్కువ. వ్యయాలు ఎక్కువ. రిస్క్, రాబడులకు సంబంధించి చారిత్రక డేటా తక్కువగా ఉంది. అందుకని ఈ అస్సెట్ క్లాస్ (ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్) అనేది రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు సూచనీయం కాదు.

ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్

వ్యాపారాలకు స్వల్పకాల రుణ సదుపాయమే ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్. సాధారణంగా వీటిని బ్యాంకులు సమకూరుస్తుంటాయి. ప్రైవేటు క్యాపిటల్ పరిధిలోకి ఇవి వస్తాయి. ఇది చాలా పూర్వం నుంచి ఉన్న సాధనం. బ్యాంకులే దీనికి సారథ్యం వహిస్తున్నాయి. ఇందులో రాబడులు పరిమితం. నూరు శాతం నష్టానికి అవకాశం ఉంటుంది. ఇది ఎలా పనిచేస్తుందంటే.. మీరు ఏదైనా కంపెనీకి రుణంపై వస్తువులు సరఫరా చేశారనుకుందాం. దానికి బిల్లు జారీ చేస్తారు. రుణ కాల వ్యవధి ముగిసిన తర్వాత ఆ బిల్లు మొత్తాన్ని కొనుగోలుదారుడు చెల్లిస్తాడు. ఈ రుణం కాల వ్యవధి సాధారణంగా 30–90 రోజులుగా ఉంటుంది. అంటే మీరు సరఫరా చేసిన వస్తువుల బిల్లు మొత్తం మీకు తిరిగి వచ్చేందుకు ఇన్ని రోజుల పాటు ఆగాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ లోపే మీకు డబ్బులు అవసరపడ్డాయని అనుకుంటే అప్పుడు బ్యాంకు వద్దకు వెళ్లి ఈ బిల్లును ఇచ్చి దాన్ని నగదుగా మార్చుకోవచ్చు. మరి బ్యాంకులకు ఇందులో ప్రయోజనం ఏమిటి? బ్యాంకులు ఈ బిల్లు మొత్తంలో కొంత తగ్గించి మిగిలినది ఇస్తాయి. అందుకే దీనికి ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అనే పేరు వచ్చింది. నూరు సంవత్సరాలకు పైగా బ్యాంకులు ఈ వ్యాపారం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో రిటైల్ ఇన్వెస్టర్లకు సైతం ఇది అందుబాటులోకి వచ్చింది. పలు ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు వీటిని ఆఫర్ చేస్తున్నాయి. ఇన్‌వాయిస్‌కు మీరు ఫండ్ సమకూర్చిన తర్వాత, డబ్బులు తిరిగి రాకపోతే పరిస్థితి ఏంటి? అన్నది ఆలోచించుకోవాలి. ఇన్వెస్టర్‌గా రాబడుల కంటే రిస్క్‌ను అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమైనది. అదే బ్యాంకులు అయితే డిఫాల్ట్ ఎదురైతే వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని కలిగి ఉంటాయి. ఇందులో లిక్విడిటీ ఉండదు. మీరు విక్రయించాలనుకుంటే కొనుగోలు చేసే వారు లభించడం కష్టం. వీటికంటే ఈక్విటీలు మెరుగైన సాధనం.

కారు కొనుగోలుకు రూ.7 లక్షల రుణం తీసుకున్నాను. దీన్ని ఏడేళ్ల కంటే ముందుగా తీర్చేసేందుకు ఏవైనా ఫండ్స్‌ను సూచించగలరా? – ఆదిత్య



కారు రుణాన్ని ముందుగా చెల్లించేయాలన్న మీ ఆలోచన మంచిది. అయితే కారు వంటి తరిగిపోయే ఆస్తి కొనుగోలుకు రుణం తీసుకోవడాన్ని సాధారణంగా ప్రోత్సహించం. మీరు ఏడేళ్లలోపు రుణం తీర్చేయాలని అనుకుంటున్నారు కనుక.. మీరు స్వల్పకాలం నుంచి మధ్యకాలిక మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. దీనివల్ల మీరు పెట్టుబడిని రక్షించుకోవడంతోపాటు రాబడులు సొంతం చేసుకోగలరు. మూడు నుంచి నాలుగేళ్ల తర్వాత కారు రుణాన్ని చెల్లించేద్దామని అనుకుంటే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం ఒక ఆప్షన్. ఇవి ఈక్విటీ, డెట్‌లో ఇన్వెస్ట్ చేసి, అచ్చమైన డెట్ కంటే మెరుగైన రాబడులు ఇస్తాయి. మూడు నాలుగేళ్లలోపే తీర్చేయాలని భావిస్తే ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు.

6 నెలల్లో 20 లక్షల వాహన విక్రయాలు

• జూన్ 'ఆటో' అమ్మకాలు అంతంతే..



ముంబై: ఈ ఏడాది ప్రథమార్ధం వాహన పరిశ్రమకు అత్యుత్తమంగా నిలిచింది. ప్యాసింజర్ విభాగంలో మొత్తం 20 లక్షల వాహనాలు విక్రమయ్యాయి. ఇక నెలవారీగా జూన్ ఆటోమొబైల్ పరిశ్రమకు పెద్దగా కలిసిరాలేదు. మొత్తం 3.37 లక్ష వాహన అమ్మకాలు జరిగాయి. ఏడాది ఇదే నెలలో సరఫరా చేసిన 3.21 లక్షల వాహనాలతో పోలిస్తే ఇది 1.9% మాత్రమే అధికంగా ఉంది. కార్ల తయారీ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్ మోటార్.. అమ్మకాల్లో ఓ మోస్తరు వృద్ధి నమోదైంది.

- మారుతి సుజుకీ జూన్‌లో మొత్తం 1,33,027 యూనిట్లను విక్రయించింది. గత ఏడాది ఇదే నెల విక్రయాలతో పోల్చితే కేవలం ఎనిమిది శాతం (1,22,685 యూనిట్లు) వృద్ధి నమోదైంది. వడ్డీ రేట్లు అధికంగా ఉండటంతో పాటు రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చన్న అంచనాలు విక్రయాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాల్లో కేవలం 2 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది. కంపెనీ ఈ కాలంలో 50,001 యూనిట్లను మాత్రమే విక్రయించింది.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ ఎంజీ మోటార్, టాటా మోటార్స్ విక్రయాలు వరుసగా 19%, 14%, ఒక శాతం పెరగగా కియా, హోండా కార్ల విక్రయాలు మాత్రం వరుసగా 19%, 35% మేరకు క్షీణించాయి.

కంపెనీ	జూన్ 2023	జూన్ 2022	మొత్తం అమ్మకాలు
మారుతీ	1,33,027	1,22,685	(+)8%
హ్యుందాయ్	62,351	50,001	(+)5%
టాటా మోటార్స్	79,606	80,383	(–)1%
టాటా కిర్లోస్కర్	19,608	18,237	(+)19%
హోండా కార్స్	5,080	7,834	(–)35%
ఎంజీ మోటార్స్	5,125	4,504	(+)14%
కియా	19,391	24,024	(–)19%
ద్విచక్ర వాహనాలు			
హీరోమోటో కార్ప్	4,36,993	4,84,867	(–)8%
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,109	61,407	(–)26%

క్లుప్తంగా...

ఉచిత ల్యాప్‌టాప్‌లు ఇస్తామని మోసాలు

ఫోన్‌కు లింకులు పంపుతున్న సైబర్ నేరగాళ్లు



సాక్షి, హైదరాబాద్: విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెర తీస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రైవేటు వ్యక్తులతో ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్నట్టు ఫోన్ సందేశాలను పంపుతున్నారు. వాటిలో వివరాలు నమోదు చేయాలంటూ కొన్ని యూఆర్‌ఎల్ లింక్‌లను జత చేస్తున్నారు. ఇవి నిజమైనవని ఎవరైనా నమ్మి ఆ లింక్‌లను తెరిస్తే అందులో ప్రాథమిక సమాచారం, ఆధార్, ఫోన్, బ్యాంకు ఖాతా నంబర్లు.. ఇలా పూర్తి సమాచారాన్ని కొల్లగొడుతున్నారు. ఫోన్‌లోకి మాల్‌వేర్‌ను మనకు తెలియకుండానే ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఇలా వారి వలకు ఎవరైనా చిక్కితే సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను కొల్లగొడుతున్నట్టు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ అధికారులు హెచ్చరించారు. ఉచిత ల్యాప్‌టాప్‌ల పేరిట వచ్చే సందేశాలను నమ్మవద్దని వారు కోరుతున్నారు.

స్టే సేఫ్ ఆన్‌లైన్ క్విజ్

- ఆన్‌లైన్ మోసాలపై అవగాహన..
- పోటీల గడువు ఈనెల 31

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన పెంచేందుకు కేంద్ర హోంశాఖ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా 'స్టే సేఫ్ ఆన్‌లైన్..' నేపథ్యంతో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. పోటీలకు ఈనెల 31 వరకు గడువుందని అధికారులు పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనదలచిన వారు https://www.mygov.in/staysafeonline లింక్ పై క్లిక్ చేస్తే అదనపు వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, https://t.me/ssoindia లింక్ ద్వారా గ్రూప్‌లో చేరొచ్చు. ఈ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనే వారికి ఒక్కొక్కరికి 10 ప్రశ్నలు ఇస్తారు.. 5 నిమిషాల వ్యవధిలో వీటికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. క్విజ్‌లో టాప్ 10లో నిలిచే విజేతలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు పురస్కారం ఇవ్వనున్నారు. క్విజ్‌లో పాల్గొని 50 శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి డిజిటల్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.



అందాల యాదాద్రి

యాదాద్రి వెళ్లే భక్తులకు ప్రకృతి సోయగాలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. రెండు కొండలను చీల్చుతున్నట్టున్న రాయగిరి నుంచి యాదాద్రి క్షేత్రానికి వెళ్లే రోడ్డు మార్గం కనువిందు చేస్తోంది. ఇదే మార్గంలో రాయగిరి చెరువు ఒకవైపు రైలు మార్గం, మరో వైపు రోడ్డు మార్గం మధ్యలో ఉన్నట్టున్న దృశ్యం కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

అద్భుతంగా మన్యంకొండ రోప్‌వే

స్విట్జర్లాండ్, ద.కొరియా రోప్‌వేల కంటే గొప్పగా నిర్మిస్తాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: మన్యంకొండ దేవాలయం వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా రోప్‌వేను నిర్మిస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక అధ్యయనంలో భాగంగా దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి, ఆ దేశంలోని యసూ నగరంలో ఉన్న ప్రఖ్యాత కేబుల్ కార్ రోప్‌వేను సందర్శించారు. పర్యటనలో భాగంగా కేబుల్ కార్‌ను పరిశీలించి అందులో ప్రయాణించారు. ప్రస్తుతం మన్యంకొండ వద్ద నిర్మాణంలో ఉన్న రోప్ వే స్విట్జర్లాండ్ తరహాలో అద్భుతంగా చేపట్టామని... యసూ కేబుల్ కార్‌ను పరిశీలించిన నేపథ్యంలో కొన్ని సూచనలు చేయటం ద్వారా ఈ రెండింటికంటే ఇంకా ఆధునికంగా నిర్మిస్తామని తెలిపారు. దేశీయ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించడమే లక్ష్యంగా మన్యంకొండ రోప్‌వే నిర్మాణం ఉండనుందన్నారు. కొండ దిగువన పర్యాటకుల సౌకర్యం కోసం విశాలమైన హరిత పర్యాటక హోటల్ కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ పర్యాటక అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, ఫలితంగానే అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. మంత్రి వెంట నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్, పర్యాటకశాఖ ఎం.డి మనోహర్ తదితరులు ఉన్నారు.



రోప్‌వేను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జడ్చర్ల కోనేరుకు వెయ్యేళ్ల చరిత్ర

పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి



కోనేరును పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరుకు వెయ్యేళ్ల చరిత్ర ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి తెలిపా రు. ఆయన ఆదివారం కోనేరును సందర్శించి పలు ఆసక్తికర వివరాలను వెల్లడించారు. ఈ కోనేరును కల్యాణ చాళుక్యుల కాలంలో క్రీ.శ.11వ శతాబ్దిలో నిర్మించినట్లు మండపంలోని స్తంభాలు, శిథిల శిల్పాలను బట్టి తెలుస్తోందని వివరించారు. జడ్చర్లలో కల్యాణ చాళుక్యల శాసనం, కందూరు చోళుల శాసనం ఉన్నాయన్నారు. జడ్చర్ల పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న క్రీ.శ.1125, ఫిబ్రవరి 19 నాటి కల్యాణ చాళుక్య చక్రవర్తి భూలోక మల్ల మూడో సోమేశ్వరుడి శాసనంలో.. ఆయన కుమారుడైన మూడో తైలపుడు యువరాజుగా కందూరును పాలిస్తుండగా గంగాపురంలో ఒక జైన చైత్యాలయాన్ని నిర్మించినట్లుందని తెలిపారు. ఆలయం వెలుపల క్రీ.శ.11వ శతాబ్దికి చెందిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని భద్రపరిచారన్నారు. రెండు వైపుల మెట్లు, మండపాలు కదిలిపోయాయని పేర్కొన్నారు. వీటికి మరమ్మతులు చేసి కోనేరుకు పూర్వ వైభవం తీసుకురావచ్చని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.